

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 159

సోమవారం 29-8-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





9 ఏళ్ల నిరీక్షణకు 12 సెకన్లలో తెర

■ సుప్రీంకోర్టు ఆదేశాలతో అధికార యంత్రాంగం నోయిడాలోని జంట టవర్లను కూల్చివేసింది. ఆదివారం మధ్యాహ్నం 2.30 సమయంలో చేపట్టిన పేలుడు ప్రక్రియతో 12 సెకన్లలోనే 32, 29 అంతస్తుల టవర్లు రాళ్ల దిబ్బలుగా మారాయి. వీటిని కూల్చివేసేందుకు 3,700 కిలోల పేలుడు పదార్థాలను ఉపయోగించారు. కూల్చివేత వల్ల తమకు రూ.500 కోట్ల నష్టం వాటిల్లిందని సూపర్‌టెక్ లిమిటెడ్ తెలిపింది.

6లో

ఆదివారం మధ్యాహ్నం నేలమట్టమవుతున్న నోయిడా జంట టవర్లు



జయం మనదే..

- వివరాలు 12లో

ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన భారత జట్టు ఆసియా కప్ టి20 టోర్నీలో శుభారంభం చేసింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో టీమిండియా ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. పాకిస్తాన్ 19.5 ఓవర్లలో 147 పరుగులకు ఆలౌట్ కాగా.. టీమిండియా 19.4 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 148 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండ్ ప్రతిభతో అలరించాడు. భువనేశ్వర్ 4 వికెట్లు తీసి విజయంలో కీలక పాత్ర పోషించాడు.

అక్టోబర్ 17న కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక

■ కాంగ్రెస్ జాతీయ అధ్యక్ష ఎన్నికను అక్టోబర్ 17న నిర్వహించనున్నట్లు ఆ పార్టీ సెంట్రల్ ఎలక్షన్ అథారిటీ చైర్మన్ మధుసూదన్ మిస్త్రీ చెప్పారు. సెప్టెంబర్ 24 నుంచి నామినేషన్ల ప్రక్రియ కొన సాగుతుందని.. ఒకరి కంటే ఎక్కువ మంది బరిలో నిలిస్తే అక్టోబర్ 17న ఎన్నిక నిర్వహిస్తామని తెలిపారు.

6లో

'మత్తు'కు ముకుతాడు

ఏవోబీ గిరిజన గూడేల్లో గంజాయి సాగుకు అడ్డుకట్ట.. సంప్రదాయ పంటలతో బంగారు భవితకు బాటలు

- ప్రభుత్వ చర్యలతో గిరిజనంలో మార్పు.. సంక్షేమాభివృద్ధి పథకాలతో సత్ఫలితాలు
- 2.5 లక్షల ఎకరాలకు ఆర్‌ఓఎఫ్‌ఆర్, డీకేటీ పట్టాలు
- పంటలు సాగు చేసే వారందరికీ రైతు భరోసా
- ఆర్బీకేలు, ఇతరత్రా అన్ని విధాలా అండగా నిలిచిన ప్రభుత్వం
- వీటన్నింటికీ తోడు పోలీసుల 'ఆపరేషన్ పరివర్తన్'

2లో





గతంలో గంజాయి సాగుతో ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా సుర్మతి సమీపంలోని కొండ ప్రాంతం.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో నేడు ఇలా వరి పంటతో కళకళలాడుతోంది.

అది ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల్లోని అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం కొండల్లో 50 గడపలు ఉన్న గిరిజన గూడెం చిన వాకపల్లి. ఈ ఊళ్లోని గిరిజనులు ప్రస్తుతం 150 ఎకరాల్లో రాగులు, పసుపు, మొక్క జొన్న, వరి, కందులు తదితర సంప్రదాయ, వాణిజ్య పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో విశేషం ఏంటంటే.. ఇక్కడ ఈ పంటలన్నీ దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత తొలిసారిగా ఈ ఏడాదే సాగు చేయడం. అక్రమం అని తెలిసినా నాలుగు దశాబ్దాలుగా బతుకుదెరువు కోసం గంజాయి సాగే వారికి ఆదరవుగా నిలిచింది. అప్పట్లో పోలీసులకు చిక్కి నెలల తరబడి జైళ్లలో మగ్గిందీ ఈ గిరిజన బిడ్డలే. అయితే అదంతా గతం. ప్రభుత్వ చర్యల వల్ల పచ్చటి పంటలతో ఏవోబీ ముఖ చిత్రం మారిపోయింది.

'చవితి'పైనా రాజకీయమా?

- 2014–19 మధ్య ఉన్న నిబంధనల ప్రకారమే మండపాలకు అనుమతులు
- మండపాల విద్యుత్ చార్జీలను రూ.వెయ్యి నుంచి తగ్గించాం
- చంద్రబాబు, సోము వీర్రాజులపై ఎమ్మెల్యే విష్ణు ఫైర్
- వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



సాక్షి, అమరావతి: వినాయక చవితి పండగను సైతం రాజకీయాలకు వాడుకోవాలని బీజేపీ, టీడీపీలు దుష్ట ఆలోచన చేస్తున్నాయని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మండిపడ్డారు. విఘ్నాలను తొలగించే వినాయకుడి మండపాలు, పందిళ్ల విషయంలో ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు పెట్టకపోయినా బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు, టీడీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం విష్ణు


మిగతా 2వ పేజీలో ▶

శ్రీశైలంలోకి పెరిగిన వరద

జూరాల, సుంకేశుల నుంచి వస్తున్న 2.79 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

- 7 గేట్లు పదడుగులు ఎత్తి 1.96 లక్షల క్యూసెక్కులు దిగువకు
- కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి
- సాగర్‌లోకి 2.09 లక్షల క్యూసెక్కుల ప్రవాహం.. అదేస్థాయిలో దిగువకు
- ప్రకాశం బ్యారేజ్ నుంచి 1.45 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి

2లో



సాగర్ నుంచి దిగువకు ప్రవహిస్తున్న కృష్ణమ్మ

నేడు తెలుగు భాషా దినోత్సవం

- విశాఖలో రాష్ట్ర స్థాయి కార్యక్రమం
- 43 మంది తెలుగు కవులు, పండితులకు పురస్కారాలు

2లో

పాక్‌లో వరదలకు మరో 119 మంది బలి

■ పాకిస్తాన్‌ను భారీ వర్షాలు, వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. ఇళ్లు, రోడ్లు, వంతెనలు ధ్వంసమవుతున్నాయి. వరదల వల్ల గత 24 గంటల్లో 119 మంది మరణించారు. దీంతో మృతుల సంఖ్య 1,033కు చేరింది.

6లో



క్లుప్తంగా

సీఎం జగన్ దంపతులకు గవర్నర్ పెళ్లి రోజు శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ భారతి దంపతుల పెళ్లి రోజు సందర్భంగా గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఆదివారం వారికి ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ దంపతులపై జగన్నాథస్వామి, తిరుమల బాలాజీ ఆశీస్సులు కురిపించాలని ఆకాంక్షించారు. సీఎం దంపతులకు కలకాలం ఆరోగ్యాన్ని, ఆనందాన్ని ప్రసాదించి.. సుసంపన్నమైన జీవితాన్ని అందించాలని గవర్నర్ అభిలషించారు.

ప్రభుత్వ నిర్ణయంపై మున్నూరు కాపుల హర్షం

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మున్నూరు కాపులు

ఎటపాక(అల్లూరి సీతారామరాజు జిల్లా): మున్నూరు కాపు కులస్తులకు బీసీ–డీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఎటపాక మండలం తోటపల్లిలో మున్నూరు కాపులు సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డివిజన్ కాపు సంఘం అధ్యక్షుడు ఆకిశెట్టి ఉమాశంకర్‌నాయుడు, గంజి వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ సీఎం జగన్ పేదల పక్షపాతి అని మరోసారి నిరూపించుకున్నారని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో మున్నూరు కాపులు బీసీ–డీ లుగా ఉన్నారని, అయితే రాష్ట్ర విభజన తర్వాత విలీన మండలాల ప్రజలకు చంద్రబాబు ప్రభుత్వం కుల ధ్రువీకరణ పత్రాల జారీని నిలిపివేసి ఇబ్బంది పెట్టిందని గుర్తుచేసుకున్నారు. దీంతో మున్నూరు కాపులు విద్య, ఉపాధి రంగాలకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తమగోడును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు కృషితో సీఎం స్పందించి జీవో ఇవ్వడం హర్షణీయమన్నారు. ఏడు విలీన మండలాల్లోని మున్నూరు కాపులంతా సీఎం జగన్‌కు రుణపడి ఉంటారని చెప్పారు కార్యక్రమంలో సంఘం నేతలు మారాసు గంగాధర్, ఆకుల వెంకటరామారావు, మారాసు సత్యనారాయణ, రంభాల నాగేశ్వరరావు, గంజి సత్యానందం, అనసూరి శ్రీనివాస్, ములిశెట్టి రమేష్, బండారు శివాజీ తదితరులున్నారు.

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన తాడేపల్లి రైతులు

యు–1 రిజర్వ్ జోన్ ఎత్తివేతపై హర్షం



తాడేపల్లిరూరల్: తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేసిన యు–1 రిజర్వ్ జోన్‌ను తాజాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎత్తివేసిందంటూ సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ రైతులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణ ప్రాంతం, కుంచనపల్లి, కొలనుకొండ ప్రాంతాల్లో యు–1 రిజర్వ్ జోన్ ఏర్పాటు చేసినట్టు టీడీపీ ప్రభుత్వం ప్రకటించింది. దీంతో రైతులు ఆ ప్రాంతంలోని భూములను అమ్ముకునేందుకు అవకాశం లేకుండాపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక యు–1 రిజర్వ్ జోన్‌ను ఎత్తివేయాలంటూ రైతులు 145 రోజులు రిలే దీక్షలు చేయడంతో ప్రభుత్వం ఒక కమిటీని వేసింది. కమిటీ నివేదిక ఇవ్వడంతో యు–1 రిజర్వ్ జోన్‌ను ఎత్తివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చిందని రైతులు చెప్పారు. ఈ నేపథ్యంలో ఎడ్ల బండ్లపై సీఎం జగన్, వైఎస్సార్ ఫ్లెక్సీలతో ప్రభలను ఏర్పాటు చేసి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల రాష్ట్ర కన్వీనర్ దొంతిరెడ్డి వేమారెడ్డి, సీపీఎం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, రైతు సంఘం నేత జొన్నా శివశంకరరావు పాల్గొన్నారు.

తెలంగాణ గవర్నర్ తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు ప్రజలందరికీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుభాకాంక్షలు తెలిపారు. దేశభాషలందు తెలుగు లెస్స.. ఇటాలియన్ ఆఫ్ ఈస్ట్ అని తెలుగు భాష గొప్పతనం గురించి ఎందరో మహానుభావులు చెప్పారని ఆమె గుర్తు చేశారు. దేశంలో ఎక్కువమంది మాట్లాడే ఐదు భాషల్లో తెలుగు ఒకటని తెలిపారు. తమిళనాడులో పుట్టిన తాను తమిళ భాషకు సమానంగా తెలుగును గౌరవిస్తున్నానని ఆమె స్పష్టం చేశారు. తెలుగు నేర్చుకుని తెలుగులోనే మాట్లాడుతున్నానని వెల్లడించారు. మన తెలుగు భాషను పరిరక్షించుకుందామని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె ఆదివారం తెలుగులో మాట్లాడిన ఆడియో సందేశాన్ని విడుదల చేశారు.

'మత్తు'కు ముకుతాడు



జి.మాడుగుల మండలం బొయితిలిలో గతంలో గంజాయి సాగు భూమిలో వరి సాగు చేస్తున్న గిరిజనులు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

(ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి వడ్డాది శ్రీనివాస్) : 'ఏవోబీ'లో దశాబ్దాల పాటు సాగిన గంజాయి సాగుకు ప్రభుత్వ చర్యలతో అడ్డుకట్ట పడింది. రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక.. గత మూడేళ్లలో చేపట్టిన సంక్షేమాభివృద్ధి పథకాలతో గంజాయి మత్తు దాదాపు వదిలింది. ప్రధానంగా ప్రభుత్వం రైతాంగ పరంగా అమలు చేస్తున్న పథకాలన్నీ గిరిజనుల దరికి తీసుకెళ్లడంతో వారు సగర్వంగా తలెత్తుకుని జీవించే పరిస్థితులను కల్పించింది. సంప్రదాయ, వాణిజ్య పంటల వల్ల కూడా లాభాలు కళ్లజూసేలా తగిన ప్రోత్సాహం ఇస్తూ.. అన్ని విధాలా ప్రభుత్వం అండగా నిలిచింది. ముఖ్యంగా దాదాపు 2.5 లక్షల ఎకరాలకు ఆర్‌ఓఎఫ్ (రికార్డ్స్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్) పట్టాలు, డీకేటీ పట్టాలు పంపిణీ చేయడం ద్వారా 'ఇది మా భూమి' అనే భరోసా కల్పించింది. ఈ పట్టాలు పొందిన వారికి, వ్యవసాయం చేస్తున్న అర్హులైన గిరిజనులందరికీ వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని వర్తింప చేసింది. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా ఎప్పటికప్పుడు ఇతరత్రా పథకాలన్నీ అందించింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతి అడుగులోనూ తోడుగా నిలిచింది. వీటికి తోడు పోలీసు శాఖ 'ఆపరేషన్ పరివర్తన్' చేపట్టి విజయవంతంగా పూర్తి చేసింది. వీటన్నింటి వల్ల గిరిజనుల జీవితాల్లో కొత్త శకం ప్రారంభమైంది.

ఆపరేషన్ పరివర్తన్ ఇలా..

- స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ద్వారా పోలీసు శాఖ ఏవోబీలోని జి.మాడుగుల, జీకే వీధి, పెదబయలు, చింతపల్లి, కొయ్యూరు, ముంచంగిపుట్టు, డుంబ్రిగూడ మండలాల్లో 7,515 ఎకరాల్లో గంజాయి సాగును నిర్మూలించింది.
- ఇలాంటి ఆపరేషన్ చేపట్టడం దేశంలోనే తొలిసారి. 2021 నవంబర్ నుంచి 2022 ఫిబ్రవరి వరకు నిర్వహించిన 'ఆపరేషన్ పరివర్తన్' ద్వారా ఏకంగా 2 లక్షల కేజీలకు పైగా గంజాయి పంటను ధ్వంసం చేసింది. ఇదో రికార్డు. ఏవోబీలో గంజాయి సాగు విస్తరించడానికి ప్రధాన కారణమైన మావోయిస్టులు, ఇతర రాష్ట్రాల స్మగ్లింగ్ ముఠాలను పోలీసులు సమర్థంగా కట్టడి చేశారు.
- గతంలో గంజాయి పంట సాగు చేసే గిరిజన రైతుకు ఒక వంతు, ఇతర రాష్ట్రాల్లో ఉంటూ పెట్టుబడి పెట్టే స్మగ్లింగ్ ముఠాలకు ఇంకో వంతు, మావోయిస్టులకు మరో వంతు అనే విధానం అనధికారికంగా అమలయ్యేది. ఆపరేషన్ పరివర్తన్‌ను విజయవంతం చేయడంతో ఈ విధానానికి బ్రేక్ పడింది.
- ఇప్పటికే మావోయిస్టుల ప్రభావం లేకుండా చేసిన పోలీసులు.. వారి సానుభూతిపరులు, మిలీషియా (వృత్తిపరంగా సైనికులు కాకపోయినా, సైనిక శిక్షణ పొందిన వ్యక్తుల సమూహం) ప్రభావాన్ని కూడా పూర్తిగా కట్టడి చేశారు. ఇతర రాష్ట్రాల స్మగ్లింగ్ ముఠాలు, వారి ఏజంట్లను ఏజెన్సీ నుంచి తరిమికొట్టారు.

ఆర్బీకేల ద్వారా అడుగడుగునా అండ

- గంజాయి సాగు నిర్మూలనతో తన పని పూర్తి అయ్యిందనుకోలేదు ప్రభుత్వం. గంజాయి సాగు చేసిన గిరిజనులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పనపై ప్రధానంగా దృష్టి సారించింది. పోలీసు శాఖ సహకారంతో ఐటీడీఏ సమగ్రంగా సర్వే నిర్వహించింది.
- వ్యవసాయ, ఉద్యానవన శాఖల భాగస్వామ్యంతో కార్యాచరణ చేపట్టింది. వరితోపాటు ప్రధానంగా వాణిజ్య పంటలపై అవగాహన కల్పిస్తోంది. రాగులు, వేరుశనగ, పసుపు, కందులు, మొక్కజొన్న, రాజ్‌మా, డ్రాగన్ ఫ్రూట్, లిచీ, అనాస, పనస, మిరియాలు, క్యాబేజీ, కాలీఫ్లవర్ తదితర పంటల సాగుకు ప్రోత్సాహాన్ని అందిస్తోంది. 90 శాతం సబ్సిడీపై విత్తనాలు అందిస్తోంది.
- ఈ ప్రక్రియలో గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే) ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. అగ్రికల్చర్ అసిస్టెంట్, ఆర్బీకే సిబ్బంది క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. సాగు వివరాలను ఈ–క్రాపింగ్‌లో నమోదు చేస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో గిరిజనులు రెట్టించిన ఉత్సాహంతో ఏరువాక చేపట్టారు.
- గతంలో భయం భయంగా గంజాయి సాగు చేసిన గిరిజనులు ప్రస్తుతం దర్జాగా సంప్రదాయ, వాణిజ్య పంటలు సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం పొలాల్లో రాగుల పంటలో కలుపు తీయడం కనిపించింది. పసుపు పంటను, కాఫీ మొక్కలను జాగ్రత్తగా చూసుకుంటున్నారు. ఏవోబీలో వాతావరణ పరిస్థితులకు తగినట్టుగా కొబ్బరి, జామ, అరటి, సపోటా, శీతాఫలం వంటి ఉద్యాన పంటలతోపాటు కాలీఫ్లవర్, క్యాబేజీ, క్యారట్, డ్రాగన్ ఫ్రూట్ వంటి పంటల సాగుకు ఉత్సాహం చూపిస్తున్నారు.

పచ్చటి పంటలతో కళ్లెదుటే మార్పు

- ఒకప్పుడు నిండుగా గంజాయి మొక్కలతో కనిపించిన ఏవోబీలోని కొండలు ప్రస్తుతం వరి, రాగులు, మొక్కజొన్న, పసుపు, కాఫీ, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలతో కళకళలాడుతున్నాయి. జి.మాడుగుల మండలం బొయితిలిలో ఏకంగా 343 ఎకరాల్లో గతంలో గంజాయి సాగు చేసేవారు. ప్రస్తుతం ఆ భూముల్లో సంప్రదాయ, వాణిజ్య పంటలు వేశారు.
- గతంలో 293 ఎకరాల్లో గంజాయి సాగు చేసిన నూరుమత్తి పంచాయతీలో ప్రస్తుతం ఒక్క గంజాయి మొక్క కూడా కనిపించడం లేదు. కోరపల్లిలోని 292 ఎకరాల్లో గంజాయి సాగన్నది గతం. ఆ భూముల్లో ప్రస్తుతం రాగులు, వేరుశనగ, మిల్లెట్లు, రాగుల సాగు మొదలుపెట్టారు.
- జీకే వీధి మండలం జెర్రిల గూడెంలో గతంలో 257 ఎకరాల్లో గంజాయి మొక్కలే కనిపించేవి. ఆ భూముల్లోనే ఇప్పుడు సపోటా, జామ, సీతాఫలం, స్వీట్ ఆరెంజ్ తదితర పండ్ల తోటలు వేశారు. మొండిగెడ్డ పంచాయతీలో గతంలో గంజాయి వేసిన 392 ఎకరాల్లో కొబ్బరి, ఆపిల్ బేర్, స్వీట్ ఆరెంజ్ మొక్కలు నాటుతున్నారు.
- దుప్పలవాడలో గత ఏడాది గంజాయి సాగు చేసిన 202 ఎకరాల్లో ప్రస్తుతం రాజ్మా పండించేందుకు గిరిజన రైతులకు ప్రభుత్వం 2,180 కేజీల విత్తనాలు 90 శాతం సబ్సిడీపై సరఫరా చేసింది. పెద బయలు మండలంలో రాగులు, కాఫీ సాగు మొదలు పెట్టారు.
- డుంబ్రిగూడ మండలం అరమ పంచాయతీలో గతంలో గంజాయి సాగు చేసిన 170 ఎకరాల్లో ప్రస్తుతం వేరుశనగ పండించేందుకు 2,400 కేజీల విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేసింది. చింతపల్లి మండలం అన్నవరంలో 75 ఎకరాల్లో సాగు కోసం 344 కేజీల చిరుధాన్యాల విత్తనాలు, 45 కేజీల రాగుల విత్తనాలు, 25,500 కాఫీ మొక్కలను పంపిణీ చేశారు.
- కొయ్యూరు మండలం బురదల్లులో 359 ఎకరాల్లో కాఫీ తోటల పెంపకం కోసం 2,52,800 కాఫీ మొక్కలను అందించారు. జోలాపుట్, దోడిపుట్టు, బుంగపుట్టు, బూసిపుట్టు, బాబుశాల, బరడ, బంగారుమెట్ట, తమ్మింగుల, బెన్నవరం, లొట్టుగెడ్డ, షిల్కరి, పోయిపల్లి, పెద్ద కొండపల్లి, పద్రెడ, లక్ష్మీపేట.. ఇలా ఏవోబీలో గతంలో గంజాయి సాగు చేసిన 7,515 ఎకరాలు.. ప్రస్తుతం ప్రత్యామ్నాయ పంటల సాగుతో కళ కళలాడుతూ నిజమైన మార్పునకు నిదర్శంగా నిలిచాయి.



బొయితిలిలో వరి చేనులో పనులు చేస్తున్న రైతులు



బొయితిలిలో గిరిజనులు సాగు చేస్తున్న పసుపు, వరి పంట



ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల్లో మొక్కజొన్న సాగు చేస్తున్న గిరిజన రైతులు

ఫొటోలు : నవాజ్, సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

దేశంలోనే తొలిసారి

గంజాయి, ఇతర డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పోలీసు శాఖ సమర్థవంతంగా 'ఆపరేషన్ పరివర్తన్'ను నిర్వహించింది. దేశంలోనే తొలిసారిగా గంజాయి సాగు నిర్మూలనకు ఇటువంటి ఆపరేషన్ నిర్వహించడం ద్వారా ఏపీ పోలీసు శాఖ రికార్డు సృష్టించింది. గిరిజనులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ చేపట్టింది.

– కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి, డీజీపీ

గిరిజనుల జీవితాల్లో వెలుగు



గంజాయి సాగు వల్ల కలిగే అనర్థాలను స్పష్టంగా వివరించడంతో గిరిజనులు మాకు సహకరించారు. గతంలో వారు గంజాయి సాగు చేసిన భూముల్లోనే ప్రత్యమ్నాయ పంటల సాగు దిశగా ప్రోత్సహిస్తున్నాం. అందుకోసం రెవెన్యూ, ఐటీడీఏ, వ్యవసాయ, ఉద్యాన శాఖలతో సమన్వయంతో పని చేస్తున్నాం. గిరిజనులకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాం.

– జి.సతీష్ కుమార్, ఎస్పీ, అల్లూరి సీతారామరాజు జిల్లా

రాగులు పంట వేశాను



ఎన్నో ఏళ్ల మా పొలంలో గంజాయి మొక్కలే వేశాను. పోలీసువారు వచ్చి చెప్పడంతో గంజాయి మొక్కలు తీయించివేశాను. ఇతర పంటలు వేసుకోవాలని ఆఫీసర్లు వచ్చి చెప్పారు. ఇప్పుడు రాగులు వేశాను. విత్తనాలు ప్రభుత్వమే ఇచ్చింది. ఇక నుంచి మేము రాగులు, పసుపే పండిస్తాం.

– పండమ్మ, గిరిజన మహిళా రైతు, బొయితిలి

మా బిడ్డల భవిష్యత్ కోసమే



మా బిడ్డలకు మంచి జీవితం అందించాలనే గంజాయి సాగు మానేశాం. పసుపు పంట వేశాం. ఈ పంటకు సరైన ధర కల్పిస్తే చాలు. ప్రభుత్వ పథకాల ద్వారా మా పిల్లల్ని బాగా చదివించుకుంటాం.

– బేతాయమ్మ, రైతు, వాకపల్లి

ప్రభుత్వంపై నమ్మకంతోనే మార్పు



మా గూడేల్లో గంజాయి సాగును పూర్తిగా విడిచి పెడతారని నేను ఎప్పుడూ అనుకోలేదు. ప్రభుత్వం అండగా నిలుస్తుందన్న నమ్మకంతోనే గిరిజనులు గంజాయి సాగు మానేశారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది మాకు సహకరిస్తున్నారు. గిరిజనుల పంటలకు మద్దతు ధర కల్పించాలి.

– లసంగి మల్లన్న, సర్పంచ్, బొయితిలి

ఈ–క్రాపింగ్ చేస్తున్నాం




ప్రభుత్వం 90 శాతం సబ్సిడీపై సరఫరా చేస్తున్న విత్తనాలను గిరిజన రైతులకు సక్రమంగా పంపిణీ చేస్తున్నాం. వారు సాగు చేస్తున్న పంటల వివరాలను తెలుసుకుని ఈ–క్రాపింగ్ చేస్తున్నాం. తద్వారా వైఎస్సార్ రైతు భరోసా, ఇతర పథకాలు వారికి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఆర్.ప్రీతి, అగ్రికల్చర్ అసిస్టెంట్

శ్రీశైలంలోకి మళ్లీ పెరిగిన వరద

సాక్షి, అమరావతి/శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురి సౌత్/సత్రశాల (రెంటచింతల): కృష్ణా ప్రధానపాయపై నారాయణపూర్ డ్యామ్‌కు దిగువన.. తుంగభద్ర పరీవాహక ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తుండటంతో శ్రీశైలం ప్రాజెక్టులోకి మళ్లీ వరద పెరిగింది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు జూరాల, సుంకేశుల బ్యారేజీల నుంచి శ్రీశైలం ప్రాజెక్టులోకి 2,79,268 క్యూసెక్కులు చేరుతుండగా.. గరిష్టస్థాయిలో అంటే 885 అడుగుల్లో 215.80 టీఎంసీలను నిల్వచేస్తూ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 20 వేలు, హంద్రీ–నీవా ద్వారా 1,688, కల్వకుర్తి ద్వారా 1,967 క్యూసెక్కులు తరలిస్తున్నారు. స్పిల్ వే ఏడుగేట్లను పదడుగులు ఎత్తి 1,96,525 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ కుడిగట్టు కేంద్రం ద్వారా 30,924, ఎడమగట్టు కేంద్రం ద్వారా 31,784 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. నాగార్జునసాగర్‌లోకి 2,09,791 క్యూసెక్కుల నీరు చేరుతోంది. కుడి, ఎడమ కాలువలు, ఏఎమ్మార్పీ, వరద కాలువలకు 17,246 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. స్పిల్ వే గేట్ల ద్వారా, విద్యుదుత్పత్తి చేస్తూ 1,93,185 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ప్రస్తుతం సాగర్‌లో 588.9 అడుగుల్లో 308.76 టీఎంసీలను నిల్వచేస్తున్నారు. పులిచింతలలోకి 1,82,816 క్యూసెక్కులు చేరుతుండగా.. 169.79 అడుగుల్లో 38.04 టీఎంసీలను నిల్వచేస్తూ స్పిల్‌వే గేట్లు, విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా 1,69,871 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్‌లోకి 1,60,937 క్యూసెక్కులు చేరుతుండగా.. కృష్ణా డెల్టాకు 15,687 క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగిలిన 1,45,250 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. కృష్ణా బేసిన్‌లో ఎగువన మరో రెండ్రోజులు విస్తారంగా వర్షాలు కురుస్తాయన్న భారత వాతావరణ సంస్థ అంచనాల నేపథ్యంలో కృష్ణాలో వరద ఉధృతి మరో 3, 4 రోజులు ఇదే రీతిలో కొనసాగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

శ్రీశైలం ప్రాజెక్టు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌పై ఆధారపడ్డ ప్రాజెక్టుల్లో ఆదివారం నాటికి నీటినిల్వల పరిస్థితి



ప్రాజెక్టు పేరు	పూర్తినిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
తెలుగుగంగ				
వెలిగోడు	16.95	16.26	9,000	10,090
బ్రహ్మంసాగర్	17.74	12.38	1,530	569
సోమశిల	78	69.65	12,635	9,892
కండలేరు	68.03	30.38	7,710	792
ఎస్ఆర్బీసీ				
గోరకల్లు	12.44	9.82	1,095	720
అవుకు	4.15	2.93	1,064	501
గాలేరు-నగరి				
గండికోట	26.85	22.21	2,300	0
పైడిపాలెం	6	4.62	0	160
సీబీఆర్	10	8.3	1,765	200

చవితి పందిళ్లకు కరెంట్ ఛార్జీలు పెరగలేదు

దుష్ప్రచారాన్ని నమ్మొద్దన్న విద్యుత్ శాఖ

సాక్షి, అమరావతి : వినాయక చవితి ఉత్సవాల పందిళ్లకు విద్యుత్ ఛార్జీలు పెరిగాయంటూ జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని భక్తులకు విద్యుత్ శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ తూర్పు, దక్షిణ, మధ్య ప్రాంత పంపిణీ సంస్థల సీఎండీలు కె. సంతోషరావు, జె. పద్మాజనార్థనరెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వినాయక చవితి సందర్భంగా ఏర్పాటుచేసే వినాయక మండపాలకు తాత్కాలిక విద్యుత్ టారిఫ్‌ను పెంచలేదని, పైగా గతంలో 250 వాట్స్‌కి కూడా రూ.వెయ్యి తీసుకునేవారని, కానీ ఇప్పుడు రూ.750గా నిర్ణయించామన్నారు.

అప్పట్నుంచీ అవే ఛార్జీలు..

రాష్ట్రవ్యాప్తంగా వినాయక మండపాలకు 2014 నుంచి అమలులో ఉన్న టారిఫ్ ప్రకారం 500 వాట్స్‌కి రూ.1000, 1000 వాట్స్‌కి రూ.2,250, 1,500 వాట్స్‌కి రూ.3,000, 2000 వాట్స్‌కి రూ.3,750, 2,500 వాట్స్‌కి రూ.4,550, 3000 వాట్స్‌కి రూ.5,250, 3,500 వాట్స్‌కి రూ.6,000, 4000 వాట్స్‌కి రూ.6,750, 5000 వాట్స్‌కి రూ.8,250, 6,000 వాట్స్‌కి రూ.9,750, 10,000 వాట్స్‌కి రూ.15,750 చొప్పున చెల్లించి తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లను తీసుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖ నిబంధనల మేరకు ఈ కనెక్షన్ల ద్వారా పది రోజులపాటు విద్యుత్‌ను వినియోగించుకోవచ్చని సీఎండీలు తెలిపారు. అవసరమైతే టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయాలని వారు కోరారు.

వినాయక ఉత్సవాలపై ఎలాంటి ఆంక్షలు లేవు

డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వినాయక చవితి నిర్వహణ పైన, వినాయక విగ్రహాల నిమజ్జనం పైన ఎటువంటి ఆంక్షలు లేవని డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఏడాది పోలీసులు కొత్తగా ఆంక్షలు విధిస్తున్నారంటూ కొందరు ఉద్దేశపూర్వకంగా చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎవరూ విశ్వసించవద్దని చెప్పారు. ప్రజలు ఎప్పటిలా భక్తి శ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు జరుపుకునేందుకు పోలీసు శాఖ పూర్తిగా సహకరిస్తుందని ఆయన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వినాయక ఉత్సవ కమిటీలు స్థానికంగా పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుని తగిన ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. వినాయక ఉత్సవాల నిర్వాహకులు ఎటువంటి అఫిడవిట్లు సమర్పించాల్సిన అవసరం లేదని డీజీపీ స్పష్టం చేశారు. వినాయక ఉత్సవాల నిర్వహణ కమిటీలకు పూర్తిగా సహకరించాలని ఎస్పీలు, డీఐజీలకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. ఏటా మాదిరిగానే వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసు శాఖ ఈ ఏడాది కూడా సూచనలు చేస్తోందన్నారు.

ఈ జాగ్రత్తలు పాటించండి

- వినాయక మండపాల ఏర్పాటుపై ఉత్సవ కమిటీలు సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి.
- విగ్రహాల ఎత్తు, బరువు, ఉత్సవాలు నిర్వహించే రోజులు, నిమజ్జనానికి ఉపయోగించే వాహనం, నిమజ్జనం కోసం తీసుకువెళ్లే రూట్ వివరాలను స్థానిక పోలీసులకు తెలపాలి.
- అగ్నిమాపక, విద్యుత్తు శాఖ సూచనల మేరకు వినాయక మండపాల వద్ద ముందుజాగ్రత్త చర్యగా తగినంత ఇసుక, నీళ్ల ఏర్పాటు చేయాలి.
- కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాల ప్రకారమే వినాయక మండపాల వద్ద స్పీకర్లు ఏర్పాటు చేయాలి. ఉదయం 6 నుంచి రాత్రి 10గంటల వరకే స్పీకర్లను ఉపయోగించాలి.
- మండపాల వద్ద క్యూలైన్ల నిర్వహణ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేందుకు పోలీసు శాఖకు సంబంధిత కమిటీలు సహకరించాలి.
- మండపాల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలి. నిర్వాహక కమిటీ సభ్యులు రాత్రివేళల్లో మండపాల వద్ద తప్పనిసరిగా కాపలా ఉండాలి.
- విగ్రహ నిమజ్జన ఊరేగింపు కోసం వేషధారణలు, డీజే వంటి వాటిపై స్థానిక పోలీసులకు ముందుగా సమాచారం అందించాలి.
- ఇంతకుమించి ఎవరైనా ఇతర నిబంధనలు విధిస్తే అదనపు డీజీ (శాంతి భద్రతలు) రవిశంకర్ అయ్యన్నార్ (ఫోన్: 99080-17338), డీఐజీ రాజశేఖర్‌బాబు (ఫోన్: 80081-11070) దృష్టికి తీసుకు రావాలని తెలిపారు.

చవితి మండపాలకు ఫీజులు వసూలు చేయట్లేదు

- తప్పుడు ప్రచారం చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు
- దేవదాయ శాఖ కమిషనర్ హెచ్చరిక

సాక్షి, అమరావతి: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసుకునే గణేష్ మండపాలకు రుసుములు (ఫీజులు) వసూలు చేస్తున్నారంటూ సోషల్ మీడియా వేదికగా కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. ఇలాంటి వాటిని ప్రజలెవరూ నమ్మవద్దని దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండపాల ఏర్పాటుకు ఎటువంటి రుసుములు వసూలు చేయడం లేదని స్పష్టం చేశారు. భద్రతా కారణాల నేపథ్యంలో మండపాల ఏర్పాటుకు స్థానిక పోలీసు.. రెవెన్యూ అధికారులను సంప్రదించాలన్నారు. చట్టపరంగా తీసుకోవాల్సిన అనుమతులు ఏవైనా ఉంటే రెవెన్యూ, పోలీస్ శాఖను సంప్రదించి తీసుకోవాలని కోరారు. అలాంటివి మినహాయించి ఏ రకమైన రుసుములు గానీ, చందాలు గానీ తీసుకున్నా లేక ప్రేరేపించబడినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫీజులు వసూలు చేస్తున్నారని తప్పుగా ప్రచారం చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటి అబద్ధపు నిరాధార ప్రచారాన్ని ప్రజలు, భక్తులు నమ్మవద్దని కోరారు. ఎక్కడైనా మండపాలకు ఫీజులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

'చవితి'పైనా రాజకీయమా?

▶ మొదటి పేజీ తరువాయి

మీడియాతో మాట్లాడారు. టీడీపీ–బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు విజయవాడ కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడిని తొలగించడానికి ప్రయత్నిస్తే.. తాము ఉద్యమించామని.. దాంతో వెనక్కి తగ్గిన మాట వాస్తవం కాదా? అని విష్ణు ప్రశ్నించారు. వినాయకుడి గుడిని తొలగించడానికి ప్రయత్నించిన మీకు వినాయక చవితి గురించి మాట్లాడే నైతిక హక్కులేదని ఆ ఇద్దరు నేతలకు ఆయన స్పష్టంచేశారు. మళ్లీ వీరే ఇప్పుడు వినాయకుడిని అడ్డం పెట్టుకుని ప్రభుత్వంపై బురదజల్లే యత్నం చేయడం సిగ్గుచేటన్నారు. ఇక 2014 నుంచి 2019 వరకూ అధికారంలో ఉన్న టీడీపీ–బీజేపీ ప్రభుత్వం రూపొందించిన నియమ, నిబంధనల ప్రకారమే వినాయక మండపాలు, పందిళ్లకు అనుమతులిస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టంచేశారు. అప్పట్లో వినాయక మండపాలకు రూ.వెయ్యి విద్యుత్ ఛార్జీగా నిర్ణయిస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దాన్ని తగ్గించిందని ఆయన గుర్తుచేశారు. అలాగే, కాణిపాకంలో వరసిద్ధి వినాయక స్వామికి రూ.6 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం బంగారు రథాన్ని తయారుచేయిస్తోందని ఆయన గుర్తుచేశారు.

మీ పిల్లల మీద ఒట్టేసి చెప్పండి..

హిందువులను పండగలు చేసుకోనివ్వడంలేదని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని.. అందులో నిజం ఉందని మీ పిల్లల మీద ఒట్టేసి చెప్పగలరా అని చంద్రబాబు, సోము వీర్రాజులను మల్లాది విష్ణు సవాల్ చేశారు. వీళ్లు హిందువులే కాదు.. అసలు భారతీయులే కాదన్నారు. వీరికి మరో పని లేకే ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారని.. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు. ప్రతీ విషయాన్ని రాజకీయం చేయాలని చూస్తున్నారని.. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై వారిద్దరికీ ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఆయన మండిపడ్డారు. దమ్ముంటే కేంద్రాన్ని అడిగి పోలవరానికి నిధులు, రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకొస్తావా అని సోము వీర్రాజుకు విష్ణు సవాల్ విసిరారు.

నేడు తెలుగు భాషా దినోత్సవం

- విశాఖలో రాష్ట్రస్థాయి కార్యక్రమం
- 43 మంది తెలుగు కవులు, భాషా పండితులకు పురస్కారాలు

సాక్షి, విశాఖపట్నం: గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని సోమవారం తెలుగు భాషా దినోత్సవాన్ని విశాఖపట్నంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్ థియేటర్‌లో ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. ప్రభుత్వ సహకారంతో ఏపీ సృజనాత్మక, సంస్కృతి సమితి, భాషా, సాంస్కృతిక శాఖ, అధికార భాషా సంఘం, తెలుగు ప్రాధికార సంస్థ ఆధ్వర్యాన ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు భాష అభివృద్ధికి కృషిచేసిన రాష్ట్రంలోని 43 మంది కవులు, భాషా పండితులకు తెలుగు భాషా పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించనున్నట్లు అధికార భాషా సంఘం చైర్మన్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు.

క్లుప్తంగా

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



వైఎస్సార్‌సీపీలోకి చేరిన టీడీపీ కార్యకర్తలు

సోమల: చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమల సింగిల్ విండో కార్యాలయం ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో ఇరికిపెంట పంచాయతీ గొల్లపల్లె, గంగిరెడ్డిగారిపల్లె, మేటిమంద గ్రామాలకు చెందిన సుమారు 100 మంది, సోమల పట్టణానికి చెందిన టీడీపీ మైనారిటీ నేత జబ్బార్ సాహెబ్ సహా 30 మంది ముస్లింలు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మెచ్చి పార్టీలోకి వచ్చినట్టు వారు చెప్పారు.

మంత్రి పెద్దిరెడ్డి కాన్వాయ్‌కి తప్పిన ప్రమాదం

చంద్రగిరి: తిరుపతి జిల్లా చంద్రగిరి మండల పరిధిలోని పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి నడింపల్లి వద్ద మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాన్వాయ్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. తన నియోజకవర్గంలోని కార్యక్రమాలను ముగించుకుని మంత్రి పెద్దిరెడ్డి ఆదివారం సాయంత్రం తిరుపతికి పయనమయ్యారు. ఈ క్రమంలో మంత్రికి కాన్వాయ్‌గా వస్తున్న వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని, రోడ్డుకు అటువైపున దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు అవ్వలేదు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సమీక్షించి అనంతరం మంత్రి కాన్వాయ్‌కు మరమ్మతులను నిర్వహించి, అక్కడ నుంచి తిరుపతికి తరలించారు.

రాష్ట్రాన్ని టీడీపీ నాశనం చేసింది

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి



చిత్తూరు (కార్పొరేషన్): ఆంధ్రప్రదేశ్‌ను టీడీపీ నాశనం చేసిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆయన ఆదివారం చిత్తూరులో మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం టీడీపీ సొంత ప్రయోజనాలే తప్ప ప్రజావసరాలను పట్టించుకోవడం లేదన్నారు. ఎంతసేపూ రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం మినహా ప్రజల కోసం వారు ఎటువంటి పోరాటాలు చేయడంలేదని విమర్శించారు. వందేళ్లుగా ఉన్న కమ్యూనిస్టు పార్టీలు బూజు పట్టిన సిద్ధాంతాలతో వెంటిలేటర్‌పై ఉన్నాయని తెలిపారు. వారు ఎందుకు ఇంకా అధికారంలోకి రాలేదని ప్రశ్నించారు. సినీ నటుడు ఎన్టీఆర్, నితిన్ బీజేపీకి ఆకర్షితులయ్యారన్నారు. తెలంగాణ వాసులు బీజేపీకి అధికారం ఇవ్వాలని చూస్తున్నారని తెలిపారు. ఎంఐఎం మతాల మధ్య చిచ్చు పెట్టే పార్టీ అని, వాటిని నిషేధించాలన్నారు. సీపీఎస్ రద్దును రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వినాయక చవితికి మండపాలు ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి కప్పం ఎందుకు కట్టాలని ప్రశ్నించారు. రంజాన్, క్రిస్మస్‌కు లేని నిబంధన ఇప్పుడు ఎందుకు అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి కోలా ఆనంద్, మాజీ ఎంపీ దుర్గారామకృష్ణ పాల్గొన్నారు.

అవ్వాతాతల కంటికి వెలుగు



'వైఎస్సార్ కంటివెలుగు' ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వృద్ధులకు నేత్ర పరీక్షలు

56.88 లక్షల మందికిగాను ఇప్పటికే 22.16 లక్షల మందికి పూర్తి

- 10 లక్షల మందికి అద్దాలు అవసరమని గుర్తింపు..
- వీరిలో 8 లక్షల మందికి పంపిణీ
- మరో 10 లక్షల మందికి మందులు అందజేత
- 1.69 లక్షల మందికి కాటరాక్ట్ సర్జరీలు అవసరమని గుర్తింపు
- వీరికి ప్రభుత్వమే ఉచితంగా సర్జరీలు చేయిస్తున్న పరిస్థితి

సాక్షి, అమరావతి: మలిసంధ్యలో కంటిచూపు సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వృద్ధులకు 'డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు' కార్యక్రమం చూపు ప్రసాదిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా 60ఏళ్లు పైబడిన వృద్ధులకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తోంది. చూపు సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి మందులు, కళ్లద్దాలు అందించడంతో పాటు, కేటరాక్ట్ సర్జరీలు ఉచితంగా చేస్తోంది. రాష్ట్రంలోని 5.60 కోట్ల మందికి కంటి వైద్య పరీక్షలు ఉచితంగా చేయాలనే ఉద్దేశ్యంతో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ 2019 అక్టోబర్ 10న శ్రీకారం చుట్టారు. ఆరు దశల్లో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు చేయాలని సంకల్పించారు. ఇందులో భాగంగా తొలి రెండు దశల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 66.17 లక్షల మంది పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 1.58 లక్షల మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేయడంతో పాటు, 300 మందికి పైగా పిల్లలకు సర్జరీలు చేశారు.

22.16 లక్షల మందికి పరీక్షలు

ఇక మూడో దశలో.. 60 ఏళ్లు పైబడిన 56,88,424 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేయాలన్న లక్ష్యంతో 2020 ఫిబ్రవరిలో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. వీరిలో ఇప్పటివరకూ 22,16,031 మందికి పరీక్షలు పూర్తయ్యాయి. ఇందులో 10,42,457 మందికి మందుల ద్వారా నయమయ్యే సమస్యలున్నట్లు గుర్తించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 10,01,049 మందికి కళ్లద్దాలు అవసరం ఉండగా 8,31,584 మందికి పంపిణీ పూర్తయింది. అలాగే, 1,69,105 మంది వృద్ధులు శుక్లాల సమస్యతో బాధపడుతున్నట్లు వైద్య బృందాలు గుర్తించి వీరికి ప్రభుత్వమే ఉచితంగా కేటరాక్ట్ సర్జరీలు చేపడుతోంది. ఈ కార్యక్రమ నిర్వహణలో ఉమ్మడి విజయనగరం జిల్లా రాష్ట్రంలోనే తొలిస్థానంలో ఉంది. ఈ జిల్లాలో 1.52 లక్షల మందికి పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా 53.72 శాతం మందికి పూర్తయ్యాయి. అలాగే, 50.88 శాతం మందికి పరీక్షలు నిర్వహించి ఉమ్మడి వైఎస్సార్, 50.66 శాతంతో శ్రీకాకుళం జిల్లాలు తర్వాత స్థానంలో ఉన్నాయి.

ఈ ఆస్పత్రులు వెరీ పూర్

కేటరాక్ట్ సర్జరీల నిర్వహణలో రాష్ట్రంలోని పలు ప్రభుత్వాస్పత్రులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తుంటే, మరికొన్ని ఆస్పత్రుల్లో అంతంతమాత్రంగానే సర్జరీలు జరుగుతున్నాయి. డీఎంఈ పరిధిలోని ఆస్పత్రులను పరిశీలిస్తే.. ఈనెల 15 నుంచి 21 మధ్య వారం రోజుల్లో 41 సర్జరీలతో విశాఖపట్నం రీజనల్ కంటి ఆస్పత్రి తొలిస్థానంలో ఉంది. కర్నూలు రీజినల్ కంటి ఆస్పత్రిలో 35 సర్జరీలు, గుంటూరు జీజీహెచ్‌లో 30 సర్జరీలు నిర్వహించారు. మరోవైపు.. ఎనిమిది మంది సర్జన్స్ ఉన్నప్పటికీ అనంతపురం జీజీహెచ్‌లో ఒక్క సర్జరీ కూడా నిర్వహించలేదు. ఇక వైద్య విధాన పరిషత్ విభాగంలో.. ఏలూరు జిల్లా ఆస్పత్రి 61 సర్జరీలు నిర్వహించి రాష్ట్రంలోనే తొలిస్థానంలో ఉంది. ఇదే విభాగంలోని గూడూరు, రామచంద్రాపురం, నరసరావుపేట, పాలకొల్లు, తణుకు, పాడేరు ఏరియా ఆస్పత్రులు, మార్కాపురం జిల్లా ఆస్పత్రిలో వారం రోజుల్లో ఒక్క సర్జరీ కూడా నిర్వహించలేదు.

ఉచితంగా ఆపరేషన్ చేశారు

నేను చేనేత కార్మికుడిని. కంటిచూపు మందగించడంతో కంటి వెలుగు కింద ప్రభుత్వం ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తోందని తెలిసింది. మా గ్రామంలో శిబిరం ఏర్పాటుచేసినప్పుడు పరీక్ష చేయించుకున్నాను. శుక్లాలు ఉన్నట్లు నిర్ధారించారు. ప్రభుత్వం ఇటీవలే కంటికి ఉచితంగా ఆపరేషన్ చేయించింది. ఇప్పుడు బాగా కనిపిస్తోంది.

– సీహెచ్ మల్లికార్జునరావు, వీరులపాడు, ఎన్టీఆర్ జిల్లా

వేగంగా పూర్తిచేయడానికి చర్యలు

వృద్ధులందరికీ కంటి పరీక్షలు వేగంగా పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. వారం వారం కార్యక్రమంపై సమీక్షలు నిర్వహిస్తున్నాం. మందకొడిగా పరీక్షలు, సర్జరీలు జరుగుతున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.

– డాక్టర్ యు. స్వరాజ్యలక్ష్మి, ప్రజారోగ్య సంచాలకులు

బాబుపై సామాజిక తిరుగుబాటు

- అధికారంలో ఉన్నప్పుడూ ఏ ఒక్క గడపకూ న్యాయం చేయని టీడీపీ అధినేత
- మీడియాతో మంత్రి జోగి రమేష్



సాక్షి, అమరావతి: ఓట్ల కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలను వాడుకుని.. అధికారంలోకి వచ్చాక వారిని అవహేళన చేసిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుపై కుప్పంతో సహా 175 నియోజకవర్గాల్లోనూ ప్రజలు సామాజిక తిరుగుబాటు చేస్తున్నారని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మూడు దశాబ్దాలకు పైగా తమకు ప్రాతినిథ్యం వహించిన చంద్రబాబు కుప్పానికి ఏం చేశారంటూ అక్కడి ప్రజలు ఆయనపై తిరుగుబాటు చేశారన్నారు. చంద్రబాబుపై తిరుగుబాటు ఆయన సొంత నియోజకవర్గం కుప్పం నుంచే మొదలైందని, ముఖ్యంగా అక్కడ బీసీల నుంచే ప్రారంభమైందని మంత్రి చెప్పారు. బీసీలు, మరోవైపు ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలు, రైతన్నలు, మహిళలు చంద్రబాబు తమకు వద్దే వద్దని చెబుతున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన మూడేళ్లలోనే అర్హత ఉన్న ప్రతి గడపకు అమ్మఒడి, చేయూత, ఆసరా, రైతుభరోసాతోపాటు ప్రతినెలా ఠంఛన్‌గా పెన్షన్ ఇస్తున్న మనసున్న సీఎం వైఎస్ జగన్‌ను ప్రజలు గుండెల్లో పెట్టుకుని అభిమానిస్తున్నారని జోగి రమేష్ చెప్పారు.

సర్వైకల్ క్యాన్సర్ నివారణపై దృష్టి

సాక్షి, అమరావతి: మహిళలు ప్రధానంగా ఎదుర్కొంటున్న గర్భాశయ ముఖద్వార(సర్వైకల్) క్యాన్సర్ నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు ఉపయోగించే హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను రాయితీపై అందించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 9 నుంచి 14 ఏళ్ల బాలికలకు వ్యాక్సిన్ అందించేందుకు వైద్య శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ వ్యాక్సిన్ ధర మార్కెట్‌లో దాదాపు రూ.4 వేలు వరకు ఉంది. దీన్ని రూ.400 నుంచి రూ.500కే అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. హెచ్‌పీవీ 16, 18 రకం వ్యాక్సిన్ పంపిణీని తొలుత గుంటూరులో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. అక్కడ లభించే స్పందన ఆధారంగా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకూ విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల్లో క్యాన్సర్ ముందు వరుసలో ఉంది. ముఖ్యంగా దేశంలో ఏటా 1.20 లక్షల మంది సర్వైకల్ క్యాన్సర్ బారిన పడుతున్నారు. క్రమం తప్పకుండా స్క్రీనింగ్ చేయించుకోవడమే దీనికి ఉత్తమ పరిష్కారం. ఈ క్యాన్సర్‌ను ఎంత ముందుగా గుర్తిస్తే అంత తేలిగ్గా చికిత్స అందించవచ్చు. హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) ద్వారా ఈ క్యాన్సర్ వస్తుంది. ఈ వైరస్ శృంగారం ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. సర్వైకల్ క్యాన్సర్ నిర్ధారణకు పాప్‌స్మియర్ పరీక్ష చేయించుకోవాల్సి ఉంటుంది.

సెప్టెంబర్‌లో ప్రారంభిస్తాం

చెన్నైలోని అడయార్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో హెచ్‌పీవీ వ్యాక్సిన్ పంపిణీని ప్రారంభిస్తామని వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి నవీన్‌కుమార్ తెలిపారు. ప్రయోగాత్మకంగా సెప్టెంబర్ నుంచి గుంటూరులో దీనికి శ్రీకారం చుడతామని చెప్పారు.

రావులాపురంలో మెగా వైద్యశిబిరం

- ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన పోలీస్‌శాఖ
- 3 వేలమందికిపైగా ప్రజలకు సేవలందించిన 40 మంది వైద్యులు
- ఉచితంగా మందులు పంపిణీ



వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యబృందం

బొల్లాపల్లి (వినుకొండ): పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం రావులాపురంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో బొల్లాపల్లి, కారంపూడి, దుర్గి, మాచర్ల తదితర ప్రాంతాలకు చెందిన మూడువేలమందికి పైగా ప్రజలు వైద్యసేవలు పొందారు. 40 మంది వైద్యులు వారిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో పోలీస్‌శాఖ నిర్వహించిన ఈ శిబిరాన్ని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల నుంచి పట్టణ ప్రాంతాలకు వెళ్లి వైద్య సేవలు పొందాలంటే రాకపోకలతో పాటు ఆర్థికంగా ఇబ్బందికరమని ఈ ప్రాంతంలో డీఐజీ నేతృత్వంలో కలెక్టర్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పేదల కోసం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించడం సంతోషకరమని చెప్పారు. నాడు–నేడులో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యరంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తెస్తున్నారన్నారు. డీఐజీ త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ పల్నాడు జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మరిన్ని మెగా మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో 3,400కు పైగా చికిత్సలను చేర్చారని, ఈ పథకం కింద రూ.19 లక్షల వరకు వైద్యం పొందే అవకాశం ఉందని తెలిపారు. వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ మండలంలో ఎక్కువగా ఉన్న ఎస్సీ, ఎస్టీ జనాభాకు సంబంధించిన భూ రెవెన్యూ సమస్యలను కలెక్టర్ పరిష్కరించాలని కోరారు. అనంతరం ఈ శిబిరంలో సేవలందించిన వైద్యబృందాన్ని మంత్రి రజని, డీఐజీ త్రివిక్రమ్ వర్మ, ఎమ్మెల్యేలు శ్రీనివాసరెడ్డి, బ్రహ్మనాయుడు, కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి సత్కరించారు. జిల్లా అదనపు ఎస్పీ బిందు మాధవ్, నరసరావుపేట, సత్తెనపల్లి, దిశ డీఎస్పీలు సి.విజయభాస్కరరావు, ఆర్.విజయభాస్కరరెడ్డి, యు.రవిచంద్ర, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు కె.జగన్‌మోహన్‌రెడ్డి, గుప్తా, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కన్నీరు తుడిచి.. బాసటగా నిలిచి..

బాలుడికి బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు రూ.50 లక్షలు మంజూరు చేయించిన మంత్రి రజని



మంత్రికి బాలుడి గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే

వినుకొండ (నూజెండ్ల): క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలుడికి బోన్‌మారో చికిత్సకు రూ.50 లక్షలు మంజూరు చేయించి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ఆ పేదకుటుంబం కన్నీరు తుడిచారు. వినుకొండ రూరల్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన తొమ్మిదేళ్ల బాలుడు అశోక్‌బాబు పరిస్థితిని స్వయంగా చూసిన మంత్రి వెంటనే ఆస్పత్రిలో చేర్పించాలని సూచించారు. అశోక్ బాబు తండ్రి మూడేళ్ల కిందట చనిపోయాడు. తల్లి కూలిపనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఈ క్రమంలో అశోక్‌కు క్యాన్సర్ అని, చికిత్సకు రూ.50 లక్షల వరకు ఖర్చవుతుందని తల్లికి తెలిసి హతాశురాలైంది. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆమె ప్రమాదవశాత్తు గాయపడింది. గ్రామ సర్పంచి సురేష్ ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు బాలుడి తల్లికి భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలో శనివారం వినుకొండ వచ్చిన వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రజనికి బాలుడి ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే వివరించి సహాయం చేయాలని కోరారు. అశోక్ బాబును తీసుకొచ్చిన బంధువులు మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. బాలుడి పరిస్థితి చూసి సీఎంవో అధికారులతో మాట్లాడిన మంత్రి వైద్యానికి అయ్యే ఖర్చు రూ.50 లక్షలను ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. బాలుడిని ఆస్పత్రిలో చేర్పించాలని బంధువులకు సూచించారు.

ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణపై పోరు

సీపీఐ 27వ రాష్ట్ర మహాసభల్లో తీర్మానం



బషీర్‌బాగ్ కాల్పుల్లో మరణించిన వారికి నివాళులర్పిస్తున్న రాజా

సాక్షి, విశాఖపట్నం: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను కొనసాగించాలని.. ఏపీకి కేంద్రం ప్రత్యేక హోదా ఇవ్వాలని, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్‌మీటర్ల యోచన విరమించుకోవాలని సీపీఐ 27వ రాష్ట్ర మహాసభ తీర్మానించింది. మూడ్రోజుల పాటు విశాఖలో జరిగిన ఈ మహాసభలు ఆదివారంతో ముగిశాయి. తొలుత.. పెంచిన విద్యుత్ చార్జీలు రద్దుచేయాలంటూ 2000 ఆగస్టు 28న హైదరాబాద్‌లో చేసిన నిరసన ప్రదర్శనపై పోలీసులు జరిపిన కాల్పుల్లో మరణించిన ఉద్యమకారులకు మహాసభ నివాళులర్పించింది. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శులు జేవీఎస్ఎన్ మూర్తి, ముప్పాళ్ల నాగేశ్వరరావు, జాతీయ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి అనీరాజా, మాజీ ఎమ్మెల్యే మానం అంజనేయులు ముగింపు సభలో ప్రసంగించారు. వివిధ అంశాలపై తీర్మానాలను మహాసభ ఆమోదించింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా కె.రామకృష్ణ మరోసారి ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా జేవీఎస్ఎన్ మూర్తి, ముప్పాళ్ల నాగేశ్వరరావు కూడా తిరిగి ఎన్నికయ్యారు.

కుప్పంలో చంద్రబాబు కూలిపోయాడు

మంత్రి కారుమూరి



మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: కుప్పంలో ప్రతిపక్ష నేత చంద్రబాబు కూలిపోయాడని, అందుకే బీసీ మహిళా ఎంపీపీపై రాళ్లు వేయించి అరాచకం సృష్టించాడని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. ఆయన ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం కత్తవపాడులో మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మునిసిపల్ చైర్మన్ ఇలా మొత్తం అన్ని ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయం సాధించిందన్నారు. 33 సంవత్సరాల్లో కుప్పానికి ఏమీ చేయకపోవడంతో అక్కడి ప్రజలు చంద్రబాబును పక్కన పెట్టేశారన్నారు. మూడు సంవత్సరాల్లో వైఎస్ జగన్ చేసిన అభివృద్ధిని చూసి ఇంత అభివృద్ధి జరుగుతుందా అని అక్కడి ప్రజలు ఆశ్చర్యపోతున్నారన్నారు. అది తట్టుకోలేని చంద్రబాబు రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తూ సీఎం వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీని దూషిస్తున్నారన్నారు. చంద్రబాబు హయాంలో ఎన్ని అరాచకాలు చేసినా ప్రశ్నించని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ ఇన్ని పథకాలు అమలు చేస్తుంటే అరాచకమంటూ మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు బీజేపీ పదాధికారుల భేటీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేసే అంశంపై చర్చించి రానున్న కాలంలో చేపట్టబోయే కార్యక్రమాల రూపకల్పనకు సోమవారం రాష్ట్ర పదాధికారుల సమావేశం నిర్వహిస్తున్నట్టు పార్టీ మీడియా విభాగం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజు అధ్యక్షతన విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఈ సమావేశం జరుగుతుందని పేర్కొంది. జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురందేశ్వరి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ దేవ్‌ధర్, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర పదాధికారులు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఇన్‌చార్జిలు పాల్గొంటారని తెలియజేసింది.

ఆత్మీయ ఆదరణ

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులకు ప్రతి ఇంటి వద్ద ప్రజల నుంచి ఆత్మీయ ఆదరణ లభిస్తోంది. తమ సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌కి తమ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని ప్రజలు దీవిస్తున్నారు. అన్ని జిల్లాల్లో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, అర్హులకు అవి అందుతున్నాయా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. తమ దృష్టికి వచ్చిన చిన్నచిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు.



తిరుపతి జిల్లా బందార్లపల్లె గ్రామస్తులను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



నెల్లూరు జిల్లా వలేటివారిపాలెం మండలం శాకవరం గ్రామంలో యువతితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి



అనకాపల్లి జిల్లా పెదనందిపల్లిలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

న్యాయవాదికి కక్షిదారుడే దేవుడు

- నిజాయితీ, నిబద్ధతతో వ్యవహరించండి
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్



మాట్లాడుతున్న జస్టిస్ బట్టు దేవానంద్

సాక్షి, అమరావతి: కక్షిదారుడి పట్ల నిజాయితీ, నిబద్ధతతో వ్యవహరించాలని యువ న్యాయవాదులకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ సూచించారు. న్యాయవాదికి కక్షిదారుడు దేవుడని, కక్షిదారుడు ఫీజు రూపంలో చెల్లించే ధనంతోనే న్యాయవాది, అతడి కుటుంబం బతుకుతుందని చెప్పారు. అందువల్ల కక్షిదారుడుని మోసపూరిత, అబద్ధపుమాటలతో తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయకూడదన్నారు. కోర్టులను, న్యాయమూర్తులను ఇంప్రెస్ చేయడానికి ఎన్నడూ ప్రయత్నించవద్దని చెప్పారు. కోర్టుల పట్ల నిజాయితీతో వ్యవహరించాలన్నారు. ఆదివారం బార్ కౌన్సిల్ నిర్వహించిన న్యాయవాదుల ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ న్యాయవాదులు ఓ సీనియర్ న్యాయవాది వద్ద వృత్తి జీవితాన్ని ఆరంభించి కనీసం మూడేళ్లు పనిచేయాలని సూచించారు. వృత్తిని సీరియస్‌గా తీసుకోవాలన్నారు. విజయానికి దగ్గరదారులు లేవని, కష్టపడటమే మార్గమని చెప్పారు. సామాన్య కుటుంబం నుంచి న్యాయమూర్తి స్థాయికి ఎదిగిన తనను స్ఫూర్తిగా తీసుకుంటారన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమానికి తనను ముఖ్య అతిథిగా పిలిచినట్లున్నారన్నారు. న్యాయవాదులు హేతుబద్ధంగా, తార్కికంగా ఆలోచించి, విశ్లేషించి కక్షిదారులకు న్యాయం చేయాలని పిలుపునిచ్చారు. న్యాయవాద వృత్తి కూడా చెస్ వంటిదన్నారు. అవతలి న్యాయవాది ఏం చెప్పబోతున్నారు, దానికి మనం ఎలాంటి సమాధానం ఇవ్వాలి, కోర్టు ఏం ప్రశ్న అడగబోతోంది, అందుకు ఏం చెప్పాలి.. అన్నవాటిని ముందే ఊహించి సిద్ధంగా ఉన్నప్పుడే ఈ వృత్తిలో ముందుకెళ్లేందుకు ఆస్కారం ఉంటుందని వివరించారు. బార్ కౌన్సిల్‌కు, బార్ అసోసియేషన్‌కు మంచి నేతలను ఎన్నుకోవాలని, అప్పుడే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని, లేకుంటే నష్టపోయేది న్యాయవాదులేనని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, బార్ కౌన్సిల్ సభ్యుడు కలిగినీడి చిదంబరం, కార్యదర్శి పద్మలత, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు, రేపు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఐదురోజులుగా వర్షాలు



శింగనమల చెరువు

సాక్షి, విశాఖపట్నం/అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్రంలో రెండురోజులు వర్షాలు కురవనున్నాయి. ప్రస్తుతం తూర్పు విదర్భ నుంచి దక్షిణ కోస్తాంధ్ర వరకు ఉత్తర–దక్షిణ ద్రోణి కొనసాగుతోంది. ఇది సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో సోమ, మంగళవారాల్లో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ఉరుములు, మెరుపులు కూడా సంభవిస్తాయని పేర్కొంది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది. బుధవారం నుంచి వర్షాలు తగ్గుముఖం పడతాయని పేర్కొంది.

పెద్దపప్పూరు, ధర్మవరాల్లో కుండపోత

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఐదురోజులుగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు భారీ వర్షాలు ముంచెత్తాయి. అనంతపురం జిల్లా పెద్దపప్పూరులో 15 సెంటీమీటర్లు, శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో 12 సెంటీమీటర్ల కుండపోత వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా ప్రధాన వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు పొంగి ప్రవహిస్తున్నాయి. పదుల సంఖ్యలో చెరువులు నిండి మరువ పారుతున్నాయి. వందలాది చెరువుల్లోకి వరదనీరు చేరుతోంది. చిత్రావతి, స్వర్ణముఖి, పెన్నా తదితర నదుల పరీవాహక ప్రాంతాలు వరదతో పోటెత్తాయి. దాదాపు ఆరులక్షల హెక్టార్ల విస్తీర్ణంలో సాగులో ఉన్న ఖరీఫ్ పంటలకు ఈ వర్షాలు ఊరటనిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు.



మనస్సు నిశ్చలంగా ఉన్నప్పుడు, ఆ పవిత్ర నిశ్శబ్దంలో సత్యానికి తన వాణి వినిపించే అవకాశం దొరుకుతుంది.
- అరవిందులు

సాక్షి
సోమవారం, ఆగస్టు, 29

ఈ తెలుగు మాట్లాడుతున్నామా?

అమ్మకు జ్వరంగా ఉంటుంది. స్కూల్లో అన్నం గంట కొట్టినప్పుడు ఇంటికెళితే బువ్వ ఉండదని ముందే తెలుసు. ఆ సంగతి ఎవరికీ చెప్పక నీళ్ల కుళాయి వైపు నడుస్తూ రెండు గుక్కలే ఈ పూటకు అనుకుంటున్నప్పుడు ఒక మిత్రుడు కనిపెట్టి– 'రారా. నా టిపినీలో తిందువు' అని పిలుస్తాడు. భలేవాడు వాడు. పక్క పాపిట దువ్వుకుని, స్లిప్పర్లు టపాటపాకొట్టి నడుస్తూ, ఊరికూరికే నవ్వుతూ, మన స్నేహాన్ని ఇష్టపడుతూ. ఆ పూట వాడి ముద్దల్లో మనకు వాటా. పొరుగూరిలోనే ఉంటాడు. ఏదో ఉద్యోగం చేస్తున్నాడని విని ఉంటాము. కలిసి చాలా ఏళ్లయివుంటుంది. 'ఏరా... ఎలాగున్నావు' అని ఫోన్ చేసి అడగడం మంచి తెలుగు వాక్యం. తియ్యటి తెలుగు వాక్యం. పలుకుతున్నామా?

ఆ పిల్ల తూనీగే. పక్కింట్లో ఉంటుంది. అక్కా అని పిలిస్తే తప్ప పలకదు. ఆదివారం వస్తే 'రావే అమ్మాయ్' అని గోరింటాకు పెట్టేది. ఇంట్లో పూసే రోజాపువ్వు బడికి వెళుతున్నప్పుడు జడలో గుచ్చేది. సినిమా పత్రికలో ఉన్న హీరోయిన్ ఫొటో చూపించి 'ఈ డ్రస్సు నీకు భలే ఉంటుంది' అని చెప్పేది. 'భయంగా ఉందక్కా' అనంటే, 'తొక్కు' అని సైకిల్ నేర్పించింది. టీచరట. రిటైరైందట. అమెరికాలో పిల్లల దగ్గర ఉందట. వాట్సప్ కాల్ చేసి 'అకా... నీ గుర్తుగా ఇంట్లో ఎర్రగులాబీ వేశా. చూడ్డానికి ఎప్పుడొస్తావు?' అని అడగడం అలాంటిలాంటి తెలుగు కాదు. తేనె తెలుగు.

మేనమామ ఒకడు ఆ రోజుల్లో హిప్పీ క్రాపుతో ఇంటికొచ్చేవాడు. 'సినిమాకెళ్దాం పదండి' అని తీసుకెళ్లేవాడు. టక్ చేసి కాలేజీకెళితే హీరోలా చూస్తారట. 'మావయ్యా' అని పిలిస్తే చాలు హాజరయిపోయేవాడు. ఒకసారి నాన్నతో ఎవరో గొడవపడితే 'ఖబడ్దార్' అని చూపుడువేలు ఆడించి వచ్చాడు. ఇప్పుడు ఆరోగ్యం బాగలేదు. ఆర్థికంగా కూడా బాగలేడు. బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి ఇంట్లోనే ఉంటున్నాడు. మనమేం శ్రీమంతులం కాము. కాని వెళ్లి, దగ్గర కూచుని, చేయి పట్టుకుని 'మావయ్యా.... సాహసవంతుడు సినిమా చూపించిన సాహసవంతుడివి నువ్వు. ఏం కాదు. లేచి తిరుగుతావు. నీకేం కావాలో నేను చూస్తాను. అందాక ఇది ఉంచు. కాదంటే నామీదొట్టే' అని పలికే తెలుగు ఉంది చూశారూ... దేవతలు ఆశీర్వదించే తెలుగు అది.

అవునండీ... ఆఫీసులో కొలీగే. కలిసి క్యాంటీన్‌కు వెళ్లేవారు. కలిసి భోజనానికి వెళ్లేవారు. కలిసి పని పంచుకుని చేసవతల పడేసేవారు. ఏదో మాటా మాటా అనుకున్నారు. మాట్లాడ్డం మానుకున్నారు. కాని ఎన్నాళ్లు? రోజూ కనపడాలే. పక్కనే ఉండాలే. ముఖం చూడాలే. ఇక చూసి చూసి ఎవరో ఒకరు డెస్క్ దగ్గరికెళ్లి 'క్షమించు గురూ. ఏదో పొరపాటైంది. ఇంతకు ముందులానే ఉందాం. నీతో మాట్లాడకపోతే ఏదో వెలితిగా ఉంది నాకు' అన్నామనుకోండి... ఆ తెలుగు అతి సువాసనతో నిండిన తెలుగు.

'అమ్మా... ఫోన్లు మాట్లాడేటట్టయితే స్పీకర్ పెట్టుకు మాట్లాడు. చెవికి ఇబ్బంది ఉండదు. అస్తమానం టీవీ చూడకు. మొన్నామధ్య నువ్వు చేసే పూర్ణాలు గుర్తుకొచ్చాయిగానీ అంత రుచితో ఇక్కడ ఎవరు చేయగలరనీ'. 'నాన్నా... నా కోసమని కొత్తచొక్కా కొన్నాను. కాని బ్లూ కలర్ మీకే బాగుంటుందనిపించింది. పంపుతున్నా. వేసుకోండి'. 'ఓ నా బంగారు చెల్లీ... ఈ అన్న పెళ్లయ్యాక మారిపోయాడని అనకు. చిన్నప్పుడు పార్కులో ఉయ్యాలూగుతూ కింద పడబోతుంటే పట్టుకున్నాను. ఇప్పుడూ అంతే, పక్కనే ఉంటాను'. 'పెద్దొదినా... మీరిద్దరూ పిల్లలతో భోజనానికి ఎందుకు రారు మా ఇంటికి. పట్టింపులు పెట్టుకోకండి దయచేసి'... 'ఏమే మూగమొద్దు. క్లాస్‌మేట్లందరం టూర్‌కెళ్దామంటే ఏ సంగతీ చెప్పవేమే'...

ఎంతమంచి తెలుగు వాక్యాలో చూడండి ఇవి. పలకడం మరిచిపోతున్న వాక్యాలు. పలకక్కర లేదనుకుంటున్న వాక్యాలు. వ్యవహారంలో నుంచి తొలగిపోతున్న వాక్యాలు. అంతరించిపోయే ప్రమాదంలో ఉన్న వాక్యాలు. బంధం గట్టిగా ఉంటే బలగం గట్టిగా ఉంటుంది. బంధం పట్ల ఆపేక్ష ఉంటే నిలబెట్టుకోవాలన్న తలంపు ఉంటుంది. 'అ' ఒక్కటీ లేదు. 'ఆ' పక్కనే ఉంది. 'అచ్చులు' మాత్రమే లేవు. 'హల్లుల'ను తోడు చేసుకున్నాయి.

ఆగస్టు 29 గిడుగు రామమూర్తి పంతులు జయంతి. వ్యవహారిక భాష కోసం ఆయన జీవితాన్ని ధారబోశాడు. ప్రతి తెలుగువాణ్ణి తెలుగు కోసం గుప్పెడు ఊపిరి ఇమ్మన్నాడు. కాని జీవన వ్యవహారాల పట్ల ఉండే అక్కరను బట్టే భాష పట్ల అక్కర కూడా ఉంటుంది. మన బంధాలతో ఎలా ఉన్నామో భాషతో కూడా అలాగే ఉంటాము. జన్మ సంబంధాలు, రక్త సంబంధాలు, స్నేహ సంబంధాలు, ఇరుగు పొరుగు సంబంధాలు, సాటి వర్గ కుల మత సంబంధాలు... వీటికి ఎంత ప్రేమ, గౌరవం ఇస్తామో భాష పట్ల కూడా అంతే గౌరవం ఇస్తాము. ఒకటి ఉండి ఒకటి లేదు అనేది ఉండదు. అన్నీ ఒక తానులో బట్టలే.

ఇల్లంటే డోర్ కర్టెన్, బెడ్‌రూమ్, టాయిలెట్ అని మాత్రమే కాక 'పుస్తకాల అర' కూడా అనుకోనంత వరకు, కుటుంబం అంటే భార్య, భర్త, పిల్లలు మాత్రమే అని కాక అనేక అనుబంధాలు కూడా అని తలవనంత వరకు, బంధాలతో ఆత్మీయత భాషతో పాశంలోనే జీవన మాధుర్యం ఉంది అని ఇవి రెండూ ఎంతకూ చెల్లించలేని, ఎగవేతకు కుదరని రుణాలని చిత్తంతో నమ్మనంత వరకూ తెలుగువారి జీవితం, తెలుగుతో నిండిన జీవితం సంపూర్ణం అనిపించుకోదు. ఎవరైనా స్నేహితునికి ఫోన్ చేసి 'మంచి తెలుగు పుస్తకం ఏదైనా కొనుక్కు వద్దామా' అనండి. ఇవాళ్టికివాళ అంతకు మించిన పుణ్యప్రదమైన తెలుగు మరొకటి లేదు. అనుబంధాల తెలుగు వెలుగు గాక!

గ్రహం అనుగ్రహం

శ్రీశుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** శు.విదియ ప.2.32 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** ఉత్తర రా.11.21 వరకు, తదుపరి హస్త **వర్జ్యం:** ఉ.5.52 నుండి 7.32 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.25 నుండి 1.17 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.44 వరకు **అమృతఘడియలు:** ప.3.46 నుండి 5.25 వరకు.

సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం : 6.15
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

మార్పునకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమా?

కామెంట్



కరణ్ థాపర్

ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య ఆర్థిక వ్యవస్థేనని ప్రముఖ ఎన్నికల పండితులు నొక్కి చెబుతున్నారు. తాజాగా జరిగిన ఎన్నికల సర్వే కూడా అదే చెబుతోంది. 2014లో మోదీ అధికారంలోకి వచ్చాక తమ ఆర్థిక స్థితి దిగజారిపోయిందనో, ఏమీ మారలేదనో అత్యధిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు. దేశంలో నిరుద్యోగ పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని కూడా ఎంతోమంది అంటున్నారు. తమ ఆర్థిక పరిస్థితి పట్ల ప్రజల్లో ఇంతటి తీవ్ర నిరాశాభావం దేశంలో రానున్న మార్పును సంకేతిస్తోంది. కానీ కాంగ్రెస్ పార్టీ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోగలుగుతుందా? గాంధీ కుటుంబేతర నాయకుడికి అధ్యక్ష పగ్గాలు అప్పజెబుతుందా? ఒకవేళ అప్పజెప్పినా స్వేచ్ఛగా పనిచేయగలిగే వీలు కల్పిస్తుందా? వీటన్నింటికీ ఆశావహ సమాధానాలు దొరికితే గనక, ఈ కొత్త అధ్యక్షుడి హయాంలో కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించగలిగితే భారీ రాజకీయ మార్పు సాధ్యమవుతుంది. కాంగ్రెస్ పార్టీలో సమూల మార్పు ఆ పార్టీకే కాకుండా దేశానికే ప్రయోజనకరంగా ఉంటుందని భావించవచ్చు.

గులామ్ నబీ ఆజాద్ కాంగ్రెస్ పార్టీకి చేసిన నాటకీయ రాజీనామా ఇప్పటికే సాగుతున్న ప్రక్రియను మరింత ముందుకు నెడుతుందా? మన ప్రజాస్వామ్యానికి కీలకమలుపు తీసుకురానున్న కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న గణనీయమైన మార్పు అవకాశం గురించి నేను ప్రస్తావిస్తున్నాను. రెండు వాస్తవాల వల్ల ఇది ఉత్పన్నమవుతోంది. కాంగ్రెస్ పార్టీ తమ నూతన అధ్యక్షుడిని ఎన్నుకోవడానికి కృత నిశ్చయంతో ఉంది. ఈ పోటీలో సోనియాగాంధీ కుటుంబీకులు ఎవరూ పోటీ చేయడం లేదు. కాబట్టి దీని ప్రతిఫలంగా ఒక ఉత్తేజ కరమైన, విశ్వసనీయమైన, బహుశా జనరంజకమైన జాతీయ ప్రతిపక్షం ఆవిర్భవించడాన్ని మనం చూడవచ్చా?



బహుశా నేను ఈ విషయంలో రెండు ఊహలపై ఆధారపడుతున్నాను. మొదటిది: స్వేచ్ఛాయుతమైన, న్యాయబద్ధమైన ఎన్నిక ద్వారా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకోబోతున్నారు. కాంగ్రెస్ సభ్యులు ఎవరైనా ఈ ఎన్నికలో పోటీ చేయడానికి రంగం సిద్ధమవుతోంది. ఇది ఎన్నికలపరంగా ప్రతిభకు, రాజకీయ సున్నితత్వానికి, విస్తృతమైన బహిరంగ ప్రజా నివేదనకు ఆస్కారమిస్తోంది. పైగా బీజేపీని సవాలు చేయగల గొప్ప వక్తను బహూకరించడమే కాదు... భారతీయ ఓటరుకు అర్థవంతమైన ప్రత్యామ్నాయాన్ని కూడా ప్రతిపాదిస్తోంది. రెండు: అధ్యక్షుడిగా గెలిచే వ్యక్తి కాంగ్రెస్ పార్టీలో తాను ఆలోచిస్తున్న విధంగా సమూల మార్పులు చేసే స్వేచ్ఛను కలిగి ఉంటారు కూడా! అదే సమయంలో గాంధీలు పార్టీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం కాకుండా నూతన అధ్యక్షుడికి ప్రోత్సాహం, మద్దతు అందించే స్థానంలో ఉంటారు. గులామ్ నబీ ఆజాద్ రాజీనామా తర్వాత బహుశా కాంగ్రెస్ పార్టీ ఈ విధంగా మాత్రమే బతికి బట్ట కడుతుంది.

అయితే నా వివేకం సూచిస్తున్న సానుకూల అవకాశాలతో పోలిస్తే నా అంచనాలు తప్పు అయ్యే అవకాశాలే ఎక్కువగా ఉండ వచ్చు కూడా! అదేమంటే గాంధీయేతర అధ్యక్షుడిని కాంగ్రెస్ పార్టీ చక్కగా ఎంపిక చేసుకోవచ్చు కానీ, గాంధీ కుటుంబం ఆయనకు స్వేచ్ఛగా పనిచేయగల, మాట్లాడగల, వ్యూహాన్ని మార్చివేయగల స్వాతంత్ర్యాన్ని ఇస్తుందా? అలాగే తాను కోరుకుంటున్న పొత్తుల కోసం ప్రయత్నించే స్వాతంత్ర్యాన్ని ఇస్తుందా? కాంగ్రెస్ పార్టీ శ్రేయస్సు, మన ప్రజాస్వామ్య శ్రేయస్సు రీత్యానే కాకుండా దేశ భవిష్యత్తు కోసం కూడా గాంధీ కుటుంబం అలాంటి అవకాశం ఇస్తుందని మాత్రమే నేను ఆశించగలను.

2024 ఎన్నికల్లో బీజేపీ దెబ్బతినగలదని సూచించడానికి గణనీయమైన సాక్ష్యం ఉందని చెబుతున్నాను. సమర్థుడైన, బాధ్యతాయుతమైన అధ్యక్షుడి నాయకత్వం కింద పునరుజ్జీవం పొందే కాంగ్రెస్ పార్టీ, ఎన్నికల ఫలితాన్నే నిర్ణయించగలిగేలా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోగలదు. 'ఇండియా టుడే' ఇటీవలే నిర్వహించిన 'జాతి మనోగతం' సర్వే నుంచి దీనికి సరైన సాక్ష్యం లభిస్తోంది. దేశ ఆర్థిక వ్యవస్థ గురించి భారత ప్రజల తీవ్ర ఆందోళనను, వేదనను కూడా ఈ తాజా సర్వే ప్రతిబింబించింది. మనలో మెజారిటీ ప్రజలకు ఇదే ప్రస్తుతం విలువైన అంశంగా ఉంది.

నరేంద్ర మోదీ ప్రభుత్వ అతిపెద్ద వైఫల్యం ఆర్థిక వ్యవస్థ నిర్వహణ సమస్యలే అని 69 శాతం మంది గుర్తించారు. దేశ పరిస్థితి ఇంకా ఘోరంగా మారుతుందనీ, లేదా కనీసం మెరుగుపడదనీ ఈ పోల్‌లో పాల్గొన్న వారిలో 57 శాతం మంది నమ్ముతున్నారు. పరిస్థితులు మెరుగవుతాయని నమ్ముతున్న వారికంటే మెరుగుపడవని నమ్మే వారి సంఖ్యే ఎక్కువగా ఉండటం గమనార్హం. మరింత ముఖ్యమైన విషయం ఏమిటంటే, 2014లో మోదీ అధికారంలోకి వచ్చాక తమ ఆర్థిక స్థితి దిగజారిపోయిందని, లేక ఏమీ మారలేదని 67 శాతం మంది చెప్పారు. తమ పరిస్థితి మోదీ వచ్చాక మెరుగుపడిందని 28 శాతం మంది మాత్రమే చెప్పారు. పైగా దేశంలో నిరుద్యోగం చాలా తీవ్రంగా ఉందని, లేదా ఎంతో కొంత తీవ్రమైన స్థితిలో ఉందని 73 శాతం మంది భావించారు. ఇందులో 56 శాతం మంది అయితే నిరుద్యోగ పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. అలాగే తమ కుటుంబ ఆదాయం తగ్గిపోయిందని లేదా మెరుగుపడలేదని 60 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఈ వివరాలను గమనించినట్లయితే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అత్యంత బలహీనమైన స్థితిలో ఉందని కనిపించడం లేదా?

బహుశా మన అత్యంత గౌరవనీయులైన (మాజీ) ఎన్నికల పండితుడు యోగేంద్ర యాదవ్ చెబుతున్నదాన్ని బట్టి సందేశం చాలా స్పష్టంగా ఉంది. దేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య ఆర్థిక వ్యవస్థేనని ముమ్మార్లు ఆయన నొక్కి చెప్పారు. తమ ఆర్థిక భవిష్యత్తు గురించి సాంప్రదాయికంగానే భారతీయులు చాలా ఆశావహ దృక్పథంతో ఉంటారు. కానీ తమ ఆర్థిక పరిస్థితి పట్ల ఇంత తీవ్ర నిరాశాభావం దేశంలో రానున్న మార్పును సంకేతిస్తోందనీ, వ్యూహాత్మకంగా సరైన రీతిలో నిర్వహించగలిగితే దేశంలో భారీ రాజకీయ మార్పునకు ఇది దారి తీస్తుందనీ మనం గ్రహించవచ్చు.

అయితే, దేశంలో రెండో నాటకీయ మార్పు కూడా ఇప్పటికే చోటు చేసుకుందని 'ఇండియా టుడే' పోల్ సూచిస్తోంది. అదేమిటంటే ఈసారి మోదీ ప్రభుత్వ ప్రజాస్వామిక విశ్వసనీయతే ప్రశ్నార్థకంగా మారింది. భారత్‌లో ప్రస్తుత ప్రజాస్వామ్య స్థితి గురించి మీరేమనుకుంటున్నారు అని 'ఇండియా టుడే' పోల్‌లో ప్రశ్నించినప్పుడు– 48 శాతం మంది ప్రమాదకరంగా ఉందని నమ్ముతుండగా, 37 శాతం మంది ప్రజాస్వామ్యానికి ప్రమాదమేమీ లేదని చెప్పారు. మరీ ముఖ్యమైన విషయం ఏమిటంటే, మన ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతోందని నమ్మేవారి సంఖ్య ఈ సంవత్సరం జనవరి నుంచి దాదాపు 10 శాతం పెరిగింది. అదే సమయంలో ప్రజాస్వామ్యం చక్కగా ఉందని చెప్పినవారి సంఖ్య దాదాపు 20 శాతం పడిపోయింది. ఈరోజు మన ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందనో, లేదనో చెబుతున్న వారి మధ్య అంతరం ఆశ్చర్యకరంగా 11 శాతం మాత్రమే. మరోసారి చెబుతున్నాను, విశ్వసనీయుడైన కాంగ్రెస్ నూతన అధ్యక్షుడు పార్టీని ఈ అంశంపైనే నిర్మించగలడు. పైగా మరో విషయం గుర్తుపెట్టుకోవలసి ఉంది. స్వేచ్ఛాయుతమైన, న్యాయబద్ధమైన ఎన్నికలో అతడు గెలిచి, అంతర్గతంగా ప్రజాస్వామికంగా ఉండే పార్టీకి ప్రాతినిధ్యం వహించగలిగితే, అది అతడి స్థానాన్ని మరింతగా బలపర్చగలదు.

అయితే ఇప్పుడు కాంగ్రెస్‌కు ఈ అవకాశం మరీ ఎక్కువ కాలం ఉండకపోవచ్చు. ఎందుకంటే రానున్న 20 నెలల కాలంలో మోదీ, బీజేపీ తమ పట్ల ప్రజల్లో ఉంటున్న ఈ వ్యతిరేక అవగాహనను మార్చడానికి తీవ్రంగా ప్రయత్నించవచ్చు. కాబట్టి పరిస్థితి తీవ్రంగా ఉన్నప్పుడే గాంధీలు పక్కకు తొలగి, వారి వారసుడికి పూర్తి అవకాశాలను కల్పించి తీరాలి. బహుశా, కేవలం బహుశా, ఆజాద్ నిష్క్రమణ వల్ల గాంధీ కుటుంబం ఇది చేస్తుందనే నమ్మకం కలిగిస్తోంది. లేకపోతే కాంగ్రెస్ పార్టీ ఇలాగే బద్ధకంగా, నిస్తేజంగా ఉంటూ, కష్టాల్లో మునిగి తేలుతూ ఉంటుంది.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మొదలైంది



బ్రిటన్ ప్రధానమంత్రి అభ్యర్థి రిషీ సునాక్ ఆవులను పూజిస్తున్నారు. మహమ్మారి కాలంలో శాస్త్రవేత్తలను బలోపేతం చేయడం తప్పని చెబుతున్నారు. యూకేను యూపీగా మార్చే ప్రక్రియ మొదలైనట్టుంది. – కాజల్ శ్రీనివాసన్, కమెడియన్

తరలిన సృజన



మంచి ఆలోచనల బీజాలు అంతటా ఉంటాయి. అవి వికసించడానికి కావాల్సిందల్లా నీళ్లు, కాంతి. 2000–2010 మధ్యకాలంలో అమెరికాకు వలస పోయిన ఆవిష్కర్తల సంఖ్య పాతిక దేశాలకు వెళ్లినవారికంటే ఎక్కువ. ఈ విషయంలో చైనా, ఇండియా పొందిన సంఖ్య కంటే కోల్పోయినవారి సంఖ్య ఎక్కువ. ఆవిష్కరణకు కీలకం వలస. అవకాశాలు ఎక్కడుంటాయో అక్కడికి ప్రతిభ చేరుకుంటుంది, పెరుగుతుంది. – ఆడమ్ గ్రాంట్, ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

లాభం లేదు



రోగనిరోధకత తక్కువగా ఉన్న పిల్లలకు బలవంతపు మాస్కులు ప్రయోజనం కలిగిస్తాయని కొందరు అంటున్నారు. అలాంటి ప్రయోజనం కలుగుతుందని చెప్పడానికి ఏ ఆధారమూ లేదు. ఈ ప్రయోజనం ఉందన్న తప్పుడు అవగాహనతో ఇదింకా కొంతమందిని ఈ రిస్కు తీసుకునేట్టు చేస్తుంది. లేకపోతే వాళ్లు దాని జోలికి పోరు. – జయ్ భట్టాచార్య, మెడిసిన్ ప్రొఫెసర్

ఐ లవ్ ఇండియా



హోం, స్వీట్‌హోమ్ ఇండియా. నా మాతృభూమి ఇండియా. నీ సుసంపన్న నేల మీద మొదటి అడుగు మోపిన నాటి నుంచీ నా జీవితం ఇక మునుపటిలా లేదు. భారతదేశంలో ఏదో ప్రత్యేకత, ఏదో మ్యాజిక్ ఉంది. భారత ప్రయాణాన్ని ప్రతి ఒక్కరూ అనుభవించి తీరాలి. – రెనీ లిన్, రచయిత్రి

అనకూడదు



'సర్ తన్ సే జుదా' (శరీరాన్నీ, తలనూ వేరు చేస్తాం) అనడం ద్వేష ప్రసంగమే కాదు; దానివల్ల భయోత్పాత చర్యలు జరిగే ప్రమాదం కూడా ఉంది. ఏ నాగరిక సమాజంలోనూ అలాంటి స్లోగన్‌ను అనుమతించకూడదు. – అశోక్ స్వైన్, 'పీస్ అండ్ కాన్‌ఫ్లిక్ట్ రీసెర్చ్' ప్రొఫెసర్

ఐక్యతే బలం



ఎంతోమంది భారతీయులు– హిందువులు, జైనులు, ముస్లింలు, సిక్కులు– వాళ్లు ఏ మతానికి చెందినవారైనా సరే, ఇస్లామిక్ భయోత్పాతానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యం కోసం ఉమ్మడిగా నిలబడటం హృదయంగమంగా ఉంది. ఐక్యతతో మాత్రమే మనం ఈ తీవ్రవాదులను నిరోధించగలం. శాంతియుత సమాజాన్ని నిర్మించుకోగలం. – వాసిక్ వాసిక్, ఫెలో


జీవించాల్సిన విధం



ప్రియమైన యువజనులారా! వీటిని ఇలా మార్చుకోండి: మద్యాన్ని నీళ్లతో; నెట్‌ఫ్లిక్స్‌ను పాడ్‌కాస్టులతో; ప్రభావశీలురను సృజనకారులతో; అతి ఆలోచనను క్రియతో; విషపూరిత స్నేహితులను గురువులతో; ఫిర్యాదులను కృతజ్ఞతతో; తెల్లవార్లూ మెలకువను సరైన నిద్రతో; డబ్బులు ఖర్చు చేయడాన్ని పెట్టుబడితో! – అఫ్షైన్ ఇమ్రానీ, వైద్యుడు

భాషా భేషజాలపై పిడుగు!

సందర్భం



ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

మహనీయులు ఈ లోకంలో గొప్ప కార్యాన్ని సాధించడం కోసమే పుడతారు. అలాంటి వారినే 'కారణ జన్ములు' అంటారు. గిడుగు ఆ కోవలోకే వస్తారు. తన జీవితాన్ని భాషా ఉద్యమాల కోసం వెచ్చించిన కార్యశూరుడు గిడుగు. ఆయన తొలి తెలుగు ఆధునిక భాషావేత్త, అంతర్జాతీయ భాషా శాస్త్రవేత్త కూడా. 1863 ఆగస్టు 29వ తేదీన శ్రీముఖలింగం సమీపాన పర్వతాలపేట గ్రామంలో గిడుగు జన్మించారు. విజయనగరం మహారాజా వారి కళాశాలలో లోయర్ ఫోర్తు ఫారంలో చేరారు. అదే తరగతిలో గురజాడ అప్పారావుతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతోనే జీవితాంతం మంచి స్నేహితులుగా ఇద్దరూ కలసి మెలిగారు. ఉపాధ్యాయునిగా ఉద్యోగ జీవితం ప్రారంభించారు.

1889లో సవరజాతి వారితో గిడుగుకు పరిచయం ఏర్పడింది. సవరుల చరిత్ర, సంస్కృతి, భాష మీద గిడుగుకు అమితమైన ఆసక్తి కలిగింది. అందువల్ల సవరల భాషపై ప్రత్యేకంగా విశేషమైన కృషి చేశారు. 1893 జనవరి 15వ తేదీన గిడుగు శ్రీముఖలింగ క్షేత్రానికి వెళ్ళారు. 22 శాసనాల్ని నిశితంగా పరిశోధించారు. ప్రభుత్వం కూడా గిడుగు శాసన పరిశోధనలను గుర్తించింది. 1894లో గిడుగు 'వయోజన విద్య'ను ప్రారంభించారు. ఉద్యోగ విరమణ తర్వాత ఎక్కువగా భాషా సాహిత్యాల పరిశోధన వైపు మళ్లారు. గిడుగు పెద్ద కొడుకు సీతాపతి ఆయనకు సహాయ సహకారాలు అందించారు. గిడుగు వారికి ఎంతోమంది శిష్యులు ఉన్నారు. తాపీ ధర్మారావు, చిలుకూరి నారాయణరావు లాంటివారు ఆయన శిష్యులే. 1910 తర్వాత గిడుగు పూర్తిగా భాషాపరిశోధనలో నిమగ్నమయ్యారు. 1911లో సవర భాషపై అనితర సాధ్యమైన, విశేషమైన కృషిచేసినందుకుగాను ఆయనకు ప్రభుత్వం 'మెరిట్ సర్టిఫికెట్' బహూకరించింది.

వ్యావహారిక భాషోద్యమానికి గిడుగు సారథ్యం వహించారు. ఊరూరా సభలు, సమావేశాలు జరిపించి ప్రజల్లో చైతన్యం కలుగజేశారు. అందరి తోనూ చర్చలు జరిపారు. 1916లో కొవ్వూరులో గిడుగు ఉపన్యాసాన్ని కందుకూరి వీరేశలింగం పంతులు విని ప్రభావితులయ్యారు. గిడుగు ఆ విషయం తెలుసుకొని కందుకూరిని కలిశారు. ఇద్దరూ 1919లో 'తెలుగు' పేరుతో పత్రికను స్థాపించారు. తన భావాలను, ఆలోచనలను, ఈ పత్రికలో ముద్రించారు గిడుగు. గ్రాంథిక వాదుల ఆక్షేపణలన్నింటినీ, ఈ పత్రిక తూర్పారబట్టింది. 'ఆంధ్ర పండిత, భిషక్కుల భాషా భేషజం', 'బాలకవి శరణ్యం' వంటి గ్రంథాలను మొదటిసారిగా ఈ పత్రిక ద్వారానే వెలువరించారు. గిడుగు మొత్తం పరిశోధన అంతా భాషాతత్త్వంపైనే జరిగింది. ప్రతి అంశాన్ని శాస్త్రీయ దృక్పథంతో లోతుగా చర్చించారు. గిడుగు చేసిన భాషాసేవకు గుర్తింపుగా అత్యంత ప్రతిష్ఠాత్మకమైందిగా భావించిన 'కైజర్–ఇ– హింద్' అనే బంగారు పతకాన్ని 1933 జనవరిలో ప్రభుత్వం బహూకరించింది. గిడుగు వ్యావహారిక భాషోద్యమం ఫలితంగా 1933లో 'నవ్య సాహిత్య పరిషత్తు' ఏర్పడింది. వ్యావహారిక భాషలో అన్ని రకాల రచనలూ రావాలని ఈ పరిషత్తు అభిప్రాయపడింది. 1935 మే 6వ తేదీన గిడుగుకు ఐదవ జార్జి చక్రవర్తి రజతోత్సవ సువర్ణ పతకాన్ని ప్రభుత్వం ప్రదానం చేసింది.



గిడుగు వెంకట రామమూర్తి పంతులు

గద్య చింతామణి, వ్యాసావళి వంటి గ్రంథాల్ని గిడుగు రాశారు. పీఠికా విమర్శ, గ్రంథ పరిష్కార విమర్శ, లక్షణ గ్రంథ విమర్శ, నిఘంటు విమర్శ వంటి అంశాల్లో కూడా ఎవ్వరూ చెయ్యని, చెయ్యలేని లోతైన పరిశోధన చేశారు. గ్రాంథిక భాషావాదుల డాంబికాల్ని గిడుగు బట్టబయలు చేశారు. కొమ్ములు తిరిగిన మహామహా పండితులకే సంస్కృతం సరిగా రాదని ఉదాహరణ పూర్వకంగా విడమర్చి మరీ తెలియజేశారు. ఆయన వ్యాకరణాల్లోనూ నిఘంటువుల్లోనూ సమాన ప్రతిభ కలిగినవారు. సవర–తెలుగు, తెలుగు – సవర, ఇంగ్లిష్ – సవర, సవర – ఇంగ్లిష్ నిఘంటువుల్ని తయారుచేశారు. నిఘంటువుల నిర్మాణానికి పండిత ప్రతిభతో పాటు, భాషాశాస్త్ర జ్ఞానం, శాస్త్రీయ దృక్పథం కూడా తప్పనిసరిగా ఉండాలని వారి అభిప్రాయం. భాష ఎప్పుడూ పరిణామం చెందుతుందని గిడుగు వారి వాదన. అదే చివరకు విజయం సాధించింది. 1938 డిసెంబర్ 1వ తేదీన ఆంధ్ర విశ్వకళా పరిషత్ గిడుగుకు 'కళాప్రపూర్ణ' బిరుదునిచ్చి ఘనంగా సన్మానించింది.

సవరభాష కోసం, వ్యావహారిక భాష కోసం, గిడుగు చేసిన కృషి అనన్య సామాన్యమైంది. అనితర సాధ్యమైంది. అక్షర జ్ఞానం లేని సవరలకు జ్ఞానం కలుగ చేయడం కోసం 'సవర భాషోద్యమం' చేపట్టారు. మహా మహా పండితులను, మేధావులను వ్యావహారిక భాషావాదాన్ని ఒప్పించడం కోసం 'వ్యావహారిక భాషోద్యమం' చేపట్టారు. అజ్ఞానంతో ఉన్నవారికి జ్ఞానభిక్ష పెట్టేది 'సవర భాషోద్యమం'. జ్ఞానం ఉన్నవారిలోని అజ్ఞానాన్ని తొలగించేది 'వ్యావహారిక భాషోద్యమం'. రెండూ గొప్ప ఉద్యమాలే. రెండూ మంచి పనులే. అసలు విషయం ఏమంటే – ఈ రెండు ఉద్యమాలూ నూటికి నూరుపాళ్లు ప్రజలకు సంబంధించినవే. ఈ ఉద్యమాల్లో రవ్వంతయినా స్వార్థం లేదు.

ఆయన గూర్చి ఒక్క మాటలో చెప్పాలంటే ఆధునిక భాషా విజ్ఞాన సర్వస్వం గిడుగు. వీరు 1940 జనవరి 22వ తేదీన మద్రాసులో తుదిశ్వాస విడిచారు. గిడుగును 'తెలుగు సరస్వతి నోముల పంట' అని విశ్వనాథ సత్యనారాయణ కీర్తించారు. 'తెలుగుదేశంలో అవతరించి తెలుగు భాషను ఉద్ధరించిన పుంభావ సరస్వతి గిడుగు వెంకట రామమూర్తి పంతులు' అని చింతా దీక్షితులు కీర్తించారు. ఇటువంటి ఉద్దండుల మన్ననలను పొందగలిగిన గిడుగు 'పిడుగు'గా ప్రసిద్ధి పొందారు.

వ్యాసకర్త ఏపీ అధికార భాషా సంఘ అధ్యక్షులు
(నేడు గిడుగు జయంతిని 'తెలుగు భాషా దినోత్సవం'గా ఏపీ ప్రభుత్వం జరుపుతున్న సందర్భంగా)

మిత భాషణం మేలు

మితభాషణం రఘువంశ రాజుల లక్షణాలలో ప్రధానమైనదిగా కాళిదాసు 'రఘువంశ' కావ్యంలో పేర్కొన్నాడు. మితభాషణం సత్యం కోసం అట! 'సత్యాయ మితభాషిణాం' అంటాడు. మాట్లాడే మాట సత్యం పలకటానికి మాత్రమే ఉపయోగించాలని భావన. అసత్యాలు మాట్లాడటం ఎందుకు? కంఠశోష! దాని వల్ల ప్రమాదాలు కూడా ఉంటాయి.

అతిగా వాగేటప్పుడు అనవసర విషయాలు చెప్పవచ్చు. తెలియకుండా అసత్యాలు దొర్లవచ్చు. ఆ ధోరణిలో నోరుజారి రహస్యాలు బయట పెట్టవచ్చు. ఆ కారణంగా ఇబ్బందులు, శత్రుత్వాలు కలగవచ్చు.



అతిగా మాట్లాడటం ఒక వ్యసనం. తెగవాగే వాళ్ళ మాటకి విలువ ఉండదు. విలువైన మాటలు చెప్పినా ఎవరూ పట్టించుకోరు వాళ్ళ మాటలని. చెప్పటానికి విషయం లేనప్పుడు భాషాడంబరం ఉంటుంది. పెద్ద పెద్ద కఠిన పదాలు, దీర్ఘసమాసాలు వాడితే తనకి విలువ పెరుగుతుంది అనే భ్రమలో ఉంటారు చాలామంది. కానీ, సత్యం ఎప్పుడు సరళంగా, సూటిగా ఉంటుంది. ఉన్న దానిని ఉన్నట్టు చెప్పటానికి భాషా భేషజం అవసరం లేదు. తన వాదనలో బలం లేనప్పుడు, ఎదుటివారిని పక్కదారి పట్టించటానికి ఆడంబరమైన భాష వాడటం జరుగుతుంది. అందుకే వేమన 'అల్పు డెపుడు పలుకు నాడంబరముగాను / సజ్జనుండు పలుకు చల్లగాను...' అన్నాడు.

ఎవరి మధ్యనైనా తేడాలు వచ్చి తగాదాలకు దారి తీసేది అధిక ప్రసంగమే. ఎదుటి పక్షంవారి రహస్యాలను కూపీ లాగటానికి చేసే మొదటి ప్రయత్నం, ప్రయోజనకరమైనది కూడా వారిని మాటల్లోకి దింపటం. వాచాలత ఉన్నవారు మాటల్లో పడి రహస్యాలని చెప్పేయటం జరుగుతుంది. ఏదైనా చెప్పటానికి ఉన్నప్పుడు మాత్రమే మాట్లాడటం ఉత్తమ లక్షణం. దీనిని అలవరచుకుంటే అన్నిరకాల ఆరోగ్యాలు బాగుంటాయి. అతివాగుడు ఆయుక్షీణమ్ అని పెద్దలు చెప్పిన మాట నిజమని మునులు దీర్ఘాయువులుగా ఉండటం చూస్తే అర్థమవుతుంది.

– డా॥ ఎన్. అనంత లక్ష్మి

క్లుప్తంగా

శ్రీశారదా పీఠాధిపతిని కలిసిన టీటీడీ చైర్మన్



స్వరూపానందేంద్ర ఆశీస్సులు తీసుకుంటున్న వైవీ సుబ్బారెడ్డి

పెందుర్తి: రుషికేష్‌లోని శ్రీ శారదాపీఠం శాఖను టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆదివారం సందర్శించారు. చాతుర్మాస్య దీక్షలో ఉన్న పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. తిరుమలలో ఇటీవల నిర్వహించిన పవిత్రోత్సవాల పవిత్రాలను, శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని, అభిషేక జలాలను స్వామీజీకి అందజేశారు. టీటీడీలో ఇటీవల తీసుకున్న పలు నిర్ణయాలను స్వామీజీకి వివరించారు. అన్నవరం ఆలయాధికారులు, పండితులు స్వామీజీని కలిసి ప్రసాదాన్ని అందించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈవో మూర్తి పాల్గొన్నారు.

దేశంలోనే తొలిసారిగా శునకాల నుంచి రక్తం సేకరణ



కుక్కల నుంచి రక్తాన్ని సేకరిస్తున్న దృశ్యం


ఎంవీపీ కాలనీ (విశాఖ తూర్పు): విశాఖ జిల్లా పెదవాల్తేర్‌లోని పావ్స్ ఎన్ టెయిల్స్ ప్రీమియం పెట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం కుక్కల రక్తదాన శిబిరం నిర్వహించారు. హాస్పిటల్ 6వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం దీన్ని నిర్వహించినట్లు చీఫ్ వెటర్నరీ సర్జన్ డాక్టర్ శ్రీధర్ తెలిపారు. మనుషుల మాదిరిగానే ప్రమాద, సర్జరీ సమయాల్లో కుక్కలకు రక్తం అవసరమవుతుందన్నారు. ఈ అవసరాన్ని తీర్చడానికి ఇతర కుక్కల నుంచి సేకరించిన రక్తం ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ రక్తదానం ద్వారా ప్రమాదంలో గాయపడిన కుక్కల ప్రాణాలు కాపాడేందుకు వీలుందని చెప్పారు. మేలి రకం శునకాల నుంచి రక్తం సేకరించినట్లు వెల్లడించారు. ఈ శిబిరం ద్వారా వివిధ జాతులకు చెందిన 10 నుంచి 15 శునకాల నుంచి రక్తాన్ని సేకరించినట్లు వెల్లడించారు. ఈ తరహా రక్తసేకరణ దేశంలో ఇదే ప్రథమమన్నారు.

తల్లిని వేధించిన వ్యక్తిని చంపిన తనయుడు

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): తన తల్లిని వ్యంగ్యంగా మాట్లాడి వేధించడంతోపాటు అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని నడిరోడ్డుపై వెంటాడి బండరాయితో కొట్టి చంపాడు ఓ యువకుడు. మృతదేహాన్ని తీసుకొచ్చి తన తల్లి కాళ్ల ముందు పడేశాడు. ఈ ఘటన ఆదివారం ఉదయం విశాఖపట్నంలోని అల్లిపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అల్లిపురం ప్రాంతానికి చెందిన గొంతిన శ్రీను(45) పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. అతనికి మద్యం తాగే అలవాటు ఉంది. పనులకు ఎవరు పిలిస్తే వారితో వెళ్తాడు. ఇందుకోసం రోజూ అల్లిపురం మెయిన్ రోడ్డులో గల ఎలైట్ ఇన్ లాడ్జి జంక్షన్ వద్ద కూర్చుంటాడు. యథావిధిగా ఆదివారం ఉదయం ఐదు గంటల ప్రాంతంలో శ్రీను ఎలైట్ ఇన్ లాడ్జి జంక్షన్‌కు చేరుకున్నాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్నాడు. అదే ప్రాంతానికి చెందిన గౌరీ అనే మహిళ పాచిపనుల కోసం అటుగా వెళ్తోంది. ఆమెతో శ్రీను వ్యంగ్యంగా మాట్లాడి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఇద్దరి మధ్య కొంత వాగ్వాదం చోటుచేసుకుంది. గౌరీ ఈ విషయాన్ని తన కుమారుడు ప్రసాద్‌కు ఫోన్ చేసి చెప్పింది. ప్రసాద్ వెంటనే అక్కడకు చేరుకుని 'నా తల్లిని అవమానిస్తావా..' అంటూ శ్రీనును ఇటుకతో కొట్టాడు. పరుగులు తీస్తున్న శ్రీనుని వెంటాడి మరీ రాయితో కొట్టి చంపేశాడు. శ్రీను చనిపోయిన తర్వాత నడిరోడ్డుపైకి ఈడ్చుకొచ్చాడు. ఆవేశంతో కాళ్లతో కసిగా తన్ని చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత తల్లీకొడుకులు పరారయ్యారు. ఈ వ్యవహారం అంతా సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. దాని ఆధారంగా సీతంపేట గుడి వద్ద సాయంత్రం తల్లీకొడుకులను పోలీసులు అరెస్టు చేశారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉన్నాం..

ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్



దామోదర్‌రావు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినందుకు సీఎం వైఎస్ జగన్‌కి రుణపడి ఉన్నామంటూ ఏపీ పీటీడీ(పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర జేఏసీ కన్వీనర్ దామోదర్‌రావు అన్నారు. కడపలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు కుమార్ అధ్యక్షతన కడప జోనల్ మహాసభ నిర్వహించారు. ఇందులో దామోదర్‌రావు మాట్లాడుతూ ఉద్యోగులు కోరుకున్న విధంగానే ఏపీఎస్ ఆర్టీసీ కార్మికులను పీటీడీ ఉద్యోగులుగా సీఎం వైఎస్ జగన్ మార్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అన్ని కేటగిరీల ఉద్యోగులకు సంబంధించి 45 డిమాండ్లతో మేనేజింగ్ డైరెక్టర్‌కు జేఏసీ తరుపున లేఖ ఇచ్చామన్నారు.

పాట్‌లో మరిన్ని పరిశ్రమలు



- మరో నాలుగు ప్రధాన సెక్టార్లలో 85 పరిశ్రమలు పథకం పరిధిలోకి
- కేంద్రానికి రాష్ట్రం ప్రతిపాదనలు
- ఇప్పటికే 36 భారీ పరిశ్రమల్లో రూ.5,709 కోట్లు విలువైన ఇంధనం ఆదా
- ప్రగతి నివేదిక విడుదల చేసిన సీఎస్

సాక్షి, అమరావతి: ఇంధన వనరులను మరింత సమర్థంగా వినియోగించుకునేందుకు ఉద్దేశించిన పెర్ఫార్మ్, అచీవ్, ట్రేడ్ (పాట్) పథకం పరిధిలోకి కొత్తగా మరికొన్ని పరిశ్రమలు, సెక్టార్లను తేవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే పథకం పరిధిలో ఉన్న సెక్టార్ల నుంచి కొత్తగా 143 పరిశ్రమలను గుర్తించారు. అదనంగా 4 పారిశ్రామిక సెక్టార్లను పాట్ పథకంలోకి తేవడం ద్వారా మరో 85 పరిశ్రమలకు పథకం వర్తిస్తుంది.

బీఈఈకి ప్రతిపాదనలు

పరిశ్రమల్లో విద్యుత్, ఇతర ఇంధన వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా వృథాను అరికట్టేందుకు ప్రభుత్వం పాట్ పథకాన్ని అమలు చేస్తోంది. దీనివల్ల తక్కువ ఇంధనంతో ఎక్కువ ఉత్పత్తి సాధించేందుకు వీలవుతుంది. తద్వారా పారిశ్రామిక రంగంలో 2031 నాటికి దేశవ్యాప్తంగా 47.5 ఎంటీవోఈ (మిలియన్ టన్ ఆఫ్ ఆయిల్ ఈక్వెలెంట్) ఇంధనం ఆదా చేయాలని కేంద్రం లక్ష్యంగా నిర్దేశించుకుంది. రాష్ట్రంలో 36 భారీ పరిశ్రమల్లో పాట్ పథకం అమలు చేయటం ద్వారా రూ.5709 కోట్ల విలువైన 0. 818 ఎంటీవోఈ ఇంధనాన్ని ఆదా చేయగలిగారు. క్లోర్-ఆల్కలీ, స్టీల్, సిమెంట్, వాణిజ్య భవనాలు (ఎయిర్ పోర్ట్, హోటళ్లు), టెక్స్‌టైల్స్ తదితర సెక్టార్లలో కొత్తగా 143 పరిశ్రమలను పాట్ పథకంలోకి తీసుకొస్తోంది. కొత్తగా ఫార్మా, ఇంజనీరింగ్ , ఆటోమొబైల్, సిరామిక్స్, ఆహారం, మత్స్య పరిశ్రమల సెక్టార్లకు చెందిన 85 పరిశ్రమలను పాట్ పథకంలోకి తెచ్చేందుకు బీఈఈకి ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.



నివేదికను విడుదల చేస్తున్న విజయానంద్, సమీర్ శర్మ

పాట్ ప్రగతి నివేదిక విడుదల

ఆంధ్రప్రదేశ్‌లో పాట్ పథకం ప్రగతి నివేదికను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ ఆదివారం విడుదల చేశారు. అన్ని శాఖల్లో ఇంధన పరిరక్షణ విభాగాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు, శాఖల విభాగాధిపతులకు సూచించారు. ఏపీఎస్ఈసీఎం, ఏపీ స్టేట్ ఎనర్జీ ఎఫిషియెన్సీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సమన్వయంతో ఇంధన పొదుపు, సామర్థ్య కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ తెలిపారు.

కొత్తగా పాట్ పరిధిలోకి వస్తున్న పరిశ్రమలు	
సెక్టార్ పేరు	పరిశ్రమల సంఖ్య
క్లోర్-ఆల్కలీ	3
స్టీల్	47
సిమెంట్	8
వాణిజ్య భవనాలు (ఎయిర్ పోర్ట్స్, హోటళ్లు, హాస్పిటల్స్)	27
స్పిన్నింగ్, టెక్స్ టైల్స్	51
పెట్రో కెమికల్స్	4
అల్యూమినియం	3
ప్రతిపాదిత కొత్త సెక్టార్లు, పరిశ్రమలు	
ఫార్మా	25
ఇంజనీరింగ్, ఆటోమొబైల్స్	18
సెరామిక్స్	6
ఫుడ్, ఫిషరీస్	36

శ్రీవారి సర్వ దర్శనానికి 12 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో అన్ని క్యూ లైన్లు, కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. క్యూలైన్ టీబీసీ వద్దకు చేరింది. సర్వ దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం అర్ధరాత్రి వరకు 80,312 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 29,538 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.5.14 కోట్లు వేశారు.

సెప్టెంబర్‌లో విశేష పర్వదినాలు ఇవే..

తిరుమలలో సెప్టెంబర్‌లో జరిగే విశేష పర్వదినాల తేదీలను టీటీడీ ఆదివారం వెల్లడించింది. 1న రుషి పంచమి, 6, 21 తేదీల్లో సర్వ ఏకాదశి, 7న వామన జయంతి, 9న అనంత పద్మనాభ వ్రతం, 11న మహాలయపక్ష ప్రారంభం, 13న ఉండ్రాళ్ల తద్దె, 20న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 25న మహాలయ అమావాస్య, 26న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, 27న ధ్వజారోహణంతో సాలకట్ల బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొంది.

క్ర.సం.	ప్రదేశం పేరు	జిల్లా (2013 ప్రకటన ప్రకారం)	డ్రా తేదీ	డ్రా సమయం
1	పెనుమాక	గుంటూరు	02/09/2022	గం. 10.00
2	[illegible]	గుంటూరు	02/09/2022	గం. 11.30
3	[illegible]	గుంటూరు	02/09/2022	గం. 12.30
4	ఆముదాలవలస	శ్రీకాకుళం	02/09/2022	గం. 10.00 నుండి 12.15 మధ్య
5	బొబ్బిలి	విజయనగరం	02/09/2022	
6	[illegible]	విజయనగరం	02/09/2022	
7	కొత్తవలస	విజయనగరం	02/09/2022	
8	నెల్లిమర్ల	విజయనగరం	02/09/2022	
9	పాలకొండ	శ్రీకాకుళం	02/09/2022	
10	పలాస-1	శ్రీకాకుళం	02/09/2022	గం. 12.15 నుండి 13.30 మధ్య
11	పలాస-2	శ్రీకాకుళం	02/09/2022	
12	పార్వతీపురం-1	విజయనగరం	02/09/2022	
13	రాజాం-1	శ్రీకాకుళం	02/09/2022	
14	విజయనగరం-3	విజయనగరం	02/09/2022	
15	చోడవరం	విశాఖపట్నం	02/09/2022	గం. 13.45 నుండి 16.15 మధ్య
16	నర్సీపట్నం	విశాఖపట్నం	02/09/2022	
17	అనకాపల్లి	విశాఖపట్నం	02/09/2022	
18	పెందుర్తి	విశాఖపట్నం	02/09/2022	
19	భీమిలి	విశాఖపట్నం	02/09/2022	
20	పెదగంట్యాడ	విశాఖపట్నం	02/09/2022	
21	[illegible]	విశాఖపట్నం	02/09/2022	
22	డాబాగార్డెన్స్	విశాఖపట్నం	02/09/2022	గం. 16.30 నుండి 18.00 మధ్య
23	టౌన్ కొత్తరోడ్డు	విశాఖపట్నం	02/09/2022	
24	మధురవాడ	విశాఖపట్నం	02/09/2022	
25	కూర్మన్నపాలెం	విశాఖపట్నం	02/09/2022	
26	విశాలాక్షి నగర్	విశాఖపట్నం	02/09/2022	
27	సింహాచలం	విశాఖపట్నం	02/09/2022	
28	మాధవధార	విశాఖపట్నం	02/09/2022	
29	అల్లిపురం, విశాఖపట్నం	విశాఖపట్నం	02/09/2022	
30	అమలాపురం	తూర్పు గోదావరి	03/09/2022	గం. 10.00 నుండి 12.50 మధ్య
31	అనపర్తి	తూర్పు గోదావరి	03/09/2022	
32	రాజమండ్రి-3	తూర్పు గోదావరి	03/09/2022	
33	కాకినాడ-2	తూర్పు గోదావరి	03/09/2022	
34	కాకినాడ-3	తూర్పు గోదావరి	03/09/2022	
35	కొత్తపేట	తూర్పు గోదావరి	03/09/2022	
36	మండపేట-2	తూర్పు గోదావరి	03/09/2022	
37	ముమ్మిడివరం	తూర్పు గోదావరి	03/09/2022	
38	పెద్దాపురం-1	తూర్పు గోదావరి	03/09/2022	
39	పిఠాపురం-1	తూర్పు గోదావరి	03/09/2022	
40	పిఠాపురం-2	తూర్పు గోదావరి	03/09/2022	
41	రాజమండ్రి-2	తూర్పు గోదావరి	03/09/2022	
42	రామచంద్రాపురం-1	తూర్పు గోదావరి	03/09/2022	గం. 13.30 నుండి 16.00 మధ్య
43	రామచంద్రాపురం-2	తూర్పు గోదావరి	03/09/2022	
44	రామచంద్రాపురం-3	తూర్పు గోదావరి	03/09/2022	
45	రాయవరం-2	తూర్పు గోదావరి	03/09/2022	
46	రాజోలు-1	తూర్పు గోదావరి	03/09/2022	
47	రాజోలు-2	తూర్పు గోదావరి	03/09/2022	
48	సామర్లకోట-1	తూర్పు గోదావరి	03/09/2022	
49	సామర్లకోట-2	తూర్పు గోదావరి	03/09/2022	
50	తుని - 1	తూర్పు గోదావరి	03/09/2022	
51	తుని - 2	తూర్పు గోదావరి	03/09/2022	
52	రాజమండ్రి-4	తూర్పు గోదావరి	03/09/2022	
53	దేవరపల్లి	పశ్చిమ గోదావరి	03/09/2022	
54	తాడేపల్లిగూడెం-1	పశ్చిమ గోదావరి	03/09/2022	గం. 18.15 నుండి 20.30 మధ్య
55	ఆకివీడు	పశ్చిమ గోదావరి	03/09/2022	
56	కొవ్వూరు	పశ్చిమ గోదావరి	03/09/2022	
57	నిడదవోలు-3	పశ్చిమ గోదావరి	03/09/2022	
58	నిడదవోలు-2	పశ్చిమ గోదావరి	03/09/2022	
59	తాడేపల్లిగూడెం-2	పశ్చిమ గోదావరి	03/09/2022	
60	ఏలూరు-2	పశ్చిమ గోదావరి	03/09/2022	
61	పాలకొల్లు	పశ్చిమ గోదావరి	03/09/2022	
62	ఏలూరు-1	పశ్చిమ గోదావరి	03/09/2022	
63	ఏలూరు-4	పశ్చిమ గోదావరి	03/09/2022	
64	అత్తిలి	పశ్చిమ గోదావరి	03/09/2022	
65	భీమవరం-1	పశ్చిమ గోదావరి	03/09/2022	
66	భీమవరం-2	పశ్చిమ గోదావరి	03/09/2022	



అబ్బుర పరుస్తోంది!

తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటుతూ సైకత శిల్పాన్ని తీర్చిదిద్దాడు తూర్పు గోదావరి జిల్లా రంగంపేటకు చెందిన సైకత శిల్పి దేవిన శ్రీనివాస్. సోమవారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తీర్చిదిద్దిన ఈ సైకత శిల్పం ఆకట్టుకుంటోంది. దీనిపై 'అ' అనే అక్షరాన్ని అరచేతులతో ఒడిసి పట్టుకుని ఉన్నట్టు రూపొందించడం అబ్బురపరుస్తోంది.

\- రంగంపేట

సిక్కోలులో ఎర్ర చందనం కలకలం

- బాతువ గ్రామంలో 91 ఎర్రచందనం దుంగలు లభ్యం



అక్రమంగా నిల్వ చేసిన ఎర్ర దుంగలు

జి.సిగడాం: శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం బాతువ గ్రామంలో ఆదివారం ఎర్రచందనం దుంగలు లభ్యమయ్యాయి. ఓ గుర్తు తెలియని వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అటవీ శాఖ అధికారులు గ్రామంలో తనిఖీలు చేపట్టారు. గ్రామ సరిహద్దులోని తోటపల్లి ప్రధాన కుడి కాలువ పక్కన ఉన్న తోటలో ఎర్ర చందనం దుంగలను గుర్తించారు. కూనిబిల్లి గోవిందరావు, మల్లేశ్వరరావులకు సంబంధించిన సర్వే నంబర్ 387లో2 91 దుంగలు నిల్వ ఉన్నట్లు గుర్తించారు. సర్వే నంబర్ 368లో వరదా సత్యనారాయణ అనే వ్యక్తికి చెందిన తోటలో 40 ఏళ్ల కిందట వేసిన 6 ఎర్ర చందనం చెట్లు ఉండగా వాటిలో 2 చెట్లను ఎవరో నరికి వేసినట్లు సైతం కనుగొన్నారు. ఈ దుంగలు ఎక్కడి నుంచి ఇక్కడకు వచ్చాయనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. స్వాధీనం చేసుకున్న దుంగలను రెవెన్యూ సిబ్బంది కుప్పిలి సీతయ్య, సర్వేయర్ చందక త్రివేణి సమక్షంలో జిల్లా అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. అటవీ శాఖ కార్యాలయంలో తూకం ద్వారా వీటి విలువ లెక్కిస్తామని ఫారెస్ట్ రేంజ్ అధికారి జి.జగదీశ్వరరావు చెప్పారు.

దంపతుల దారుణహత్య

- నెల్లూరులో దొంగల ఘాతుకం
- బీరువా పగలగొట్టి నగదు అపహరణ
- భిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు



కృష్ణారావు,సునీత (ఫైల్)


నెల్లూరు (క్రైమ్)/వత్సవాయి: దోపిడీ దొంగలు శనివారం అర్ధరాత్రి నెల్లూరులో భార్యాభర్తలను దారుణంగా హత్యచేశారు. తొలుత ఇంట్లో నిద్రిస్తున్న భార్య తలపై కర్రతో కొట్టి చంపేశారు. చోరీ చేసి వెళ్లే సమయంలో ఇంటికి చేరుకున్న భర్తను కత్తితో గొంతు కోసి ప్రాణం తీశారు. తమకు దొరికిన మేరకు నగదు దోచుకుని పారిపోయారు. ఈ ఘటన శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం ఇందుగపల్లి గ్రామానికి చెందిన వాసిరెడ్డి కృష్ణారావు (54), సునీత (50) దంపతులు సుమారు 26 ఏళ్ల కిందట నెల్లూరు వచ్చి నగరంలోని పడారుపల్లి అశోక్‌నగర్‌లో స్థిరపడ్డారు. కృష్ణారావు నగరంలోని కరెంట్ ఆఫీసు సెంటర్‌లో 'శ్రీరామ్ హోటల్' నిర్వహిస్తున్నారు. కృష్ణారావు, సునీత దంపతులకు ఇద్దరు కుమారులు సాయి చంద్, గోపీచంద్ ఉన్నారు. వీరికి వివాహాలు కాగా, పెద్ద కుమారుడు విశాఖపట్నంలో పోస్టల్ శాఖలో పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు. చిన్న కుమారుడు గోపీచంద్ నెల్లూరులోనే పొగతోటలో ఓ హోటల్ నిర్వహిస్తూ వేరుగా ఉంటున్నారు. పడారుపల్లి అశోక్‌నగర్‌లో కృష్ణారావు, సునీత మాత్రమే ఉంటున్నారు. కృష్ణారావు హోటల్ నుంచి ప్రతి రోజు రాత్రి 11.30 నుంచి 12 గంటల మధ్యలో ఇంటికి వస్తారు. సునీత శనివారం రాత్రి తన భర్త రాకపోవడంతో ఇంటి ప్రధాన తలుపునకు తాళం వేయకుండానే పడక గదిలో నిద్రించారు. అప్పటికే రెక్కీ నిర్వహించిన దుండగులు సునీత ఒక్కరే ఇంట్లో ఉన్నారని నిర్ధారించుకుని లోపలికి ప్రవేశించారు. పడక గదిలో నిద్రిస్తున్న సునీత తలపై కర్రతో కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందారు. ఆ గదిలో ఉన్న బంగారు ఆభరణాలు భద్రపరిచిన బీరువా ఎంత ప్రయత్నించినా తెరుచుకోకపోవడంతో దొంగలు అక్కడి నుంచి మేడపైన ఉన్న మరో గదికి వెళ్లారు. అక్కడ ఉన్న బీరువాను పగులగొట్టి దానిలోని నగదును దోచుకున్నారు. అనంతరం దొంగలు ఇంట్లో నుంచి బయటకు వస్తున్న తరుణంలో వరండా వద్ద కృష్ణారావు ఎదురై కేకలు వేసేందుకు ప్రయత్నించగా, తమ వెంట తెచ్చుకున్న కత్తితో ఆయన గొంతుకోసి పరారయ్యారు. దీంతో కృష్ణారావు అక్కడికక్కడే మృతిచెందారు. ఆదివారం తెల్లవారుజామున పాలు పోసేందుకు వచ్చిన రమణమ్మ వరండాలో కృష్ణారావు రక్తపుమడుగులో నిర్జీవంగా పడి ఉండటాన్ని చూసి స్థానికులకు తెలియజేసింది. వారు మృతుల బంధువులు, పోలీసులకు సమాచారం అందించారు. నగర ఇన్‌చార్జి డీఎస్పీ అబ్దుల్ సుభాన్, వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ నరసింహారావు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించి, వివరాలు సేకరించారు. ఘటనాస్థలం, పరిసర ప్రాంతాలను డాగ్ స్క్వాడ్ పరిశీలించింది. క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించింది. హత్య దోపిడీ దొంగల పనేనా.. లేక ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా... అని కోణాల్లో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను ఆదివారం కృష్ణారావు స్వగ్రామం ఎన్టీఆర్ జిల్లా ఇందుగపల్లి గ్రామానికి తరలించారు.

అది 'హద్దు'లెరుగని ప్రేమే

సాక్షి, హైదరాబాద్: నేపాల్ మీదుగా ఇటీవల సరిహద్దు దాటి దేశంలోకి ప్రవేశించిన ఓ పాక్ యువతి వ్యవహారంలో ఎటువంటి కుట్ర కోణం లేదని దర్యాప్తు సంస్థలు తేల్చాయి. సౌదీ అరేబియాలో పనిచేస్తున్న హైదరాబాద్ యువకుడు అహ్మద్‌తో సోషల్ మీడియా ద్వారా అయిన పరిచయంతో ప్రేమలో పడిన పాక్ యువతి ఖాదియా నూర్... అతను వేసిన పథకం ప్రకారమే మహ్మద్ (అహ్మద్ సోదరుడు), జీవన్ (నేపాల్ జాతీయుడు)లతో కలసి అక్రమంగా సరిహద్దు దాటి బిహార్‌లో సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) సేనలకు చిక్కిందని నిఘా, పోలీసు విభాగాలు గుర్తించాయి. దీన్ని ప్రేమ వ్యవహారంగానే అభివర్ణించాయి. తొలుత దీని వెనుక భారీ కుట్ర ఉండి ఉండొచ్చని భావించిన ఎస్ఎస్‌బీ... నిందితులను బిహార్‌లోని సీతామర్హి జిల్లా పోలీసులకు అప్పగించింది. నిఘా వర్గాలు వారిని విచారించాయి. హైదరాబాద్‌లోని బహదూర్‌పురతోపాటు ఇతర ప్రాంతాల్లోనూ ఆరా తీశాయి. అలాగే రాష్ట్ర నిఘా వర్గాలతోపాటు ప్రత్యేక పోలీసు బృందం బిహార్ వెళ్లి వారిని విచారించి ఇదే విషయాన్ని తేల్చింది. నూర్ అక్రమంగా సరిహద్దు దాటడానికి ప్రేరేపించి, దానికి ఏర్పాట్లు చేసిన అహ్మద్‌తోపాటు జీవన్‌లను ఈ కేసులో నిందితులుగా చేర్చాలని సీతామర్హి పోలీసులు భావిస్తున్నారు.

నకిలీ ఈడీ అధికారుల అరెస్ట్

- బంగారం షాపులో దోపిడీకి ప్రణాళిక
- గ్యాంగ్‌లీడర్ పాత నేరస్తుడే
- ఎయిర్ పిస్టల్, పెల్లెట్స్, రెండు ఇన్నోవా కార్లు స్వాధీనం
- నెల్లూరు జిల్లాలో ఘటన



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ

నెల్లూరు (క్రైమ్) (శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా): ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారుల వేషంలో బంగారు దుకాణంలో దోపిడీకి యత్నించిన ఏడుగురు నిందితులను నెల్లూరు సంతపేట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఎయిర్ పిస్టల్, పెల్లెట్స్, రెండు ఇన్నోవా కార్లు, తొమ్మిది సెల్‌ఫోన్లు, నకిలీ ఐడీ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం నెల్లూరు డీఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ (క్రైమ్స్) కె.చౌడేశ్వరి ఈ వివరాలను వెల్లడించారు. ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం కృష్ణాపురానికి చెందిన ఆరవీటి రమేష్ వ్యాపార రీత్యా హైదరాబాద్‌లోని మియాపూర్‌లో స్థిరపడ్డాడు. వివిధ వ్యాపారాలు చేసి అప్పులపాలయ్యాడు. హైదరాబాద్‌లోని ఓ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తూ యజమానిని రూ. కోటి వరకు మోసగించాడు. అదే కంపెనీలో పనిచేస్తున్న ముషీరాబాద్‌కు చెందిన కౌశల్ రావును తన పీఏగా పెట్టుకున్నాడు. కంపెనీ ప్రతినిధుల ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు రమేష్‌పై చీటింగ్ కేసు నమోదు చేశారు. తన బావ హత్య కేసులో రమేష్‌ను 2018లో కర్నూలు జిల్లా పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. రమేష్‌కు దొంగనోట్ల కేసులో అదే జైలులో ఉన్న శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం మామిళ్లపల్లికి చెందిన యోగానంద్‌గౌడ్ అలియాస్ యోగితో పరిచయం ఏర్పడింది. జైలు నుంచి విడుదలయ్యాక రమేష్ తిరిగి హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ హోల్‌సేల్ వ్యాపారుల వద్ద బంగారు ఆభరణాలు కొని కందుకూరు, పొదిలి తదితర ప్రాంతాల్లోని వ్యాపారులకు కమీషన్ పద్ధతిపై సరఫరా చేసేవాడు.

పెద్ద ఎత్తున డబ్బులు సంపాదించాలని..

వ్యాపారం చేస్తున్నా ఆశించిన స్థాయిలో డబ్బులు రాకపోవడంతో ఎలాగైనా పెద్ద ఎత్తున డబ్బులు సంపాదించాలని రమేష్ నిర్ణయించుకున్నాడు. ఈడీ అధికారులు ఎక్కడైనా దాడులు చేయొచ్చు.. ఏదైనా సీజ్ చేయొచ్చని పత్రికల్లో వచ్చిన కథనాలను చదివాడు. నకిలీ ఈడీ అధికారి అవతారమెత్తి బంగారు ఆభరణాలు కాజేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ విషయాన్ని యోగానంద్‌గౌడ్‌కు, పీఏ కౌశల్‌రావుకు తెలియజేశాడు. యోగానంద్‌గౌడ్ ద్వారా కర్నూలు జిల్లాకు చెందిన మద్దిలేటి గౌడ్, నంద్యాల జిల్లాకు చెందిన జి.బాలకృష్ణ, మామిళ్లపల్లికి చెందిన జి.బాబును కలిశాడు. ఈ ఆరుగురు గ్యాంగ్‌గా ఏర్పడ్డారు.

పక్కాగా రెక్కీ నిర్వహించి..

ఈ క్రమంలో ఎక్కువ బంగారం ఏ దుకాణంలో ఉంటుందో గ్యాంగ్ రెక్కీ నిర్వహించింది. నెల్లూరులోని లావణ్య జ్యుయెలరీ షాప్‌ను తమ దోపిడీకి ఎంచుకుంది. చెన్నైలో నకిలీ ఐడీ కార్డులు, పోలీస్ యూనిఫామ్ తయారు చేయించారు. అక్కడే ఎయిర్ పిస్టల్, పిల్లెట్స్ కొనుగోలు చేసి నెల్లూరు వచ్చారు. ఈ నెల 26న లావణ్య జ్యుయెలరీలో ఈడీ అధికారుల మాదిరిగా తనిఖీలకు వెళ్లినట్టు గ్యాంగ్ వెళ్లింది. సహజంగా తనిఖీకు వెళ్లిన ఏ అధికారులైన బంగారాన్ని సీజ్ చేసిన వెంటనే ఫొటోలు తీసి కేసు నమోదు చేస్తారు. అనంతరం బంగారాన్ని అక్కడే వదిలివెళ్తారు. అయితే నిందితులు కిలో బంగారాన్ని బ్యాగ్‌లో సర్దుకుని వెళ్లిపోతుండటంతో అనుమానమొచ్చిన షాప్ యజమాని పోలీసులకు సమాచారం అందించారు. సంతపేట ఇన్‌స్పెక్టర్ షేక్ అన్వర్‌బాషా నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించి విచారించారు. అనంతరం ఆరుగురు నిందితులను, కారు డ్రైవర్ నెల్లూరుకి చెందిన వెంకటకృష్ణను ఆదివారం అరెస్ట్ చేశారు. నిందితులను అరెస్ట్ చేసిన సిబ్బందిని ఎస్పీ విజయారావు అభినందించారు.

మా ఉద్యమాన్ని అడ్డుకోవడం ఎవరితరం కాదు..

- 700వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి



దీక్షలో సమితి నాయకులు

తాడికొండ: చరిత్రలో నిలిచిపోయేలా కొనసాగుతున్న బహుజన పరిరక్షణ ఉద్యమాన్ని అడ్డుకోవడం కులవాదుల తరం కాదని బహుజన పరిరక్షణ సమితి నేతలు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 700వ రోజు కొనసాగుతున్న రిలే దీక్షల్లో పలువురు ప్రసంగించారు. అవాంతరాలను దాటి 700 రోజులు కొనసాగిన తమ ఉద్యమానికి కులవాదులు ఎన్నో ఆటంకాలు కల్పించారని గుర్తుచేసుకున్నారు. వేలాది కోట్ల రూపాయలు కుమ్మరించి చంద్రబాబు, ఆయన బినామీలు చేయిస్తున్న అమరావతి ఉద్యమం ఎప్పుడో పతనమైందని అన్నారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పల్లె బాబు పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

తైవాన్ జలసంధి గుండా అమెరికా యుద్ధ నౌకలు

తైపీ: అమెరికా నావికా దళానికి చెందిన రెండు యుద్ధనౌకలు ఆదివారం తైవాన్ జలసంధి గుండా ప్రయాణించాయి. అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ వివాదాస్పద తైవాన్ పర్యటనతో అమెరికా, చైనా మధ్య విభేదాలు తారస్థాయికి చేరడం తెలిసిందే. ఇందుకు ప్రతిగా తైవాన్ చుట్టూ చాలా రోజుల పాటు చైనా యుద్ధ నౌకలను, యుద్ధ విమానాలను మోహరించి, భారీ సైనిక విన్యాసాలకు తెర తీసింది. ఆ తర్వాత తైవాన్ జలసంధిలో యూఎస్ యుద్ధనౌకల సంచారం ఇదే తొలిసారి. తైవాన్, ఇతర ప్రాంతీయ భాగస్వాములను తృప్తి పరిచేందుకే అమెరికా ఈ దుందుడుకు చర్యకు దిగిందంటూ చైనా విమర్శలు చేసింది.

రామాలయం 40 శాతం పూర్తి

అయోధ్య: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో రామ మందిర నిర్మాణ పనులు 40 శాతం దాకా పూర్తయ్యాయి. వాటికి రెండేళ్ల క్రితం ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయడం తెలిసిందే. 2023 డిసెంబర్‌కల్లా పనులన్నీ పూర్తయి భక్తుల దర్శనానికి మందిరం సిద్ధమవుతుందని రామజన్మభూమి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్ ఆదివారం తెలిపారు. మందిరం కనీసం వెయ్యేళ్లదాకా చెక్కుచెదరకుండా ఉండేలా పునాదులను సువిశాలంగా, భారీగా నిర్మిస్తున్నారు. మందిర నిర్మాణానికి దాదాపు 9 లక్షల క్యూబిక్ అడుగుల మక్రానా మార్బుల్ రాళ్లు వాడుతున్నారు. ప్రధానాలయ నిర్మాణంలో గులాబీ, గర్భాలయానికి, ఫ్లోరింగ్‌కు తెల్ల రాయి వాడుతున్నారు. మందిరానికి దారితీసే మార్గాల్లో రోడ్డు విస్తరణ పనులు కూడా ముమ్మరంగా జరుగుతున్నాయి.

'నాసా మూన్' ప్రయోగం నేడే

కేప్ కెనావెరల్: చంద్రుడిపై ప్రయోగాలకు అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' మళ్లీ శ్రీకారం చుడుతోంది. చంద్రుడి కక్ష్య చుట్టూ పరిభ్రమించి, అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసి, భూమిపైకి తిరిగివచ్చే మూన్ రాకెట్‌ను ప్రయోగించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ రాకెట్ సోమవారమే నింగిలోకి దూసుకెళ్లనుంది. మూన్ రాకెట్ పొడవు 322 అడుగులు. నాసా నిర్మించిన రాకెట్లలో ఇదే అత్యంత శక్తివంతమైంది. వ్యోమగాములు ఎవరూ లేకుండానే చంద్రుడిని చుట్టేసి, భూమిపైకి తిరిగి రానుంది. మొత్తం 6 వారాల్లో ఈ ప్రయోగం పూర్తవుతుంది. నాసా 50 ఏళ్ల క్రితం అపోలో కార్యక్రమం కింద వ్యోమగాములను చంద్రుడిపైకి పంపించిన సంగతి తెలిసిందే.

ఫోగాట్ హత్య కేసు సీబీఐకి

పణజి: బీజేపీ నేత, మాజీ టిక్‌టాక్ స్టార్ సోనాలీ ఫోగాట్ హత్య కేసును అవసరమైతే సీబీఐకి అప్పగిస్తామని గోవా సీఎం ప్రమోద్ సావంత్ వెల్లడించారు. దర్యాప్తు పురోగతిపై హరియాణా సీఎం ఖట్టర్‌తో ఫోన్‌లో చర్చించానన్నారు. కేసును సీబీఐకి అప్పగించాలంటూ ఫోగాట్ కుటుంబసభ్యులు తనను కోరారని సీఎం ఖట్టర్ ఈ సందర్భంగా తెలిపినట్లు సావంత్ పేర్కొన్నారు. కాగా, ఈ కేసులో రాందాస్ మండ్రేకర్ అనే డ్రగ్ విక్రేతను అరెస్ట్ చేసినట్లు పోలీసులు చెప్పారు. దీంతో, ఈ కేసులో అరెస్టైన వారి సంఖ్య ఐదుకు చేరుకుంది. ఫోగాట్ సహచరులు సుధీర్ సాగవాన్, సుఖ్వీందర్ సింగ్‌పై పోలీసులు హత్య కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

ఇల్లు లేక గ్యారేజీలో నిద్రించా..

ఎలాన్ మస్క్ తల్లి మే మస్క్ వెల్లడి

లండన్: టెస్లా, స్పేస్ ఎక్స్ సంస్థల సీఈఓ, ప్రపంచ కుబేరుడు అయిన ఎలాన్ మస్క్ తల్లి మే మస్క్(74) ఇటీవల ఒక గ్యారేజీలో నిద్రించాల్సి వచ్చింది. ఈ విషయాన్ని ఆమె 'ద సండే టైమ్స్' పత్రికతో పంచుకున్నారు. కుమారుడు ఎలాన్ మస్క్‌ను కలిసేందుకు స్పేస్ ఎక్స్ ప్రధాన కార్యాలయం ఉన్న అమెరికాలోని టెక్సాస్‌కు వెళ్లాలని, అక్కడికి సమీపంలోని ఇల్లేమీ లేదని, అందుకే ఒక గ్యారేజీలో నిద్రించానని తెలిపారు. అంగారక గ్రహంపైకి వెళ్లాలన్న కోరిక తనకు లేదని పేర్కొన్నారు. తనకు సొంత ఇల్లు లేదని ఎలాన్ మస్క్ ఇటీవల చెప్పిన విషయం తెలిసిందే.

దేశీయంగానే మరో 780 పరికరాల కొనుగోలు

న్యూఢిల్లీ: రక్షణ రంగంలో ఆయుధాలు, పరికరాల కొనుగోలు విషయంలో విదేశాలపై ఆధారపడడాన్ని తగ్గించుకొనేందుకు రక్షణ శాఖ వేగంగా అడుగులు వేస్తోంది. 780 కాంపోనెంట్స్, సబ్‌సిస్టమ్స్‌ను ఇకపై దేశీయ కంపెనీల నుంచే కొనుగోలు చేయాలని నిర్దేశించింది. ఈ మేరకు ఆయా పరికరాలు, వ్యవస్థల జాబితాకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ఆమోదం తెలిపారు. వీటిలో కీలకమైన లైన్ రిప్లేస్‌మెంట్ యూనిట్లు, సబ్ సిస్టమ్స్, వివిధ కాంపోనెట్లు ఉన్నాయి. దేశీయంగా కొనాల్సిన పరికరాల జాబితాను విడుదల చేయడం ఇది మూడోసారి.

'ఆకాశ' ఎయిర్ లైన్స్ సమాచారం లీక్

న్యూఢిల్లీ: ఇటీవలే కార్యకలాపాలను ప్రారంభించిన విమానయాన సంస్థ ఆకాశ ఎయిర్ వినియోగదారులకు సంబంధించిన డేటా లీకైంది. అయితే, ఇది ఉద్దేశపూర్వకంగా జరిగిన ఘటన కాదని వివరించింది. దీనిపై ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం(సీఈఆర్‌టీ)కి వెంటనే ఫిర్యాదు చేసినట్లు ఆదివారం తెలిపింది. 'ఈ నెల 25న ఆకాశ రిజిస్టర్డ్ యూజర్ లాగిన్, సైన్-అప్ సేవల కాన్ఫిగరేషన్‌లో లోపం కారణంగా కొందరు వినియోగదారుల పేర్లు, ఈమెయిల్ చిరునామా, ఫోన్ నంబర్లు అనధికారిక వ్యక్తులకు అంది ఉండవచ్చు. ప్రయాణ సంబంధ సమాచారం, ప్రయాణ రికార్డులు మాత్రం లీక్ కాలేదు' అని పేర్కొంది. వెంటనే ఈ పొరపాటును సరిదిద్దినట్లు స్పష్టం చేసింది.

9 ఏళ్ల నిరీక్షణకు 12 సెకన్లలో తెర

నోయిడా టవర్లు నేలమట్టం
- నియంత్రిత పేలుళ్లతో కూల్చివేత
- పరిసరాలను దట్టంగా కమ్మేసిన దుమ్ము, ధూళి మేఘాలు
- సమీప భవనాలు వేటికీ నష్టం వాటిల్లలేదు: అధికారులు

కూల్చివేత తర్వాత కాంక్రీట్ దిబ్బగా మారిన టవర్స్ ప్రాంగణం. (ఇన్‌సెట్లో) చూసేందుకు వచ్చిన జనం



నోయిడా: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం నోయిడాలోని జంట టవర్ల కూల్చివేత ప్రక్రియను దాదాపు విజయవంతంగా పూర్తి చేసింది. పరిసర ప్రాంతాల ప్రజలు ఉత్కంఠతో చూస్తుండగా నియంత్రిత పేలుడు పదార్థాలతో కొన్ని సెకన్లలోనే నేలమట్టమైంది. సూపర్‌టెక్ జంట టవర్లు అక్రమ నిర్మాణాలంటూ నివాసితుల సంఘం కోర్టును ఆశ్రయించిన 9 ఏళ్ల తర్వాత.. ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో చేపట్టిన పేలుడు ప్రక్రియతో కేవలం 12 సెకన్లలోనే టవర్లు భారీ రాళ్ల దిబ్బలుగా మారాయి. జంట టవర్లలోని అపెక్స్ 32 అంతస్తులు కాగా, సియాన్(29 అంతస్తులు). ఈ టవర్ల గోడలు, పిల్లర్లలో సుమారు 3,700 కిలోల పేలుడు పదార్థాలను అమర్చారు. దేశంలో ఇంతటి భారీ నిర్మాణాన్ని నియంత్రిత పేలుడు పదార్థాలతో నేలమట్టం చేయడం ఇదే మొదటిసారి. దీంతో ఆ ప్రాంతమంతటా ఒక్కసారిగా దుమ్ము, ధూళి మేఘాలు కమ్ముకున్నాయి. ముందు జాగ్రత్తగా సూపర్‌టెక్ టవర్లకు సమీపంలోనే ఉన్న ఎమరాల్డ్, ఏటీఎస్ విలేజ్ సొసైటీలకు చెందిన సుమారు 5 వేల మందిని ఖాళీ చేయించారు. మరో 3 వేల వాహనాలను, 150 పెంపుడు జంతువులను కూడా దూరంగా తీసుకెళ్లారు. అత్యంత క్లిష్టమైన ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత దుమ్ముధూళి తీవ్రతను తగ్గించేందుకు స్ప్రింక్లర్లతో నీటిని చల్లడంతోపాటు యాంటీ స్మోగ్ గన్‌లను వాడారు. ఎడిఫైస్, జెట్ డిమాలిషన్ సంస్థల ప్రతినిధులతోపాటు సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, నోయిడా అథారిటీ అధికారులు చుట్టుపక్కల ప్రాంతాల్లోని భవన నిర్మాణాలపై ఆడిట్ చేపట్టారు. 'జంట టవర్లకు 10 మీటర్ల దూరంలో ఉన్న ఏటీఎస్ విలేజ్ ప్రహరీ గోడ దెబ్బతింది. ఎమరాల్డ్, ఏటీఎస్ విలేజ్‌లోని అపార్టుమెంట్ల కిటికీ తలుపులకు పగుళ్లు వచ్చాయి. గెయిల్ పైప్‌లైన్ సురక్షితంగా ఉంది. ఈ పైప్‌లైన్‌పై ముందుజాగ్రత్తగా ఐరన్ షీట్లు, టైర్లను ఉంచాం. టవర్ల స్థానంలో ఏర్పడిన 55 వేల నుంచి 80 వేల టన్నుల కాంక్రీట్ శిథిలాలు, స్టీల్, ఐరన్ కడ్డీలను తొలగించేందుకు 3 నెలలు పడుతుంది. సమీపంలోని భవనాల దెబ్బతిన్న కిటికీలను మార్చే ప్రక్రియ వెంటనే చేపడతాం' అని అనంతరం వారు మీడియాకు తెలిపారు.

ప్రత్యక్షంగా తిలకించేందుకు...

టవర్ల కూల్చివేత ఘటన టీవీల్లో లైవ్‌లో ప్రసారమయింది. దీంతోపాటు, ఈ అరుదైన దృశ్యాన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు వందలాదిగా జనం నోయిడాకు తరలివచ్చారు. అక్కడికి దగ్గర్లోని భవనాలపైకి ఎక్కి ఆసక్తిగా తిలకించారు. 'కొన్ని రోజులుగా ఎక్కడ విన్నా ఇదే వార్త. చివరికి ఈ రోజు టవర్లు కూలాయి. దేశంలోని అవినీతి పరులకు ఇది హెచ్చరిక వంటిది' అని ఢిల్లీలోని ఉత్తమ్ నగర్ నుంచి నోయిడాకు వచ్చిన ఆశిష్ సుమన్ అన్నారు.

రూ.500 కోట్ల నష్టం: సూపర్‌టెక్

జంట టవర్ల కూల్చివేతతో నిర్మాణ వ్యయం, వడ్డీలు తదితరాల రూపంలో తమకు రూ.500 కోట్ల మేర నష్టం వాటిల్లిందని రియల్ ఎస్టేట్ సంస్థ సూపర్‌టెక్ చైర్మన్ ఆర్‌కే అరోరా పేర్కొన్నారు. 8 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న 2 టవర్లలోని 900 ఫ్లాట్ల విలువ రూ.700 కోట్లుంటుందన్నారు. టవర్లను కూల్చినందుకు ఎడిఫైస్ సంస్థకు రూ.17.5 కోట్లు ఇచ్చామన్నారు. టవర్ల కూల్చివేత ప్రభావం తమ ఇతర ప్రాజెక్టులపై ఉండదన్నారు.

నిశ్చింతగా నిద్రించాడు..

జంట టవర్ల పేల్చివేతకు ఒక వైపు ఏర్పాట్లు సాగుతుండగా అక్కడికి అత్యంత సమీపంలో ఉన్న 'ఎమరాల్డ్ కోర్ట్'లోని ఓ వ్యక్తి గాఢ నిద్రలో మునిగిపోయాడు. ఎమరాల్డ్ కోర్టులోని 44 అపార్ట్‌మెంట్లలో 2,500 మంది నివాసం ఉంటున్నారు. వీరి తరలింపు ప్రక్రియ శుక్రవారమే మొదలైంది. కొందరు మాత్రం ఆదివారం వరకు తమ అపార్టుమెంట్లలోనే ఉన్నారు. ఉదయం 7 గంటలను డెడ్‌లైన్‌గా పెట్టుకున్నారు. ఖాళీ చేయించే ప్రక్రియను రెసిడెంట్స్ కమిటీ అప్పటికే రెండు విడతలుగా క్షుణ్నంగా పరిశీలించింది. ఒక్కరు మాత్రం మిస్సైనట్లు గుర్తించి, అలెర్టయింది. ఆఖరుగా మరోసారి సోదాలు జరుపుతుండగా సరిగ్గా ఉదయం 7 గంటలప్పుడు ఓ వ్యక్తి తన అపార్ట్‌మెంట్‌లోనే నిద్రిస్తూ కనిపించాడు. అప్రమత్తమై వెంటనే అతడిని బయటకు తీసుకువచ్చారు.

3 నెలల పాటు వండారు.. 8 నెలలు తిన్నారు



వాషింగ్టన్: ఉద్యోగాలు చేసే మహిళలకు ఇంటి పనులతోపాటు వంట చేయడం పెద్ద ప్రయాసే. దానికోసం చాలా సమయం కేటాయించాల్సి ఉంటుంది. కొన్ని నెలలకు సరిపడా ఆహారాన్ని ముందుగానే వండేసి, నిల్వ చేసి పెట్టుకుంటే. మంచి ఆలోచన కదా! ఆస్ట్రేలియాకు చెందిన కెల్సీ షా (30) అనే గృహిణికి ఇలాంటి ఆలోచనే వచ్చింది. ఆమె తన కుటుంబంతో కలిసి అమెరికాలోని ఇండియానాలో స్థిరపడింది. కుటుంబ సభ్యులకు వండి పెట్టడానికి ఆమెకు చాలా సమయం పట్టేది. దీంతో ఆహారాన్ని నిల్వ చేసే పద్ధతులపై దృష్టి పెట్టారు. ఇంటర్నెట్‌తోపాటు పుస్తకాల ద్వారా సమాచారం సేకరించారు. ఇందుకోసం రోజుకు 2 గంటలు కేటాయించారు. 3 నెలల పాటు 426 మీల్స్ సిద్ధం చేసి, నిల్వచేశారు. కరోనా ఉధృతంగా ఉన్న సమయంలో ఈ నిల్వ ఆహారమే వారికి దాదాపు 8 నెలలపాటు ఎలాంటి ఇబ్బంది లేకుండా బ్రహ్మాండంగా ఉపయోగపడింది. డీహైడ్రేషన్, వాటర్ క్యానింగ్ పద్ధతుల్లో ఆహారాన్ని చాలారోజులు నిల్వ చేయొచ్చని, తాజాగా ఉంటుందని కెల్సీ షా చెప్పారు.

అక్టోబర్ 17న కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నిక

సెప్టెంబర్ 24 నుంచి నామినేషన్ల ప్రక్రియ

న్యూఢిల్లీ: ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడి ఎన్నిక తేదీపై ఊహాగానాలకు తెరపడింది. అక్టోబర్ 17న ఎన్నిక నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు ఆదివారం వెల్లడించాయి. ఈ తర్వాత రెండు రోజుల్లో విజేత పేరును ప్రకటించనున్నట్లు తెలిపాయి. దేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా అధ్యక్షుడిని ఎన్నుకుంటున్న ఏకైక పార్టీ కాంగ్రెస్సేనని పేర్కొన్నాయి. పార్టీ నూతన సారథి ఎన్నిక కోసం సెప్టెంబర్ 22న నోటిఫికేషన్ జారీ చేస్తారు. సెప్టెంబర్ 24 నుంచి 30 దాకా నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ అథారిటీ చైర్మన్ మధుసూదన్ మిస్త్రీ చెప్పారు. అక్టోబర్ 1న నామినేషన్లను పరిశీలిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ అక్టోబర్ 8. ఒకరి కంటే ఎక్కువ మంది బరిలో నిలిస్తే అక్టోబర్ 17న ఎన్నిక నిర్వహిస్తారు. అక్టోబర్ 19న ఓట్ల లెక్కింపు ఉంటుంది. అదే రోజు విజేత పేరును ప్రకటిస్తారు. ఎన్నిక షెడ్యూల్‌కు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) ఏకగ్రీవంగా ఆమోదం తెలియజేసింది. సోనియా గాంధీ నేతృత్వంలో ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించారు. వైద్య పరీక్షల కోసం ప్రస్తుతం విదేశాల్లో ఉన్న సోనియా వెంట కుమారుడు రాహుల్ గాంధీ, కుమార్తె ప్రియాంకా గాంధీ వాద్రా ఉన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నిక కోసం చివరిసారిగా 2000 నవంబర్‌లో ఎన్నిక నిర్వహించారు. సోనియా గాంధీ మధ్యలో రెండేళ్లు(2017-2019) మినహా 1998 నుంచి కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. ఈసారి పార్టీ అధ్యక్షుడిగా రాహుల్ గాంధీని ఎన్నుకోవడంపై సీడబ్ల్యూసీ సమావేశంలో ఎలాంటి చర్చ జరగలేదని తెలిసింది.



ఇల్లు కోల్పోయాక పెషావర్ శివారులో తరలిపోతున్న ఓ కుటుంబం

పాక్ వరదలకు మరో 119 మంది బలి

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో వర్షాలు, వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వరదల వల్ల గత 24 గంటల్లో 119 మంది మరణించారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య 1,000 మార్కును దాటేసింది. దేశంలో జూన్ 14 నుంచి భీకర వర్షాలు కురుస్తున్నాయి. ప్రధానంగా దక్షిణ, నైరుతి పాకిస్తాన్‌లో తీవ్రత అత్యధికంగా ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఇప్పటిదాకా 1,033 మంది ప్రాణాలు కోల్పోయారని, మరో 1,527 మంది క్షతగాత్రులయ్యారని పాకిస్తాన్ నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ(ఎన్‌డీఎంఏ) ఆదివారం ప్రకటించింది. వరదల కారణంగా 3,451.5 కిలోమీటర్ల మేర రహదారులు ధ్వంసమయ్యాయి. 147 వంతెనలు దెబ్బతిన్నాయి. 170 దుకాణాలు నేలమట్టమయ్యాయి. 9.49 లక్షల ఇళ్లు పాక్షికంగా లేదా పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఎంతమేరకు ఆర్థిక నష్టం వాటిల్లిందనే దానిపై అధికారులు అధ్యయనం చేస్తున్నారని పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ చెప్పారు. రూ.వందల కోట్ల నష్టం వాటినట్లు ప్రాథమికంగా తెలుస్తోందన్నారు. అంతర్జాతీయ సమాజం ఆదుకోవాలని పాక్ ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది.

గుజరాత్‌పై కుట్రలు

- అప్రతిష్టపాలు చేసే యత్నాలు
- పెట్టుబడుల్ని ఆపజూశారు: మోదీ
- పౌష్టికాహార లోపంపై ఉమ్మడి పోరు
- మన్ కీ బాత్‌లో ప్రజలకు పిలుపు



స్మృతివనాన్ని పరిశీలిస్తున్న ప్రధాని మోదీ

భుజ్: గుజరాత్ వరుస ప్రాకృతిక విపత్తులతో అల్లాడుతున్న సమయంలో రాష్ట్రాన్ని దేశంలోనే గాక అంతర్జాతీయంగా కూడా అప్రతిష్టపాలు చేసి పెట్టుబడులు రాకుండా చేసేందుకు చాలా కుట్రలు జరిగాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. కానీ వాటన్నింటినీ అధిగమించి పారిశ్రామికంగా, ఇతరత్రా కూడా రాష్ట్రం అద్భుతంగా పురోగమించిందని కొనియాడారు. రెండు రోజుల గుజరాత్ పర్యటనలో భాగంగా ఆదివారం కచ్ జిల్లాలో రూ.4,400 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మోదీ శంకుస్థాపన చేశారు. అనంతరం ర్యాలీని ఉద్దేశించి మాట్లాడారు. ''2001 కచ్ భూకంపం మాటకందని విషాదం. ఆ విలయాన్ని అవకాశంగా మార్చుకుని కచ్‌ను పునర్నిర్మించుకుంటామని అప్పుడే చెప్పాను. దాన్నిప్పుడు సాధించి చూపించాం. ప్రపంచంలోనే రెండో అతి పెద్ద టెక్స్‌టైల్ ప్లాంట్, ఆసియాలో తొలి సెజ్ తదితరాలకు కచ్ వేదికైంది. దేశ రవాణాలో 30 శాతం ఇక్కడి కాండ్లాం, ముంద్రా పోర్టుల గుండానే జరుగుతోంది. దేశానికి కావాల్సిన ఉప్పు 30 శాతం కచ్‌లోనే తయారవుతోంది'' అని మోదీ చెప్పారు. ''భూకంపం వచ్చినప్పుడు నేను గుజరాత్ సీఎంను కాను. సాధారణ బీజేపీ కార్యకర్తను. రెండో రోజే కచ్ చేరుకుని సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకున్నా'' అని గుర్తు చేసుకున్నారు. భూకంపానికి బలైన 13 వేల మందికి స్మృత్యర్థం నిర్మించిన రెండు స్మారకాలను ప్రారంభించారు. ఆ సమయంలో అనేక భావాలు తనను ముప్పిరిగొన్నాయని చెప్పారు. స్మృతి వన్ స్మారకాన్ని అమెరికా ట్విన్ టవర్స్ స్మారకం, జపాన్‌లోని హిరోషిమా స్మారకంతో పోల్చారు. ఇలాంటి అనుభవాల నేపథ్యంలో విపత్తు నిర్వహణ చట్టం తెచ్చిన తొలి రాష్ట్రంగా గుజరాత్ నిలిచిందని చెప్పారు. దాని స్ఫూర్తితోనే కేంద్ర స్థాయిలో అలాంటి చట్టం వచ్చిందన్నారు.

అవగాహన పెరగాలి

పౌష్టికాహార లోపాన్ని రూపుమాపాలని, నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన మరింత పెరగాలని మోదీ అన్నారు. ఈ దిశగా పోషన్ అభియాన్, జల్ జీవన్ మిషన్ బాగా పని చేస్తున్నాయని చెప్పారు. సెప్టెంబర్‌ను పౌష్టికాహార నెలగా జరుపుకుంటున్నట్టు గుర్తు చేశారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. 2023ను అంతర్జాతీయ తృణధాన్యాల సంవత్సరంగా జరుపుకోవాలన్న భారత ప్రతిపాదనకు ఐరాస అంగీకరించడాన్ని గుర్తు చేశారు. ''ఏళ్లుగా విదేశీ అతిథులకు మన తృణధాన్యపు వంటకాలను రుచి చూపిస్తూ వస్తున్నా. వారంతా వాటి రుచిని ఎంతో ఆస్వాదించారు. ముడి ధాన్యం అనాది కాలం నుంచి మన సాగులో, సంస్కృతితో, నాగరికతలో భాగం'' అన్నారు. ఈసారి పంద్రాగస్టు ఉత్సవాలను దేశ ప్రజలంతా గొప్ప జోష్‌తో జరుపుకున్నారంటూ హర్షం వెలిబుచ్చారు. లెక్కలేనన్ని వైరుధ్యాలు, వైవిధ్యాలున్న ఇంత పెద్ద దేశం తాలూకు సమష్టి శక్తి ఎంత బలవత్తరమైనదో ప్రపంచానికి చూపారన్నారు. స్వాతంత్ర్య అమృతోత్సవాల వేళ దేశంలో మూలమూలలా అమృత ధార పారుతోందన్నారు. ఈశాన్య భారతం వంటి మారుమూల ప్రాంతాల్లో ఇంటర్నెట్ వ్యాప్తి కొత్త వెలుగులు తెచ్చిందని చెప్పారు. ''డిజిటల్ ఇండియా ద్వారా వాటికి అభివృద్ధి ద్వారాలు తెరుచుకున్నాయి. ఒకప్పుడు పెద్ద నగరాలకే పరిమితమైన సదుపాయాలు ప్రతి గ్రామానికీ చేరాయి. ఫలితంగా డిజిటల్ పారిశ్రామికవేత్తలు పుట్టుకొస్తున్నారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని అత్యంత మారుమూల జోర్సింగ్ గ్రామానికి పంద్రాగస్టు నుంచే 4జీ సేవలందుతున్నాయి'' అంటూ పలు ఉదాహరణలను ప్రస్తావించారు. సమర యోధుల త్యాగాలను కళ్లముందుంచే స్వరాజ్ సీరియల్‌ను దూరదర్శన్‌లో ప్రజలంతా చూడాలన్నారు. 2047కల్లా భారత్ అభివృద్ధి చెందిన దేశంగా రూపొందుతుందని తనకు పూర్తి నమ్మకముందని పునరుద్ఘాటించారు.

అమెరికాలో కాల్పులు.. నలుగురు మృతి


హ్యూస్టన్: హ్యూస్టన్‌లో శనివారం అర్ధరాత్రి దాటాక చోటుచేసుకున్న కాల్పుల్లో నలుగురు మృతి చెందారు. ఓ అపార్ట్‌మెంట్ భవనానికి నిప్పుపెట్టిన ఓ వ్యక్తి అందులోని వారు బయటకు రాగానే షాట్‌గన్‌తో కాల్పులకు తెగబడ్డాడు. కాల్పుల్లో గాయపడిన ఐదుగురిలో ముగ్గురు చనిపోయారు. అగ్ని ప్రమాదం సంభవించిందనే సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బందిపైనా కాల్పులకు దిగాడు. పోలీసుల కాల్పుల్లో చివరికి అతడు హతమయ్యాడు.

ఆ కేసుల్లో ఫోరెన్సిక్ దర్యాప్తు తప్పనిసరి

గాంధీనగర్: దేశంలో నేర న్యాయ వ్యవస్థను, ఫోరెన్సిక్ సైన్స్ దర్యాప్తును మిళితం చేయాలని భావిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాల కంటే అధికంగా మన దేశంలో నేర నిరూపణల శాతాన్ని పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఆరేళ్లకుపైగా జైలుశిక్ష పడేందుకు అవకాశం ఉన్న కేసుల్లో ఫోరెన్సిక్ దర్యాప్తును తప్పనిసరి, చట్టబద్ధం చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు. అమిత్ షా ఆదివారం గుజరాత్‌లోని గాంధీనగర్‌లో నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ(ఎన్‌ఎఫ్‌ఎస్‌యూ) మొదటి స్నాతకోత్సవంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. దేశవ్యాప్తంగా ప్రతిజిల్లాలో ఫోరెన్సిక్ మొబైల్ దర్యాప్తు సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. ఫోరెన్సిక్ దర్యాప్తు స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా జరిగేలా చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్(సీఆర్‌పీసీ), ఎవిడెన్స్ యాక్ట్‌లో మార్పులు తీసుకురానున్నట్లు వెల్లడించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ చట్టాలను ఎవరూ భారతీయ దృష్టికోణంలో చూడడం లేదన్నారు.

గుజరాత్‌లో మూడుముక్కలాట

బీజేపీ, కాంగ్రెస్, మధ్యలో ఆప్
- బీజేపీకి అధికార వ్యతిరేకత
- కాంగ్రెస్‌కు అంతర్గత సమస్యలు
- కేజ్రీవాల్ కింగా? కింగ్ మేకరా?
- ప్రచార బరిలోకి మోదీ, కేజ్రీవాల్
- రాష్ట్రమంతా చుట్టేస్తున్న నేతలు



అయితే బీజేపీ లేదంటే కాంగ్రెస్. గుజరాత్ రాష్ట్రం ఏర్పడినప్పట్నుంచి ఈ రెండు పార్టీల మధ్యే పోటీ. ఈసారి మాత్రం కొత్తగా ఆప్ ఎన్నికల బరిలో దూకి తొడగొడుతోంది. గుజరాత్ మరో పంజాబ్ కానుందని ఎలుగెత్తి చాటుతోంది. ఆప్‌కు అంత సత్తా ఉందా? బీజేపీ, కాంగ్రెస్ వ్యూహాలేమిటి?

ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న గుజరాత్‌లో రాజకీయం బాగా వేడెక్కింది. బీజేపీ, కాంగ్రెస్ ముఖాముఖి పోరే రివాజుగా వస్తుండగా ఆప్ రంగప్రవేశంతో తొలిసారిగా త్రిముఖ పోటీకి రంగం సిద్ధమైంది. ఆప్‌కు లభించే ఆదరణ, అది ఎవరి ఓట్లను చీలుస్తుందన్న దానిపైనే పార్టీల జయాపజయాలు ఆధారపడి ఉన్నాయి. 2017లో తొలి ప్రయత్నంలో ఒక్క సీటూ గెలవకపోయినా గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఆప్ బాగానే బలపడింది. గతేడాది మున్సిపల్ ఎన్నికల్లో సూరత్‌లో 27 స్థానాలు గెలిచి బోణీ కొట్టింది. ఢిల్లీ, పంజాబ్ మాదిరిగా గుజరాత్‌లోనూ పాగా వేయాలని ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ పట్టుదలగా ఉన్నారు. తద్వారా 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీని ఢీకొట్టే నాయకుడిగా మారొచ్చని భావిస్తున్నారు. ఒక్క జూలైలోనే తన డిప్యూటీ మనీశ్ సిసోడియాతో కలిసి ఐదుసార్లు గుజరాత్‌లో పర్యటించి రాజకీయ వేడి పెంచారు. ఢిల్లీ, పంజాబ్ మోడళ్లను కలగలిపి ఉచిత విద్య, ఆరోగ్య సేవలు, 300 యూనిట్ల విద్యుత్ వంటి పలు హామీలిచ్చారు. ఇప్పటికే రెండుసార్లు అభ్యర్థుల జాబితా విడుదల చేసి దూకుడు ప్రదర్శించారు. మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి ఓటర్లే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. కేజ్రీవాల్ వ్యూహాత్మకంగా బీజేపీ వ్యతిరేక ఓటుపైనే దృష్టి పెట్టకుండా తమ విధానాల పట్ల మొగ్గేలా పలు వర్గాలను లక్ష్యంగా చేసుకొని సొంత ఓటు బ్యాంకు తయారు చేసుకునే పనిలో ఉన్నారని విశ్లేషకులు అంటున్నారు.

ఓటర్లను ఆకర్షించే ఆప్ వ్యూహాలు

పట్టణ ఓటర్లతో పాటు పలు వర్గాలు ఆప్‌కు మద్దతుగా ఉన్నట్టు ఢిల్లీ, పంజాబ్ ఎన్నికల్లో తేలింది. అందుకే గుజరాత్‌లో ఆప్ మహిళలు, దళితులు, ఆదివాసీలు, చిరు వ్యాపారులు వంటి ఓటర్లను ఆకర్షించే పనిలో పడింది. 48 శాతమున్న మహిళా ఓటర్లను ఆకర్షించడానికి 18 ఏళ్లు దాటిన అమ్మాయిలకు నెలకు రూ.1,000 అలవెన్స్ ప్రకటించింది. 16% ఆదివాసీ జనాభాపై కన్నేసి భారతీయ ట్రైబల్ పార్టీ (బీటీపీ)తో చేతులు కలిపింది. పంచాయతీ (షెడ్యూల్డ్ ప్రాంతాలకు విస్తరణ) చట్టం, గిరిజన వర్సిటీల స్థాపన వంటి హామీలిచ్చింది. గుజరాత్‌లో బడా పారిశ్రామికవేత్తలంతా బీజేపీ వైపే. అందుకే కేజ్రీవాల్ చిరు వ్యాపారులపై దృష్టి పెట్టారు. 10 రోజుల్లోనే వారితో మూడుసార్లు భేటీ అయ్యారు. వ్యాట్ రిబేట్లు, జీఎస్టీ సరళీకరణ, అవినీతి నిర్మూలన వంటి హామీలిచ్చారు.

2017 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు		
పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
బీజేపీ	99	49
కాంగ్రెస్	77	41
బీటీపీ	2	-
ఎన్సీపీ	1	-
స్వతంత్రులు	3	-

కష్టాల కాంగ్రెస్

ఇక కాంగ్రెస్‌ను అనేకానేక కష్టాలు వెంటాడుతున్నాయి. రాష్ట్రంలో 1995 నుంచి ఇప్పటిదాకా ప్రతిపక్ష పాత్రకే పరిమితమైంది. 2017లో మాత్రం పటీదార్ల రిజర్వేషన్ ఉద్యమంతో కాస్త లాభపడింది. 77 స్థానాలు గెలిచి గట్టి ప్రతిపక్షంగా అవతరించింది. కానీ ఐదేళ్లుగా రాష్ట్ర కాంగ్రెస్‌లో ఇంటి పోరు ముదిరింది. దాంతో 12 మంది ఎమ్మెల్యేలు బీజేపీ గూటికి చేరారు. మరో 10 మంది గోడ దూకడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రచారంలోనూ కాంగ్రెస్ వెనకబడింది. సెప్టెంబర్ 5 నుంచి బరిలో దిగనుంది. రాష్ట్రానికి చెందిన దిగ్గజ నాయకుడు అహ్మద్ పటేల్ లేకుండా కాంగ్రెస్ ఈసారి అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కోబోతోంది.

బీజేపీకి సవాలే..

గుజరాత్‌లో బీజేపీ 27 ఏళ్లుగా అధికారంలో ఉండటంతో ప్రభుత్వ వ్యతిరేకత గట్టిగానే కన్పిస్తోంది. ఎన్నికల గణాంకాలూ అదే చెబుతున్నాయి. మొత్తం 182 అసెంబ్లీలో స్థానాల్లో బీజేపీ 2002లో 127 స్థానాల్లో నెగ్గితే 2007లో 117, 2012లో 116 స్థానాల్లో గెలిచింది. 2017 ఎన్నికల్లో 99కి తగ్గింది. మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సొంత రాష్ట్రం కావడంతో బీజేపీకి గుజరాత్ అత్యంత ప్రతిష్టాత్మకంగా మారింది. బీజేపీ ప్రధాన బలమైన పట్టణ ఓటర్లను ఆప్ కొల్లగొడుతుందన్న అంచనాలున్నాయి. దాంతో 9 నెలల కింద సీఎంగా భూపేంద్ర పటేల్‌ను బీజేపీ పీఠమెక్కించింది. రాష్ట్ర పార్టీ చీఫ్‌గా ఆర్‌సీ పటేల్‌ను ఎంపిక చేసింది. సంస్థాగతంగా పలు మార్పులు చేసింది. 12 శాతమున్న పటీదార్ల ఓట్లను ఆకర్షించడానికి హార్దిక్ పటేల్‌ను అక్కున చేర్చుకుంది. రెన్నెల్ల కింద ఇద్దరు దళిత నాయకులకు మంత్రి పదవులిచ్చింది. గత మార్చిలో యూపీ సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత మోదీ కనీసం 10 సార్లు గుజరాత్‌లో పర్యటించారు. ప్రతిసారీ వేల కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి విజయనగరం

సోమవారం । 29 । ఆగస్టు । 2022



ఆటకు పెద్దపీట
జిల్లాలో క్రీడల అభివృద్ధి, క్రీడాకారుల ఎదుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వారికి ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తూ, కోచ్‌లను నియమిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తోంది. - 8లో



పీడిస్తున్న కోవిడ్ పరిణామాలు
కోవిడ్ వ్యాప్తి తగ్గినప్పటికీ దాని పరిణామాలు వెంటాడుతూనే ఉన్నాయి. కొంతమంది జీబీ, షుగర్ వంటి వ్యాధుల బారిన పడుతుండగా మరి కొంతమంది బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్ ఎటాక్ బారిన పడుతున్నారు. - 8లో



10న ఏపీజీఈఏ జిల్లా సభలు
ఏపీజీఈఏ జిల్లా నాల్గవ కౌన్సిల్ మహాసభలు సెప్టెంబరు 10న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నామని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు కోరారు. - 8లో

న్యూస్‌రీల్

నష్ట పరిహారం చెల్లింపు

- సాధ్యమైనంత త్వరలో పులి సమస్యలకు పరిష్కారం
- ముఖ్య అటవీ సంరక్షణాధికారి రామ్మోహన్‌రావు



బాధితులకు నష్టపరిహారం అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనర్సయ్య, సీసీఎఫ్ రామ్మోహన్‌రావు

విజయనగరం ఫూల్‌బాగ్: పులి దాడిలో చనిపోయిన రెండు ఆవులకు సంబంధించిన బాధితులకు రూ.35,000 నష్ట పరిహారం గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, ముఖ్య అటవీ సంరక్షణాధికారి పి.రామ్మోహన్ రావు(విశాఖపట్నం) బాధితులకు చెక్ రూపంలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు పులి సంచరిస్తున్న ప్రదేశాలు, పాదముద్రలు, పులిగుమ్మి గ్రామ పరిసర ప్రాంతాలు, షికారుగంజి రిజర్వు అటవీ ప్రాంతం, పరిసర గ్రామాలు విస్తృత పర్యటన వివరాలను వెల్లడించారు. పులులు స్వతహాగా బిడియ స్వభావం కలవని, మనుషులు నుంచి సాధ్యమైనంత దూరంగా ఉండేందుకు ప్రయత్నిస్తూ వారికి కనబడకుండా ఉండటానికి ఇష్టపడతాయని పేర్కొన్నారు. సాధ్యమైనంత వరకు పులి తిరిగి తన ఆవాసాలకు చేరుకొనే వరకు ప్రజలు సంయమనంతో ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఇటీవల ఉత్తరప్రదేశ్ నుంచి రప్పించిన పులి బోనును, వైల్డ్ లైఫ్ రెస్క్యూ వేన్ అందుబాటులో ఉంచటానికి విజయనగరం రప్పించామన్నారు. సాధ్యమైనంత త్వరలో పులి సమస్యకు పరిష్కారం వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయనతో పాటు డీఎఫ్ఓ ఎస్.వెంకటేష్, సబ్ డీఎఫ్ఓ బి.రాజారావు, రేంజ్ ఆఫీసర్ బి.అప్పలరాజు, డీఆర్ఓలు ప్లహ్లాదరావు, కేవీఎస్ రాజు, అటవీ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

హోరాహోరీగా చెస్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాజాం: స్థానిక జీఎంఆర్ ఐటీ కళాశాలలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, ఆంధ్రా చెస్ అకాడమీ సంయుక్తంగా ఆదివారం జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహించాయి. జీఎంఆర్ ఐటీ డైరెక్టర్ గిరీష్ ఈ పోటీలను ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి 86 మంది క్రీడాకారులు హాజరు కాగా ఐదు రౌండ్ల పాటు పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో శ్రీకాకుళానికి చెందిన బి. శృతి ప్రథమ స్థానంలో నిలువగా, రణస్థలం ఎస్ఈఆర్ స్కూల్‌కు చెందిన బి.వైష్ణవి ద్వితీయ స్థానం సాధించింది. వమరవల్లికి చెందిన షేనిదేవి మూడో స్థానం, రాజాంకు చెందిన సుచరిత నాలుగో స్థానం సాధించారు. అబ్బాయిల విభాగంలో పలాసకు చెందిన కేకేహెచ్ కీర్తన్ ప్రథమ స్థానం సాధించగా, రాజాం జీఎంఆర్ డీపీవీకి చెందిన కల్యాణ్‌కుమార్, తనిష్, జీడీ సాయి విశ్వేష్‌లు వరుసగా ద్వితీయ, తృతీయ, నాల్గో స్థానాలు కైవసం చేసుకున్నారు. వీరికి ఆంధ్రా చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సలపల భీమారావు, జీఎంఆర్ పీడీ డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ శశికుమార్ తదితరులు బహుమతులు అందజేశారు. పోటీల్లో ఎంపికైన వారు సెప్టెంబర్ 3, 4 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరగనున్న రాష్ట్ర స్థాయి అండర్ – 13 చదరంగం పోటీల్లో జిల్లా తరపున పాల్గొననున్నారని కార్యదర్శి భీమారావు వెల్లడించారు.



విజేతలతో నిర్వాహకులు

ఉప్పొంగిన భక్తి భావం



విజయనగరంలోని మయూరి కూడలి వద్ద సంతోషిమాత ఆలయంలో లలిత పారాయణం ఆదివారం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో చండీహోమం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు రమేష్ ఆధ్వర్యంలో జరిగిన హోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ భక్తి భావాన్ని చాటుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



పల్లెలకు ప్రగతి శోభ



మాట తప్పని సీఎం



మాట తప్పని మడం తిప్పని నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. జాతిపిత గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసేందుకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు జనరంజక పాలన అందిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నేరవేరుస్తూ సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాకుండా, ఇటీవల నియోజకవర్గానికి రూ.2కోట్లు, సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున నిధులు మంజూరుపై సీఎం తీసుకున్న నిర్ణయం చాలా గొప్పది. రాష్ట్రంలోని పల్లె గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. పల్లె గ్రామాల్లోని సీసీ రోడ్లు, కాలువలు, వీధిలైట్లు, పారిశుధ్య నిర్వాహణ వంటి ప్రధాన సమస్యలను పరిష్కరించడంతో పాటు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ఈ నిధులు ఎంతగానో ఉపయోగపడతాయి.

– బడ్డుకొండ అప్పలనాయుడు, నెల్లిమర్ల నియోజకవర్గం శాసనసభ్యులు

పల్లెలే దేశానికి పట్టుగొమ్మలన్న జాతిపిత మహాత్మాగాంధీ అన్న మాటలను నిజం చేసేందుకు రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పల్లెల ప్రగతికి నడుం బిగించింది. ఇప్పటికే పల్లెల అభివృద్ధికి కృషి చేస్తోన్న ప్రభుత్వం తాజాగా సచివాలయానికి రూ.20 లక్షలు, ఎమ్మెల్యేకు రూ.రెండు కోట్లు చొప్పున అభివృద్ధి పనులకు కేటాయించేందుకు నిర్ణయించింది. వీటితో పల్లెలు మరింత ప్రగతి బాటలో పయనించడం ఖాయం.



మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం

- అభివృద్ధి పనులకు నిధులు
- నియోజకవర్గానికి రూ.2కోట్లు
- సచివాలయానికి రూ.20లక్షలు
- ఉమ్మడి జిల్లాలకు రూ.217.20కోట్లు
- ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంపై హర్షాతిరేకాలు

భోగాపురం: విజయనగరం, పార్వతీపురం - మన్యం జిల్లాల్లో పల్లెలు ప్రగతి బాట పట్టనున్నాయి. గ్రామాల్లో మరింతగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. దీనిపై ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యేలతో సమీక్షించారు. పల్లెల్లో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతి సచివాలయానికి రూ.20లక్షలు, ఎమ్మెల్యేకు రూ.2 కోట్లు నిధులు మంజూరు చేస్తున్నట్టు ఇటీవల ప్రకటించారు. ఈ విధంగా జిల్లాకు రూ.217.20కోట్లు నిధులు వచ్చే అవకాశం ఉంది. తాగునీరు, పారిశుద్ధ్యం నిర్వహణ, రోడ్లు, సీసీ కాలువల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయని ప్రజాప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పల్లెల అభివృద్ధే లక్ష్యంగా..

గ్రామాల అభివృద్ధికి వీలుగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి తక్షణమే రూ.2 కోట్లు నిధులు మంజూరు చేయడానికి సంబంధించి ఇప్పటికే మార్గదర్శకాలు విడుదలయ్యాయి. ఈ నిధులను ఎమ్మెల్యే ఆధీనంలో ఉంచుతూ, గ్రామాల అభివృద్ధికి వెచ్చించే విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. దీని ప్రకారం విజయనగరం, పార్వతీపురం మన్యం ఉమ్మడి జిల్లాల్లోని 11 నియోజకవర్గాలకు రూ.22 కోట్లు రానున్నాయి. దీంతో గ్రామాల్లో అనేక సమస్యలకు మోక్షం కలుగుతుందని స్థానిక ప్రజాప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. విజయనగరం, పార్వతీపురం ఉమ్మడి జిల్లాల్లో 841 గ్రామ, 135 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఒక్కో దానికి రూ.20 లక్షలు చొప్పున రానున్నాయి. ఈ నిధులను ఏడాది కాలపరిమితిలో ఖర్చు చేయాల్సి ఉంది.

గంగన్నపాడు పరిసరాల్లో పులి



- తోటపల్లి కాలువ గట్టుపై పాదముద్రలు
- భయాందోళనలో గ్రామస్తులు

తెర్లాం: విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ప్రజలను వణికిస్తున్న పెద్ద పులి పాదముద్రలు తెర్లాం మండలం గంగన్నపాడు గ్రామానికి సమీపంలో ఉన్న తోటపల్లి కాలువ గట్టుపై ఆదివారం ఉదయం కనిపించాయి. ఉదయం మార్నింగ్ వాక్‌కు వెళ్లిన వారు పులి పాదముద్రలు చూసి వాటిని ఫొటోలు తీసి స్థానికులకు చూపించారు. మండలంలోని గొలుగువలస గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి ఆవుపై పంజా విసిరిన పులి దాన్ని హతమార్చింది. ఇదే విషయాన్ని అటవీ శాఖ అధికారులు శనివారం నిర్ధారించిన విషయం తెలిసిందే. గొలుగువలస నుంచి తోటపల్లి కాలువ గట్టు పైనుంచి గంగన్నపాడు, ఎంఆర్ అగ్రహారం మీదుగా ఎం.రాయవలస మామిడి తోటల్లో నుంచి పులిగుమ్మి వెళ్లి ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గంగన్నపాడు సమీపంలో తోటపల్లి కాలువ గట్టుపై పులి పాదముద్రలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయని, ఎంఆర్ అగ్రహారం వైపు కూడా కొన్ని చోట్ల పాదముద్రలు కనిపిస్తున్నాయని పలువురు తెలిపారు. శుక్రవారం రాత్రి గొలుగువలసలో ఆవును చంపి కొంత భాగం తినేసి మిగిలిన భాగాన్ని తినేందుకు శనివారం రాత్రి కూడా పులి వచ్చిందని, అక్కడ మరిన్ని పాదముద్రలు కనిపించాయని గొలుగువలస సర్పంచ్ ప్రతినిధి శంకరరావుతో పాటు స్థానికులు తెలిపారు. అక్కడ ఆవు శరీర భాగాలు కనిపించకపోవడంతో గంగన్నపాడు, ఎంఆర్ అగ్రహారం మీదుగా పులిగుమ్మి వైపు వెళ్లి ఉంటుందని పలువురు చెబుతున్నారు. పెద్ద పులి సంచారంతో స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా అన్ని గ్రామాల్లో తహసీల్దార్ దోల రాజేశ్వరరావు, ఎస్ఐ ఆర్.రమేష్ ఆదేశాల మేరకు దండోరా వేశారు. అత్యవసర సమయాల్లో తప్ప రాత్రి వేళల్లో ప్రజలు బయటకు రావద్దని, రైతులు పొలాలు, తోటలకు వెళ్లొద్దని హెచ్చరించారు. గంగన్నపాడులో పులి పాదముద్రలు కనిపించిన విషయమై బొబ్బిలి అటవీ శాఖ బీట్ ఆఫీసర్ స్వప్న వద్ద విలేకరులు ప్రస్తావించగా గొలుగువలసలో ఆవును హతం చేసిన పులి గంగన్నపాడు, ఎంఆర్ అగ్రహారం మీదుగా పులిగుమ్మి వైపు వెళ్లి ఉండచ్చని అభిప్రాయపడ్డారు.



గంగన్నపాడు సమీపంలోని తోటపల్లి కాలువపై పులి పాదముద్రలు

మళ్లీ పులి వచ్చింది..

మెరకముడిదాం: పులిగుమ్మి గ్రామ సమీపంలో శనివారం రాత్రి పులి ఆనవాళ్లు కనిపించడంతో గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన అటవీ శాఖ జిల్లా అధికారి వెంకటేష్, సబ్ డీఎఫ్ఓ రాజబాబు, ఫారెస్టు రేంజర్ త్రినాధరావు సంబంధిత ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. పాదముద్రలను పరిశీలించి పులివేనని నిర్ధారించారు. పెద్ద పులి మళ్లీ వచ్చిందని పులిగుమ్మితో పాటు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

ఉత్సవాలకు విద్యుత్ సౌకర్యం

- వినాయక మంటపాలకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరా
- జిల్లాలో ఎనిమిది వేల మంటపాలు

విజయనగరం ఫోర్ట్:

వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు అంతా సిద్ధమవుతున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు కమిటీలు వేసుకొని ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయక మంటపాలు ఏర్పాట్లలో అంతా నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో మంటపాలకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరా చేసే విధంగా ఏపీఈపీడీసీఎస్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

8వేల మంటపాలకు అవకాశం

రెండేళ్లు కోవిడ్ కారణంగా చవితి ఉత్సవాలు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ప్రస్తుతం అంతా బాగుండడంతో జిల్లా వ్యాప్తంగా ఆరు వేల నుంచి ఎనిమిది వేల వరకు మంటపాలు ఏర్పాటయ్యే అవకాశం ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా వినాయక మంటపాలకు విద్యుత్ చౌర్యం చేసేవారు. దీని వల్ల అధిక లోడ్ సమస్యతో పాటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని అధికారులు గుర్తించారు. దీంతో తాత్కాలిక అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంటపాలకు తాత్కాలిక రుసుం వివరాలు అధికారులు ప్రకటించారు. ఎనిమిది రోజుల పాటు వెయ్యి వాట్స్ విద్యుత్ సరఫరాకు రూ.2400లు మీ సేవ లేదా సచివాలయంలో చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఆ రశీదును విద్యుత్ ఏఈ కార్యాలయంలో అందజేస్తే విద్యుత్ సరఫరా చేస్తారు.



వినాయక విగ్రహాలు

తాత్కాలికంగా విద్యుత్ సరఫరా

గణేష్ మంటపాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరాకు సంబంధించి దరఖాస్తు చేసుకుంటే విద్యుత్‌ను సరఫరా చేస్తాం. వినాయక ఉత్సవాలు నిర్వహించే నిర్వాహకులు అనుమతులు తీసుకుని సహకరించాలి. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే చర్యలు తీసుకుంటాం. వీటిపై నిఘా పెట్టి క్షేత్ర స్థాయిలో చర్యలు తీసుకుంటాం.

– కృష్ణమూర్తి, ఈఈ, విద్యుత్‌శాఖ


విజయభావన సాహితీ సదస్సు

విజయనగరం టౌన్: విజయభావన సాహితీమిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో సాహితీమిత్ర సదస్సు ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నన్నయ్య సహస్రాబ్ది మహోత్సవాలను పురస్కరించుకుని రుషి వంటి నన్నయ్య రెండవ వాల్మీకి అనే అంశంపై వక్త ఎర్రాప్రెగడ రామకృష్ణ ప్రసంగించారు. కార్యక్రమంలో దేవరాజు గోపాలకృష్ణ, జక్కు రామకృష్ణ, సూర్యలక్ష్మి, బాబూజీ, అన్నపూర్ణదేవీ, కాళ్ల నిర్మల తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్‌కు సచివాలయ నిర్మాణాల పూర్తి

- బిల్లుల చెల్లింపులకు నిధుల కొరత లేదు
- ఏపీ రూరల్ డెవలప్‌మెంట్‌లో రూ.5,500 కోట్లతో రహదారుల నిర్మాణాలు
- నెలవారీ రూ.153 కోట్లు చెల్లించేందుకు ప్రణాళికలు
- పీఆర్ ఈఎన్‌సీ సుబ్బారెడ్డి

లక్కవరపుకోట: రాష్ట్రంలో సచివాలయ భవన నిర్మాణ పనులు 95 శాతం అక్టోబర్ నాటికి పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించామని పంచాయతీరాజ్ రాష్ట్ర ఇంజినీరింగ్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) బి.సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలో గొల్జాం గ్రామంలో నిర్మిస్తున్న గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఆరు వేల సచివాలయ భవన నిర్మాణాలు పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చామని, మరో రెండు వేల భవనాలు నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు త్వరితగతిన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మూడు వేల రైతుభరోసా కేంద్రాల నిర్మాణ పనులు పూర్తయినట్టు చెప్పారు. మరో మూడు వేల భవనాలు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. డిసెంబర్ 15 నాటికి నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు డిజైనింగ్ మార్పు కారణంగా అదనంగా మరో రూ.2లక్షలు అంచనాలను పెంచినట్టు చెప్పారు. దీనికి సంబంధించి జీఓ సోమవారం విడుదల చేస్తామన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 2500 భవనాలు నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. మరో రెండు వేల భవనాలు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయన్నారు. వీటి నిర్మాణానికి నిధుల కొరత లేదన్నారు. పనుల ప్రగతి ఆధారంగా బిల్లులను విడుదల చేస్తున్నామని తెలిపారు. ఏపీ రూరల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా రూ.5500 కోట్లతో 73 వేల కిలోమీటర్ల రోడ్లతో నాలుగు వేల శివారు గ్రామాలను అనుసంధానం చేసేందుకు రహదారుల నిర్మాణాలు చేపట్టామన్నారు. ఇప్పటి వరకు 1800 కిలోమీటర్ల రహదారుల పనులు పూర్తి చేసి 1800 శివారు గ్రామాలను అనుసంధానం చేసి రూ.260 కోట్లు బిల్లులను చెల్లించినట్టు చెప్పారు. పనుల ప్రగతిని బట్టి నెలవారీ రూ.153 కోట్లు బిల్లులను విడుదల చేసేందుకు ప్రణాళికలను రూపొందించామన్నారు. గ్రామీణ ప్రధానమంత్రి సడక్ యోజన పథకంలో 4500 కిలోమీటర్లు రహదారుల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఇప్పటి వరకు 2600 కిలోమీటర్లు పనులు పూర్తయినట్టు తెలిపారు. 2023 సెప్టెంబర్ నాటికి పూర్తి స్థాయిలో నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. ఆయన వెంట ఎస్ఈ జి.రమేష్‌గుప్త, ఈఈ కేజీజే నాయుడు, డీఈ స్వామినాయుడు, జేఈ వీరలక్ష్మి తదితరులు ఉన్నారు.



గొల్జాం సచివాలయ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఈఎన్‌సీ సుబ్బారెడ్డి

త్వరితగతిన పనులు

వేపాడ: రాష్ట్రంలో 10,304 ఆర్‌బీకేలకుగాను మూడు వేల భవన నిర్మాణాలు పూర్తయ్యాయని పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ బి.సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని కరకవలస పంచాయతీ శివారు మారిక గిరిజన గ్రామ రహదారి నిర్మాణం, సోంపురంలో రైతు భరోసా కేంద్రాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ అనుమతులు వచ్చినందున మారిక రహదారి నిర్మాణం చేపట్టాలని సూచించారు. సోంపురంలో ఆర్‌బీకే భవనాన్ని పరిశీలించి నవరత్నాల లోగో, విద్యుత్ తదితర పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

క్లుప్తంగా

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన కొండపర్తి నారాయణ

గజపతినగరం: మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన కొండపర్తి నారాయణ(62) అప్పుల బాధ తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొండపర్తి నారాయణ తలకు మించిన అప్పులు చేసి తీర్చలేక మనస్తాపానికి గురై శనివారం రాత్రి పురుగు మందు తాగేశాడు. గమనించిన కుటుంబసభ్యులు విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. హెడ్ కానిస్టేబుల్ ఎస్.అంజిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగు పడి రైతు మృతి



పిడుగు పాటుతో మృతిచెందిన రైతు నరసింహనాయుడు నరసింహనాయుడు (ఫైల్)

శృంగవరపుకోట: మండలంలోని పోతనాపల్లి గ్రామానికి చెందిన రైతు కూనిరెడ్డి నరసింహనాయుడు(45) పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. ఆ సమయంలో పక్కనే ఉన్న భార్య పద్మ గాయాల పాలై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం రైతు నరసింహనాయుడు భార్య పద్మతో కలిసి గ్రామానికి సమీపంలో ఉన్న కుమ్మరి పొలంలో వరిపైరులో కలుపు తీస్తుండగా 3.30గంటల సమయంలో వర్షంతో పాటు పిడుగు పడింది. పిడుగు నేరుగా నరసింహనాయుడును తాకడంతో కాలిన గాయాలతో పడిపోయాడు. కాస్తంత దూరంలో ఉన్న భార్య పద్మ పిడుగు అదురుకు కుప్పకూలిపోయింది. వారికి కాస్త దూరంలో పొలంలో ఉన్న మృతుని తల్లి చిట్టమ్మ చూసి అరిచి కేకలు వేయడంతో చుట్టు పక్కల పనులు చేసుకుంటున్న రైతులు పరుగున వచ్చి భార్యాభర్తలను ఆటోలో ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారిని పరీక్షించిన వైద్యులు నరసింహనాయుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించి, భార్య పద్మకు చికిత్స చేశారు. మృతుడికి భార్య పద్మ, 13 ఏళ్ల కుమార్తె సుస్మిత, తల్లిదండ్రులు సన్నిబాబు, చిట్టమ్మ ఉన్నారు. ఎస్.కోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి రైల్వేస్టేషన్ వద్ద రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్‌పీ శ్రీకాకుళం ఎస్సై చెల్లూరి శ్రీనివాసరావు తెలిపారు. మృతుడికి సుమారు 40 సంవత్సరాలు ఉంటాయని, కాఫీ రంగు లుంగీ, తెలుపుషర్టుపైన పచ్చని చారల షర్టు ధరించి ఉన్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించినట్లు చెప్పారు. వివరాల కోసం 7013273731 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 438.00
విజయనగరం	రూ. 441.00
శ్రీకాకుళం	రూ. 441.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	51,230–00
బంగారం(22సి. 10గ్రా.)	47,600–00
వెండి (కిలో)	60,700–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

ఆటకు పెద్దపీట

- క్రీడాభివృద్ధిని అమలు చేసి చూపిస్తున్న ప్రభుత్వం
- గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించేందుకు జగనన్న స్పోర్ట్స్‌క్లబ్
- నేడు జిల్లాలో జాతీయ క్రీడల దినోత్సవం
- క్రీడాకారులకు ప్రతిభ అవార్డుల ప్రదానం

పార్వతీపురం మన్యం జిల్లాలో క్రీడల వివరాలు	
క్రీడాకారులు	1000 మంది
శిక్షణా కేంద్రాలు	2
క్రీడా ప్రాంగణాలు	3
కోచ్‌లు(పీడీలు, పీఈటీలు)	400 మంది
అంతర్జాతీయ క్రీడాకారులు	3
జాతీయ క్రీడాకారులు	59 మంది



వాలీబాల్ ఆటలో క్రీడాకారులు (ఫైల్)

పార్వతీపురంటౌన్: జిల్లాలో క్రీడల అభివృద్ధి, క్రీడాకారుల ఎదుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వారికి ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తూ, కోచ్‌లను నియమిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తోంది. నేడు హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని పార్వతీపురం మన్యం జిల్లాలో తొలిసారి జాతీయ క్రీడల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.

క్రీడాకారులను ప్రోత్సహిస్తూ..

రాష్ట్ర ప్రభుత్వం ఒలింపిక్స్, అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలతో రాణిస్తున్న క్రీడాకారులకు వైఎస్సార్ క్రీడా ప్రోత్సాహకాల పేరిట నగదు పురస్కారాలు అందిస్తోంది. జాతీయస్థాయి క్రీడల్లో బంగారు పతకానికి రూ. 5లక్షలు, రజతానికి రూ. 4లక్షలు, కాంస్యానికి రూ. 3లక్షలు కేటాయిస్తోంది. నేషనల్స్ మీట్ సీనియర్స్/ జూనియర్స్ /సబ్‌జూనియర్స్‌లో మొదటి మూడు స్థానాలకు వరుసగా రూ.1.25 లక్షలు, రూ.75వేలు, రూ.50వేలు కేటాయిస్తోంది. ఈ మేరకు జిల్లాలో సుమారు 25 మంది ప్రోత్సాహకాలు అందుకున్నారు.

స్పోర్ట్స్ కోటా దేశానికి ఆదర్శం

దేశంలో స్పోర్ట్స్ కోటాను పక్కాగా అమలు చేస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే. రాష్ట్రంలోని గ్రామ/ వార్డు సచివాలయాల్లో స్పోర్ట్స్ కోటా అమలు ద్వారా సుమారు 2శాతం మంది క్రీడాకారులు ఉద్యోగాలు సాధించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 80మందికి పైగా క్రాడాకారులు సచివాలయ ఉద్యోగాలు పొందడంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

ప్రతిభ అవార్డుల ప్రదానం

క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టడంతో క్రీడా ప్రతిభ అవార్డులను కలెక్టర్ నిషాంత్ కుమార్ సోమవారం అందజేయన్నారు. స్థానిక ప్రభుత్వ భవనాల సముదాయం (ఆర్‌సీఎం పాఠశాల)లో గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్త జిల్లాగా ఏర్పడిన తరువాత తొలి జాతీయక్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. క్రీడల్లో ప్రతిభ చాటిన పాఠశాలలకు, క్రీడా ప్రతిభా చూపిన క్రీడాకారులకు అవార్డులు, సర్టిఫికెట్లు, మెడల్స్, నగదు ప్రోత్సాహం అందజేస్తారు.

గ్రామస్థాయిలో క్రీడల అభివృద్ధి

గ్రామస్థాయినుంచి క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం విప్లవాత్మక చర్యలు చేపడుతోంది. ప్రతిభ గల విద్యార్థులను గుర్తించడంతో పాటు వారిని వెలుగులోకి తీసుకురావడానికి జగనన్న స్పోర్ట్స్‌క్లబ్ పేరిట క్రీడాభివృద్ధికి శ్రీకారం చుట్టింది. క్రీడలపై అవగాహన పెంపొందించేలా సచివాలయ ఉద్యోగుల్లో ఒకరికి ప్రత్యేక జాబ్‌చార్ట్‌ను కేటాయిస్తూ జీఓ నంబర్ 84, 85 విడుల చేసింది. ప్రతి నెలా క్రమం తప్పకుండా ముఖ్యమైన తేదీల్లో స్థానికంగా పోటీలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించింది. దీనికి స్థానిక పాఠశాలలు, కళాశాలల్లోనే పీడీ, పీఈటీలకు బాధ్యతను అప్పగించింది.



కబడ్డీలో విద్యార్థినులు (ఫైల్)

ఆరోగ్యంతో పాటు ఉద్యోగ అవకాశాలు



క్రీడల వల్ల ఆరోగ్యంతో పాటు క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలలో 2 శాతం రిజర్వేషన్‌లను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. గ్రామస్థాయినుంచి క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జగనన్న స్పోర్ట్స్ క్లబ్ పేరిట క్రీడాభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రతిభ గల క్రీడాకారులను పోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అప్పుడే ఒలింపిక్స్‌లాంటి, జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణించేందుకు అవకాశం ఉంటుంది. తమ పిల్లలకు క్రీడలపై ఆసక్తి ఉంటే తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలి.

–ఎస్. వెంకటేశ్వర్లు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి, పార్వతీపురం మన్యం

'సాక్షి' మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో...

చిన్నారుల చేతుల్లో మట్టి గణపతి

ఆంధ్రప్రదేశ్ ANDHRA PRADESH AP Pollution Control Board

SAKSHI SAKSHI DIGITAL MEDIA GROUP

వినాయకుని పండుగ వస్తోంది! వినాయక చవితి రోజు మీరు పుస్తకాలు, పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన మధురమైన పిండి వంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరే సమయం ఆసన్నమైంది. అయితే మీరు పూజించాల్సిన వినాయకుణ్ని మీరే మీ చిట్టి చేతులతో తయారు చేస్తే 'గణాధిపతి' ఎంతో సంతోషించి వరాలనిస్తాడు. మాకు విగ్రహం చేయడం రాదని చింతించకండి. విగ్రహం తయారు చేసే విధానం గురించి 'సాక్షి' మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 30వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు ఉన్న బాలలందరూ పాల్గొనవచ్చు. దీనికి ఎటువంటి రుసుము చెల్లించ నక్కరలేదు. బంకమట్టిని సైతం నిర్వాహకులే ఉచితంగా ఇస్తారు. మీరు దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకుంటే చాలు. పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని ప్రతిమలుగా మలిచి, రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. ఇంకెందుకు ఆలస్యం మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్ బాటిల్, పాత వస్త్రం వెంట తీసుకురండి.

అవిఘ్నమస్తు.. అభీష్ట సిద్ధిరస్తు..

శిబిరం చిరునామా : గురజాడ పబ్లిక్ స్కూల్, కంటోన్మెంట్ ఏరియా, విజయనగరం

తేదీ: 30-08-2022 (మంగళవారం)

సమయం: ఉదయం 9.30 నుంచి 12.30 వరకు.

రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన

ఫోన్ నంబరు : 9951602843

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు పతకాలు



రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజయనగరం జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన పోటీల్లో పతకాలు సాధించి జిల్లా కీర్తి ప్రతిష్టలను చాటి చెప్పారు. వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో జిల్లా క్రీడాకారులు 5 బంగారు పతకాలు, 10 వెండి పతకాలు, 15 కాంస్య పతకాలు సాధించినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం ప్రకటించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో అద్వితీయ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో జిల్లా క్రీడాకారులు మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులు పతకాలు సాధించటంలో కీలక పాత్ర పోషించిన కోచ్ అండ్ మేనేజర్‌లు పి.సతీష్, ఎ.లక్ష్మణ్, టెక్నికల్ ఆఫీషియల్స్ లీలాకృష్ణ, తవిటి నాయుడులను అభినందించారు.

10న ఏపీజీఈఏ జిల్లా సభలు



ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను కలిసిన ఏపీజీఈఏ ఉద్యోగ సంఘం నాయకులు

- ఎంపీని కలిసిన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

చీపురుపల్లి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) జిల్లా నాల్గవ కౌన్సిల్ మహాసభలు సెప్టెంబరు 10న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నామని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను సంఘం జిల్లా, రాష్ట్ర స్థాయి ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేఆర్.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జి.అప్పారావులు ఆధ్వర్యంలో ప్రభుత్వ గుర్తింపు పొంది, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్యత్వం పొంది అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తమ సంఘం పరిష్కరిస్తోందన్నారు. అందులో భాగంగానే ఏపీజీఈఏ సంఘం నాల్గవ కౌన్సిల్ మహాసభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆ మహాసభలకు రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులు హాజరవుతున్నట్లు చెప్పారు. కౌన్సిల్ మహాసభలకు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను ఆహ్వానించారు. ఈ సభలకు ఆఫీస్ సబార్డినేట్లు నుంచి గ్రూప్1 స్థాయి అధికారులు వరకు అన్నిశాఖల అధికారులు, సిబ్బంది హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎల్‌వి.యుగంధర్, జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజీ పాణిగ్రాహి, పెన్షనర్ల రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పీవీ.రమణ, చీపురుపల్లి యూనిట్ అధ్యక్ష, కార్యదర్శి, ట్రెజరర్‌లు కర్రోతు విశ్వేశ్వరరావు, అయ్యప్ప, ప్రసాద్, నగిరెడ్డి గోపాల్, మంగళగిరి శ్రీనివాసరావులు ఉన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు

విజయనగరం: స్థానిక ఇండోర్ స్టేడియంలో విజయనగరం సిటీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో 64 మంది క్రీడాకారులు పాల్గొనగా..అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వీఎస్‌ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు, కార్యదర్శి సురేష్, జాతీయ క్రీడాకారులు మల్లికార్జునరావు, అశోక్‌లు పోటీలను ప్రారంభించారు. ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగిన పోటీల్లో కుటుంబరావు–తేజా జోడీపై రాఘవరెడ్డి– ఉదయ్‌ల జోడీ విజయం సాధించింది. జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడాకారుల్లో ఐక్యతా భావాన్ని పెంపొందించేందుకు ఈపోటీలు నిర్వహించినట్లు అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. విజేతలకు విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి సోమవారం బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

గణేష్ ఉత్సవాల టారిఫ్‌లో ఎలాంటి మార్పులు లేవు

- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు వెల్లడి

సాక్షి, విశాఖపట్నం: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే వినాయక మండపాలకు తాత్కాలిక విద్యుత్ టారిఫ్‌ను పెంచలేదని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు స్పష్టం చేశారు. టారిఫ్ పెంచుతున్నట్లు వస్తున్న వదంతులను ఆయన ఖండించారు. దీనికి సంబంధించి 2014 నుంచి అదే టారిఫ్ ఇప్పటికీ కొనసాగుతోందని స్పష్టం చేశారు. వినాయక చవితి సందర్భంగా గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసే కమిటీలు/భక్తులు విద్యుత్ శాఖ నిబంధనల మేరకు తాత్కాలిక కనెక్షన్లు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ శాఖ నిబంధనల మేరకు ఈ కనెక్షన్ల ద్వారా పది రోజుల పాటు విద్యుత్ వినియోగించుకోవచ్చని తెలిపారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, కార్యక్రమ నిర్వాహకులు పైన పేర్కొన్న విధంగా విద్యుత్ ఛార్జీలు చెల్లించి సంస్థకు సహకరించాలని సీఎండీ సంతోషరావు కోరారు.

పీడిస్తున్న కోవిడ్ పరిణామాలు

- పెరుగుతున్న బ్రెయిన్‌స్ట్రోక్, హార్ట్ ఎటాక్
- తుంటికీలు నొప్పి బాధితులు అధికమే



గుండె జబ్బు ఉన్న వ్యక్తిని పరీక్షిస్తున్న వైద్యుడు



కేంద్రాస్పత్రిలో తుంటి కాలు నొప్పితో వచ్చిన వ్యక్తికి ఎంఆర్‌ఐ స్కాన్ తీస్తున్న టెక్నీషియన్

విజయనగరం ఫోర్ట్: కోవిడ్ వ్యాప్తి తగ్గినప్పటికీ దాని దుష్ఫలితాలు వెంటాడుతూనే ఉన్నాయి. కొంతమంది బీపీ, షుగర్ వంటి వ్యాధుల బారిన పడుతుండగా మరి కొంతమంది బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్ ఎటాక్ బారిన పడుతున్నారు. వాటికి తోడు కొత్తగా తుంటి కీలుకు రక్తప్రసరణ తగ్గి అవి దెబ్బతింటున్న కేసులు వస్తున్నాయి. కోవిడ్ తగ్గిన తర్వాత రక్తం పలచబడేందుకు మందులు సరిగా వాడని వారిలో ఈ సమస్యలు కనిపిస్తున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు.

గుండె, మెదడుపై ప్రభావం

పోస్టు కోవిడ్ రోగుల్లో ఎక్కువ మంది గుండెపోటు, మెదడుపోటుకు గురవుతున్నారు. వారిలో కొందరు మృత్యువాత పడుతున్నారు. అందుకు రక్తనాళాల్లో గడ్డలు ఏర్పడి రక్తప్రసరణ సరిగా జరగకపోవడమే కారణం. ముఖ్యంగా సెకండ్ వేవ్ సమయంలో కోవిడ్ సోకిన వారిలోనే ఎక్కువగా దుష్ఫలితాలు కనిపిస్తున్నట్లు వైద్యులు అభిప్రాయ పడుతున్నారు.


తుంటి కీళ్ల సమస్యలు కూడా

కోవిడ్ సోకిన వారిలో రక్తనాళాల్లో గడ్డలు ఏర్పడి రక్తప్రసరణకు ఆటంకం ఏర్పడుతుంది. ఇతర ఎముకలకు రెండు రక్తనాళాల ద్వారా రక్తప్రసరణ జరుగుతుంది. కానీ తుంటి ఎముకకు ఒకే రక్తం నాళం ఉంటుంది. ఆరక్త నాళంలో పూడికలు ఏర్పడితే కీలు బాల్‌కు రక్తప్రసరణ జరగదు. దీంతో పోషకాలు అందక పోవడంతో బాల్ డ్యామేజ్ అవుతుంది. ఈవిధమైన సమస్యతో జిల్లా కేంద్రాస్పత్రికి రోగులు వస్తున్నారు. గతంలో ఇటువంటి సమస్యతో వచ్చేవారు ఒకరిద్దరు మాత్రమే, ఇప్పుడు 10 నుంచి 15 మంది వరకు ఉంటుఉన్నారు. కోవిడ్ తగ్గిన తర్వాత కనీసం ఆరు నెలలు రక్తం పలచబడే మందులు వాడాల్సి ఉంటుంది. మందులు సరిగా వాడకపోతే ఇలాంటి దుష్ఫలితాలు కనిస్తాయని వైద్యులు చెబుతున్నారు.

జిల్లాలో కోవిడ్ రోగుల వివరాలు:

ఇప్పటి వరకు 92,384 మంది జిల్లాలో కోవిడ్ బారిన పడ్డారు. వారిలో 91,720 మంది డిశార్జ్ అయ్యారు. ప్రస్తుతం ఏడుగురు చికిత్స పొందుతున్నారు. ఇంతవరకు కోవిడ్ బారిన పడి 657 మంది మరణించారు.

తుంటి కీలు అరిగిపోయిన బాధితులు



సాధారణంగా తుంటి కీలు అరిగిపోయిన వారు చాలా అరుదుగా వస్తుంటారు. అయితే పోస్టు కోవిడ్ రోగుల్లో తుంటి కీలు అరిగిపోయిన వారు ఎక్కువగా వస్తున్నారు. తుంటి కీలుకు సరిగా రక్త ప్రసరణ జరగక పోవడంతో పోషకాలు అందదక కీళ్ల డ్యామేజ్ అవుతున్నాయి. ఇలాంటి వారికి రీప్లేస్‌మెంట్ చేయాల్సి ఉంటుంది.

డాక్టర్ పూడి, వంశీకృష్ణ, ఆర్థోపెడిక్ నిపుణుడు

రక్తనాళాల్లో పూడిక



పోస్టు కోవిడ్ రోగుల్లో రక్తనాళాల్లో బ్లాక్స్ కారణంగా గుండెపోటుకు గురవుతున్నారు. కొందరిలో సమస్య చాలా తీవ్రంగా ఉంటుంది. మెదడు రక్తనాళాల్లో, కాళ్ల రక్తనాళాల్లో పూడికలను క్యాథ్‌ల్యాబ్‌లో గుర్తిస్తున్నాం. పోస్టు కోవిడ్ రోగులు డిడైమర్ రక్తపరీక్షతో పాటు ఇతర గుండె పరీక్షలు చేయించుకుంటే మంచిది. కొందరిలో దీర్ఘకాలికంగా దుష్ఫలితాలను చూస్తున్నాం.

డాక్టర్ గొట్టాపు సూర్యప్రకాశ రావు, కార్డియాలజిస్టు

క్లుప్తంగా

నేటి నుంచి ఇంటింటా ధ్యాన కార్యక్రమం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాంలో సోమవారం నుంచి ఇంటింటా ధ్యానం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ప్రతినిధి మొయిద ప్రకాశరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ప్రతిరోజూ సాయంత్రం 7 గంటల నుంచి 9 వరకు ధ్యాన కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. ధ్యానం వల్ల ప్రశాంతత, మానసికోల్లాసం కలుగుతాయన్నారు.

ఆరోగ్యకర జీవన విధానాలు అలవర్చుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వరరావు

విజయనగరం: ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పట్టణానికి చెందిన డాక్టర్ వెంకటేశ్వరరావు సూచించారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని తోటపాలెంలో ఉన్న ఎస్ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో ఆరోగ్య సూత్రాలు- ప్రాముఖ్యత అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఇటీవల కాలంలో జంక్ ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయం, జీర్ణ సంబంధిత ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నట్లు చెప్పారు. వీలైనంతవరకు ప్రతి ఒక్కరూ సాత్వికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు సూర్యలక్ష్మి, ప్రవీణ్ ఆంచాలియా, సుబ్బరాజు, రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి



నరేష్, ఎస్సై

పూసపాటిరేగ: వినాయక ఉత్సవాలకు పోలీసుల అనుమతి తప్పనిసరని ఎస్సై ఎ. నరేష్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ, మంటపాలు ఏర్పాటు చేయాలనుకునే యువత ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. మైక్ అనుమతికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యుత్ శాఖాధికారుల అనుమతి కూడా తీసుకోవాలన్నారు.

అమరవీరుల త్యాగాలను వృథా కానివ్వం



అమరవీరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: విద్యుత్ అమరవీరుల త్యాగాలను వృథా కానివ్వమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎ. జగన్‌మోహన్‌రావు అన్నారు. అమరవీరులు రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ సంతాప సభ ఆదివారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రమణ, సురేష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.


సీపీఎస్ రద్దు చేయాల్సిందే...



నిరసన తెలియజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: సీపీఎస్ రద్దు తప్ప వేరే ప్రత్యామ్నాయం వద్దని, ఓపీఎస్ తప్పనిసరిగా అమలు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక యూత్ హాస్టల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డి. శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంకపల్లి శివప్రసాద్, అర్బన్ ప్రధాన కార్యదర్శి చిట్టి రామునాయుడు, యు. శ్రీనివాసరావు, ఆర్. భాస్కరరావు, ఎన్. లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓగా విజయలక్ష్మి



బంటు విజయలక్ష్మి

చీపురుపల్లి: మండల విద్యాశాఖాధికారి (ఎఫ్ఏసీ)గా బంటు విజయలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ ఎం.జ్యోతి కుమారి నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. నెలిమర్ల బాలికోన్నత పాఠశాలలో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయినిగా విజయలక్ష్మి విధులు నిర్వహిస్తున్నారు. చీపురుపల్లి ఎఫ్ఏసీ ఎంఈఓగా సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇదివరకు ఇక్కడ ఇన్‌చార్జి ఎంఈఓగా పని చేసిన ఎస్. భానుప్రకాష్ గుర్ల ఎంఈఓగా కొనసాగనున్నారు.

జోరుగా ఎండుచేపల వ్యాపారం

- పూసపాటిరేగ సంతలో లక్షలాది రూపాయల వ్యాపారం
- ఇక్కడి నుంచే ఉత్తరాంధ్రలోని వివిధ ప్రాంతాలకు సరఫరా



పూసపాటిరేగ: జిల్లాలోని తీరప్రాంత మండలాలైన పూసపాటిరేగ, భోగాపురం సముద్ర జలాల్లో లభ్యమయ్యే ఎండు చేపలకు మంచి గిరాకీ ఉంది. ఇక్కడ దొరికే ఎండు చేపలను పూసపాటిరేగ జాతీయ రహదారిని ఆనుకుని ప్రతి బుధవారం జరిగే సంతలో విక్రయిస్తుంటారు. ఉత్తరాంధ్రలోని విశాఖ, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి వ్యాపారులు వచ్చి ఎండు చేపలను కొనుగోలు చేస్తుంటారు. పూసపాటిరేగ మండలంలోని చింతపల్లి, పతివాడబర్రిపేట, తిప్పలవలస, తమ్మయ్యపాలెం, కోనాడ... భోగాపురం మండలంలోని చేపలుకంచేరు, ముక్కాం, కొండ్రాజుపాలెం, చోడిపల్లిపేట గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఎండు చేపలను తీసుకువచ్చి విక్రయిస్తారు. సముద్రంలో వేట చేసిన చేపలను సుమారు 10 రోజులు పాటు శుద్ధి చేసి ఎండు చేపలుగా మార్చి విక్రయిస్తుంటారు. వేట చేసిన తర్వాత ఖరీదైన చేపలను అక్కడికక్కడే విక్రయించి, మిగిలిన చేపలను ఉప్పు కలిపిన నీటిలో ఒక రోజు ఉంచిన తర్వాత ఎండలో సుమారు 10 రోజుల పాటు ఎండబెట్టి సంతకు తరలిస్తుంటారు.

శిథిలావస్థకు ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు..

పూసపాటిరేగ మండలం చింతపల్లి, భోగాపురం మండలం ముక్కాం గ్రామాలలో ప్రభుత్వం నిర్మించిన ఫిష్‌ల్యాండింగ్ కేంద్రాలు ఉన్నాయి. పదేళ్ల కిందట సుమారు రెండు కోట్ల రూపాయలతో నిర్మించిన కేంద్రాలు నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. తాజాగా చింతపల్లికి మరో ఫిష్‌ల్యాండింగ్ కేంద్రం మంజూరైంది. మత్స్యకారులకు అవసరమైన ఫిష్‌ల్యాండింగ్ కేంద్రాలు వినియోగంలోకి తీసుకువస్తే ఎండు చేపల వ్యాపారంతో మరంత అభివృద్ధి చెందవచ్చునని మత్స్యకారులు ఆకాంక్షిస్తున్నారు.

రాష్ట్రం నలుమూలలా..

> పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో లభ్యమైన ఎండు చేపలను రాష్ట్రం నలుమూలలకూ ఎగుమతి చేస్తుంటాం. పూసపాటిరేగ సంతకు సుదూర ప్రాంతాల నుంచి ఎండు చేపలు కొనుగోలు చేయడానికి వ్యాపారులు వస్తుంటారు. ప్రతి వారం టన్నుల కొలది ఎండు చేపలు లారీల ద్వారా ఎగుమతి అవుతుంటాయి.
>
> వి. అప్పన్న , మత్స్యకారుడు తిప్పలవలస.

త్వరలో వినియోగంలోకి ..



> మత్స్యకారులకు అవసరమైన ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు వినియోగంలోకి తీసుకువస్తాం. కేంద్రాల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత కేంద్రాల నిర్వహణపై దృష్టి సారిస్తాం.
>
> – నిర్మలాకుమారి, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయనగరం

నంబర్ ప్లేట్లు తీసేసి..!

- నగర పంచాయతీలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



నంబర్ ప్లేటు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ఆటో

నెల్లిమర్ల: చిత్రంలోని వాహనాన్ని చూడండి.. నంబర్ ప్లేట్ లేకుండా ఉంది కదా. పట్టణ పరిధిలో ఇటీవల ఇటువంటి వాహనాల రాకపోకలు ఎక్కువగా జరుగుతున్నాయి. విషయంలోకి వెళ్తే.. చంపావతి నది నుంచి అక్రమంగా ఇసుక సేకరిస్తున్న అక్రమార్కులు ఇటువంటి నంబర్ ప్లేట్లు లేని వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలించేస్తున్నారు. పట్టణ పరిధిలోని విజయనగరం – పాలకొండ ప్రధాన రహదారిలో ఎక్కువగా ఇటువంటి వాహనాలు కనిపిస్తున్నాయి. పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ అధికారుల కళ్ల ముందు నుంచే నంబర్ ప్లేట్లు లేని వాహనాల్లో ఇసుక తరలిపోతున్నా ఎటువంటి చర్యలు లేవని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాల వల్ల నదిలోని తాగునీటి పథకాలకు ముప్పు పొంచి ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు, ఎస్ఈబీ, రెవెన్యూ అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

మట్టి వినాయకుడినే పూజించాలి



మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్న కోలగట్ల శ్రావణి

- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: పర్యావరణ హితాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పిలుపునిచ్చారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్‌లో విజయదుర్గ యూత్ సొసైటీ ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా ఫౌండర్ అధ్యక్షులు కేశవపట్నం చంద్రకళ ఆధ్వర్యంలో ఆదివారం మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేవారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రావణి మాట్లాడుతూ, మట్టితో చేసిన వినాయక విగ్రహాలను చెరువులు, నదులలో నిమజ్జనం చేయడం ద్వారా కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమవుతాయని చెప్పారు. అందరి భాగస్వామ్యంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు.

కాలుష్యాన్ని నిర్మూలించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. ఈ సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో 300 మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు హారిక, సాయి షణ్ముఖ, ప్రవల్లిక, స్వాతి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి



మాట్లాడుతున్న కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్

- విజయనగరం కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్

విజయనగరం: అందరి సహకారంతో నగరానికి శివారులో ఉన్న 14 డివిజన్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్, డివిజన్ కార్పొరేటర్ శెట్టివీర వెంకట రాజేష్ అన్నారు. డివిజన్ అభివృద్ధికి ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి అన్నివిధాలా సహకరిస్తున్నారని చెప్పారు. డివిజన్ పరిధిలో గల సచివాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గతంలో తమ డివిజన్ వెనుకబడిన ప్రాంతంగా ఉండేదని, ఎమ్మెల్యే కోలగట్ల సహాయ సహకారాలతో మౌలిక సదుపాయాలు కల్పనతో పాటు ఆదర్శ డివిజన్‌కు అవసరమైన అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా స్వామి వివేకానంద ప్రాథమిక పాఠశాలలో అన్ని సదుపాయాలతో పాటు ప్రత్యేక ఆకర్షణగా ఏసీ తరగతి గదులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో ఇదే పాఠశాలలో 80 మంది విద్యార్థులుండగా.. నేడు సుమారు 280 మంది ఉన్నారని చెప్పారు. స్థానిక సచివాలయాన్ని కూడా ఆదర్శంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఇక వైద్యపరంగా మరో అడుగు ముందుకు వేసి కొత్తపేట ప్రాంతంలో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఉత్తరాంధ్రలోనే మొదటిదిగా ప్రారంభించడం కూడా ప్రజల అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కుమ్మరుల కోసం ప్రత్యేకమైన భవంతిని కూడా నిర్మించినట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు ఎస్. రామచంద్రరావు, పొంతపల్లి మురళి, డివిజన్ అధ్యక్షుడు ఇసరపు శ్రీనివాసరావు, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తేజ, విద్యార్థి విభాగం అధ్యక్షుడు సాయిబాబా, పవన్, కల్యాణ్, శ్రీను, పి. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు మేయర్ వెంపడాపు విజయలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగే సమావేశంలో కౌన్సిల్ సభ్యులతో పాటు అన్ని విభాగాలకు చెందిన అధికారులు పాల్గొనాలని కోరారు.

చెత్త పన్ను రద్దు చేయాలి

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రజలకు భారంగా మారిన చెత్తపన్నును వెంటనే రద్దు చేయాలని విజయనగర పట్టణ పౌర సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం స్థానిక కణపాక 46వ వార్డు పరిధిలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు కంది త్రినాథ్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.రమణమ్మ, సీఐటీయూ నగర అధ్యక్షుడు బి. రమణ, వెంకటరావు, తదతరులు పాల్గొన్నారు.

కళాకారులకు ఆహ్వానం

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ప్రదర్శనలు ఇవ్వడానికి ఆసక్తి ఉన్న కళాకారులను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ కిశోర్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సెప్టెంబర్ పదో తేదీ లోపు పైడితల్లి అమ్మవారి దేవస్థానంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

ఆలయ అభివృద్ధికి ఉత్తర్వులు

పైడితల్లి అమ్మవారి చదురుగుడి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని సుమారు కోటిన్నర రూపాయలతో కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఆ స్థలంలో అంతవరకు షాపులు నిర్వహించుకునే యజమానులకు చదరపు అడుగుకు రూ.1200 చొప్పున పరిహారం విడుదల చేసింది. అయితే యజమానుల వినతి మేరకు పరిహారాన్ని రూ. 1500కి పెంచుతూ రాష్ట్ర దేవదాయ శాఖ అదనపు కమిషనర్ టి.చంద్రకుమార్ ఉత్తర్వులు జారీచేశారని ఆలయ ఈఓ కిశోర్‌కుమార్ తెలిపారు.

మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలి



వినాయక మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న రామారావు, తదితరులు

- నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు

నెల్లిమర్ల:

వినాయక చవితి పర్వదినాన ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలని నెల్లిమర్ల నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు పిలుపునిచ్చారు. పట్టణానికి చెందిన శ్రీరామకృష్ణ సేవా సమితి ప్రతినిధి టి. జగన్నాథరాజు ఆధ్వర్యంలో నగరపంచాయతీ పరిధి జరజాపుపేటలో ఆదివారం వినాయక మట్టి ప్రతిమలు, పూజా పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ వైస్ చైర్మన్ రామారావు మాట్లాడుతూ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసే విగ్రహాలను వినియోగించడం వల్ల పర్యావరణానికి తీవ్రమైన ముప్పు ఏర్పడుతుందన్నారు.

ఇటువంటి విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల జల కాలుష్యం అవుతుందని చెప్పారు. రామకృష్ణ సేవా సమితి ప్రతి ఏటా మట్టి ప్రతిమలను పంపిణీ చేయడం అభినందించదగ్గ విషయమని కొనియాడారు. కార్యక్రమంలో నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, గణేష్, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

తూర్పు కాపులను బీసీ-ఏలో చేర్చాలి



సమావేశంలో పాల్గొన్న తూర్పు కాపు సంక్షేమ సంఘ ప్రతినిధులు

- తూర్పు కాపు సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారావు

విజయనగరం ఫూల్‌బాగ్: తూర్పు కాపులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని తూర్పు కాపు సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. రాజారావు కోరారు. ఆదివారం స్థానిక వీటీ అగ్రహారం బీసీ కాలనీలో సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న తూర్పు కాపులందరికీ ఓబీసీ రిజర్వేషన్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పత్తిగుళ్ల వెంకటరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎజ్జిపురపు శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కంది రాము, సభ్యులు పి. ప్రసాద్, డి. శ్రీను, జి. సూరిబాబు, ఎ. త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో పార్టీని మరింత బలోపేతం చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే కడుబండి

లక్కవరపుకోట: నాయకులు,కార్యకర్తలను అంతా సమన్వయం చేసుకుని, సమష్టి కృషితో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేద్దామని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో ఎస్.కోట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విధానమన్నారు. నియోజకవర్గానికి గడిచిన మూడేళ్లలో సంక్షేమం, అభివృద్ధి పనులకు ప్రభుత్వం సుమారు రూ.2,500 కోట్లను వెచ్చించిందని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకువెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. మళ్లీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో పటిష్టమైన మండల, గ్రామస్థాయి కమిటీలు ఏర్పాటు చేసుకుని వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుంచే పనిచేద్దామన్నారు. రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు మాట్లాడుతూ పార్టీ కోసం ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేయాన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు కె.ఎస్.ఎన్.రాజు, అయిదు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే సీఎం జగన్ ధ్యేయం

- ఆర్యవైశ్య మహాసభలో ఎమ్మెల్యే కడుబండి, ఎమ్మెల్సీ రఘురాజు



ఎమ్మెల్యే శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

శృంగవరపుకోట: సమాజంలో అన్నివర్గాల సమున్నత అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని, ఆయన సర్కారులో ఆర్యవైశ్యులకు అంతే ప్రాధాన్యం ఉంటుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. ఆర్యవైశ్య యువజన సంఘం నేతృత్వంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నియోజకవర్గ సమావేశం ఆర్యవైశ్య మహాసభ అధికార ప్రతినిధి ఉప్పల ఈశ్వరరావు అధ్యక్షతన స్థానిక సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. అతిథులు గా హాజరైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు తగిన ప్రాధాన్యం, గౌరవం ఉందన్నారు. సమాజానికి ఆర్యవైశ్యులు వాసవీ క్లబ్‌ల ద్వారా అందిస్తున్న సేవలను ప్రశంసించారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు ఎం.వి.సత్యనారాయణ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి. రాజకీయ, విద్య, వైద్య, సామాజిక, సేవా రంగాల్లో ముందుకు రావాలన్నారు. సభకు హాజరైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సహా మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, జనసేన నేత ఒబ్బిన సత్యనారాయణ తదితరులను సన్మానించారు. ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు హెచ్.నానాజీ, కార్యదర్శి కె.మూర్తి, కోశాధికారి శీనయ్య, బి.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు జి.నాగేశ్వరరావు, సెక్రటరీ బి.నూకరాజు, టి.మోహన్‌రావు, నియోజవర్గ ఇన్‌చార్జి పి.ఈశ్వరరావు ఆర్యవైశ్య యువజన సంఘ సభ్యులు, నియోజకవర్గ ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

గురుదేవా ట్రస్టు సేవలు అమోఘం

లక్కవరపుకోట (కొత్తవలస): కొత్తవలస మండలంలోని మంగళపాలెం గ్రామ సమీపంలోఉన్న శ్రీగురుదేవా చారిట బుల్ ట్రస్టు దివ్యాంగులకు అందిస్తున్న సేవలు అమోఘమని తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ అధికార ప్రతినిధి, ఎస్.వేణుగోపాలాచారి కొనియాడారు. ట్రస్టు ఆధ్వర్యంలో 30 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు, చేతులు, పోలియో కాలిపర్స్, బ్లైండ్ స్టిక్‌లను ఆదివారం అందజేశారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన వేణుగోపాలాచారి మాట్లాడుతూ పేదప్రజలు, దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేస్తున్న ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబును ఆయన అభినందించారు. దివ్యాంగులకు సమకూర్చుతున్న కృత్రిమ అవయవాల తయారీకి తనవంతు సహాయం అందజేస్తామని తెలిపారు. ట్రస్టు హాస్పిటల్ సీఈఓ డాక్టర్ అచ్యుతరామయ్య, డాక్టర్ శ్రావ్య, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

● తెలంగాణ

సంక్రాంతికే తెలంగాణ కొత్త సచివాలయం!

- దసరా ముహూర్తానికి అడ్డొచ్చిన పెద్ద గుమ్మటాల పనులు
- అదనంగా మూడు నెలల గడువు కోరిన నిర్మాణ సంస్థ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కొత్త సచివాలయ భవనం వచ్చే ఏడాది జనవరి నాటికి సిద్ధం కాబోతోంది. ఈ దసరా నాటికే పూర్తిచేసి ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించినా.. ప్రధాన పెద్ద గుమ్మటాల పనుల్లో ఆలస్యం వల్ల జాప్యం జరిగే పరిస్థితి నెలకొంది. పూర్తిస్థాయిలో సిద్ధం చేసేందుకు మరో మూడు నెలల గడువు కావాలని నిర్మాణ సంస్థ కోరినట్లు తెలిసింది. ఇటీవల సీఎం కేసీఆర్ కొత్త సచివాలయ పనులను తనిఖీ చేసిన సందర్భంగా అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో ఈ అంశంపై చర్చ జరిగింది. దసరా నాటికి సచివాలయాన్ని ప్రారంభించాలని సీఎం పేర్కొనగా.. ఆలోగా భవనం పైభాగంలో పలు పనులు పూర్తయ్యేలా లేవని నిర్మాణ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారని తెలిసింది. అయితే కేవలం పైభాగంలో కొన్నిపనులే జరగాల్సి ఉన్నందున, దసరా నాటికి కొత్త సచివాలయాన్ని ప్రారంభించుకోవచ్చని, పైభాగంలో పనులతో పెద్దగా ఇబ్బంది ఉండదని నిర్మాణ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నట్టు సమాచారం. మూడు నెలలు సమయమిస్తే అన్ని పనులు పూర్తి చేస్తామని చెప్పినట్టు తెలిసింది.

తెలంగాణ మంత్రి నివాసంలో హౌస్ కీపర్ ఆత్మహత్య

ప్రేమ వ్యవహారమే కారణం

వేల్పూర్: నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఆర్ అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నివాసంలో హౌస్ కీపర్‌గా పనిచేసే ఇంటినుక దేవేందర్ (18) అనే యువకుడు శనివారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రేమ వ్యవహారమే అతని బలవన్మరణానికి కారణమని ఏసీపీ ప్రభాకరరావు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. మంత్రి ప్రశాంత్‌రెడ్డి నివాసంలో ఇద్దరు హౌస్ కీపర్లు పనిచేస్తున్నారు. మరో హౌజ్ కీపర్ గంగారాం.. బంధువు అంత్యక్రియల్లో పాల్గొనడానికి శనివారం వేరే గ్రామానికి వెళ్లగా.. దేవేందర్ మంత్రి ఇంట్లోనే ఉన్నాడు. ఆదివారం ఉదయం తిరిగి వచ్చిన గంగారాం ఎంత పిలిచినా దేవేందర్ స్పందించకపోవడంతో చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి చూడగా కింది అంతస్తులోని మంత్రి కార్యాలయంలో ఫ్యాన్‌కు వేలాడుతూ దేవేందర్ మృతదేహం కనిపించింది.

‘జయలక్ష్మి’ లెక్క రూ.560 కోట్లు

- 29 బ్రాంచీల్లో ఖాతాల పరిశీలన
- రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20 వేల మంది బాధితులు
- సహకార కమిషనర్‌కు కమిటీ నివేదిక
- కొత్త పాలక వర్గానికి అక్టోబర్ 9న ఎన్నిక

సాక్షి ప్రతినిధి, కాకినాడ: డిపాజిటర్లకు కుచ్చుటోపీ పెట్టి బోర్డు తిప్పేసిన కాకినాడది జయలక్ష్మి మ్యూచువల్లీ ఎయిడెడ్ మల్టీపర్పస్ (ఎంఏఎం) కోఆపరేటివ్ సొసైటీ పాలకవర్గం అవినీతి లెక్క తేలింది. డిపాజిటర్ల సొమ్ము సుమారు రూ.560 కోట్ల మేర దారి మళ్లించినట్లు వెల్లడైంది. జయలక్ష్మి పాలకవర్గం అక్రమాల బాగోతాన్ని సహకార శాఖ అధికారుల బృందం నిగ్గు తేల్చింది. దాదాపు మూడు నెలలకుపైగా రాష్ట్రవ్యాప్తంగా 29 బ్రాంచీల్లో ఖాతాలను పరిశీలించి తుది నివేదికను సహకార శాఖ కమిషనర్ బాబు అహ్మద్ పరిశీలనకు పంపారు.

వడ్డీ ఎరవేసి..

ఆకర్షణీయంగా 12.5 శాతం వడ్డీని ఎర వేయడంతో జయలక్ష్మి సొసైటీ బ్రాంచిల్లో సుమారు 20 వేల మంది రిటైర్డ్ ఉద్యోగులు, ఉద్యోగులు, వ్యాపారులు, సీనియర్ సిటిజన్లు, మహిళలు రూ.కోట్లలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేశారు. గడువు తీరినా డబ్బులు చెల్లించకపోవడంతో జయలక్ష్మి సొసైటీ బాగోతం గత ఏప్రిల్ 6న వెలుగులోకి వచ్చింది. బాధితుల ఫిర్యాదులతో చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్‌పర్సన్ విశాలాక్షి తదితరులపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. పోలీసులతో పాటు సీబీసీఐడీ


కాకినాడ సర్పవరం జంక్షన్ వద్ద జయలక్ష్మి సొసైటీ మెయిన్ బ్రాంచ్

పోలీసులు కూడా విచారణ చేపట్టారు. బాధితుల ఆక్రందన ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించింది. సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు, నలుగురు అసిస్టెంట్ రిజిస్ట్రార్లతో కూడిన కమిటీ ఏప్రిల్ 20 నుంచి విచారణ చేపట్టి అనేక అవకతవకలు గుర్తించింది. చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్‌పర్సన్ విశాలాక్షి కనుసన్నల్లోనే ఈ మొత్తం కుంభకోణం జరిగినట్టు నివేదికలో పొందుపరిచారు. డిపాజిటర్ల ఖాతాల నుంచి రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్ల వరకూ వైస్ చైర్‌పర్సన్, కుటుంబ సభ్యుల పేరిట మళ్లించినట్టు కమిటీ తేల్చింది. రుణాలకు ఎటువంటి హామీ పత్రాలూ లేవు. ఆంజనేయులుకు వరుసకు మేనల్లుడు అయిన ఓ వ్యక్తికి ఎటువంటి పూచీకత్తు లేకుండా రూ.70 కోట్ల వరకూ డబ్బులు మళ్లించారు. మరోవైపు పాలకవర్గంలో మెజారిటీ సభ్యులు డిపాజిటర్ల సొమ్ములను సొంతానికి వాడుకున్నారు. మరి కొందరికి ఎలాంటి హామీ లేకుండా రూ.200 కోట్ల వరకూ బదలాయించినట్టు గుర్తించారు. వైస్ చైర్‌పర్సన్ సమీప బంధువుకు సినిమా నిర్మాణం పేరుతో హామీ లేకుండా రూ.50 కోట్లు ఇచ్చేశారు. సర్పవరం మెయిన్ బ్రాంచి లెడ్జర్‌లో కొన్ని పేజీలు మాయమయ్యాయని నివేదికలో ప్రస్తావించినట్టు సమాచారం.

అక్టోబరు 9న పాలకవర్గ ఎన్నికలు

సహకార శాఖ గత నెల 23న జయలక్ష్మి సొసైటీకి అడ్‌హాక్ కమిటీని నియమించింది. ఈ కమిటీ స్థానంలో కొత్త పాలకవర్గం ఎన్నిక జరపాలని నిర్ణయించారు. ఈ మేరకు అడ్‌హాక్ కమిటీ చైర్మన్ సుబ్బారావు ప్రొసీడింగ్స్ ఇచ్చి ఎన్నికల అధికారిగా రిటైర్డ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆర్‌ఎస్ సుధాకర్‌ను నియమించారు. బోర్డు డైరెక్టర్లు, ఆఫీసు బేరర్ల నియామకానికి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. అక్టోబరు 9న పాలకవర్గ ఎన్నిక నిర్వహించి మర్నాడు ఫలితాలు ప్రకటిస్తారు. ఏకగ్రీవం అయితే అక్టోబర్ 2న పాలకవర్గాన్ని ఎన్నుకుంటారు. లేకపోతే 9న పోలింగ్ నిర్వహిస్తారు. జయలక్ష్మి సొసైటీ కుంభకోణంపై కొత్తగా ఎన్నికయ్యే పాలకవర్గం చర్చించి డిపాజిటర్లకు అండగా నిర్ణయం తీసుకోనుంది.

విచారణ పూర్తి



జయలక్ష్మి సొసైటీలో జరిగిన అవకతవకలపై నివేదికను ఉన్నతాధికారులకు పంపించాం. కొత్త పాలకవర్గం ఎన్నికకు అడ్‌హాక్ కమిటీ చైర్మన్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఏకగ్రీవం కాకుంటే పోలింగ్ నిర్వహిస్తాం.

– ఆర్.దుర్గాప్రసాద్, జిల్లా సహకార అధికారి, కాకినాడ

2,783 గ్రామాల్లో డీజీపీఎస్ పరికరాలతో రీ సర్వే

- ఈ గ్రామాల్లో 28.50 లక్షల ఎకరాలు
- 4 ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలిచిన సర్వేశాఖ

సాక్షి, అమరావతి: జీపీఆర్‌ఎస్ సిగ్నల్స్ అందని 2,783 గ్రామాల్లో ప్రభుత్వం డీజీపీఎస్ పరికరాల ద్వారా భూముల రీ సర్వే చేపట్టింది. కొన్ని గ్రామాల్లో ఈ సర్వే మొదలైంది. డ్రోన్లు, జీఎన్‌ఎస్‌ఎస్ రోవర్ల ద్వారా అత్యంత ఆధునికమైన హైబ్రిడ్ టెక్నాలజీతో సర్వే సెటిల్మెంట్ శాఖ రీ సర్వేలో భాగంగా భూములను కొలుస్తోంది. ఇందుకోసం జీఎన్‌ఎస్‌ఎస్ నెట్‌వర్క్ ద్వారా 70 సీవోఆర్‌ఎస్ (కంటిన్యుయస్లీ ఆపరేటింగ్ రిఫరింగ్ స్టేషన్స్) బేస్‌స్టేషన్లను శాశ్వతపద్ధతిలో ఏర్పాటు చేసింది. శాటిలైట్ల ద్వారా వచ్చే జీపీఆర్‌ఎస్ సిగ్నల్స్ ఆధారంగా జీఎన్‌ఎస్‌ఎస్ నెట్‌వర్క్ ద్వారా ఈ కేంద్రాలు 24 గంటలు పనిచేస్తున్నాయి. కానీ కొండలు, దట్టమైన అటవీప్రాంతాల్లో జీపీఆర్‌ఎస్ సిగ్నల్స్ రాకపోవడం వల్ల సీవోఆర్‌ఎస్ నెట్‌వర్క్ ద్వారా రోవర్లు సరిగా పనిచేయడంలేదు. ఇలాంటి ప్రాంతాల్లో డీజీపీఎస్ పరికరాల ద్వారా రేడియో మోడ్‌లో రీ సర్వే చేయనున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కృష్ణా, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని 189


డీజీపీఎస్ పరికరాలతో సర్వేను ప్రారంభించిన రెవెన్యూ అధికారులు

మండలాల్లో 2,783 గ్రామాల్లో జీపీఆర్‌ఎస్ సిగ్నల్స్ సరిగా రావడంలేదని గుర్తించారు. ఈ గ్రామాల్లో 28.50 లక్షల ఎకరాలను రీ సర్వే చేయాల్సి ఉంది. అత్యధికంగా ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన 1,809 గ్రామాల్లో సిగ్నల్స్ అందడంలేదని గుర్తించారు. మొత్తం 2,783 గ్రామాల్లో ప్రైవేటు ఏజెన్సీల ద్వారా డీజీపీఎస్ ద్వారా రీ సర్వే చేయాలని నిర్ణయించారు. ఈ గ్రామాలను నాలుగు ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలిచారు. అత్యధిక గ్రామాలున్న ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ప్యాకేజీ-1కి టెండర్ల ప్రక్రియ ముగిసింది. విశాఖకు చెందిన జియోకాన్ సర్వేస్, విశాఖకు చెందిన సిల్వర్ టెక్నో సొల్యూషన్స్ కంపెనీలు ఈ టెండరు దక్కించుకున్నాయి. ఈ రెండు కంపెనీలు పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలంలోని ఆరుగ్రామాల్లో కొద్దిరోజుల కిందట ప్రయోగాత్మక సర్వేని విజయవంతంగా నిర్వహించాయి. రెండురోజుల కిందట ఈ గ్రామాల్లో డీజీపీఎస్ సర్వేను ప్రారంభించాయి. మిగిలిన మూడు ప్యాకేజీలకు త్వరలో టెండర్లు ఖరారు చేయనున్నారు.

అక్టోబర్ 31 నుంచి షార్జా-విజయవాడ విమానం

- నేరుగా వారానికి రెండుసార్లు నడపనున్న ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్
- మూడున్నరేళ్ల తర్వాత పూర్తిస్థాయి అంతర్జాతీయ విమాన సర్వీస్‌లు

గన్నవరం: సుమారు మూడున్నరేళ్ల తర్వాత విజయవాడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (గన్నవరం) నుంచి పూర్తిస్థాయిలో అంతర్జాతీయ విమాన సర్వీస్‌లు ప్రారంభం కానున్నాయి. కోవిడ్ పస్ట్‌వేవ్ తర్వాత నుంచి ఇప్పటివరకు వందేభారత్ మిషన్‌లో భాగంగానే ఇక్కడికి సర్వీస్‌లు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో యునైటెడ్ అరబ్ ఎమిరెట్స్ (యూఏఈ)లోని షార్జా-విజయవాడ మధ్య వారానికి రెండు డైరెక్ట్ విమాన సర్వీస్‌లు నడిపేందుకు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ముందుకొచ్చింది. షెడ్యూల్‌ను ప్రకటించడంతోపాటు టికెట్ల బుకింగ్‌ను కూడా ప్రారంభించింది. అక్టోబర్ 31వ తేదీ నుంచి ప్రతి సోమ, శనివారాల్లో షార్జా-విజయవాడ మధ్య ఈ సర్వీస్‌లు నడవనున్నాయి. 186 మంది ప్రయాణికుల సామర్థ్యం కలిగిన బోయింగ్ 737-800 విమానం భారతీయ కాలమానం ప్రకా



రం షార్జాలో మధ్యాహ్నం 1.40 గంటలకు బయలుదేరి సాయంత్రం 5.35 గంటలకు ఇక్కడికి చేరుకుంటుంది. తిరిగి సాయంత్రం 6.35 గంటలకు ఇక్కడ బయలుదేరి రాత్రి 10.35 గంటలకు షార్జా చేరుకుంటుంది. ఇక్కడి నుంచి షార్జాకు ప్రారంభ టికెట్ ధరను రూ.15,069గా నిర్ణయించారు. ఈ సర్వీస్ ప్రారంభమైతే ఇక్కడి నుంచి అరబ్ దేశాలకు ప్రయాణికుల రాకపోకలు గణనీయంగా పెరగవచ్చని ఎయిర్‌పోర్ట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

అంతర్జాతీయ ప్రయాణానికి ఊతం

ఈ విమానాశ్రయానికి 2017 మే నెలలో కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ హోదా కల్పించింది. 2019లో ఆరునెలల పాటు విజయవాడ-సింగపూర్ మధ్య నడిచిన వారానికి ఒక సర్వీస్ సాంకేతిక కారణాలతో రద్దయింది. తర్వాత దుబాయ్, సింగపూర్‌కు అంతర్జాతీయ విమాన సర్వీస్‌లు నడిపేందుకు జరిగిన ప్రయత్నాలు కోవిడ్ పరిస్థితులతో నిలిచిపోయాయి. కేవలం వందేభారత్ మిషన్‌లో భాగంగా ఇక్కడి నుంచి ఒమన్ రాజధాని మస్కట్‌కు వారానికి ఒక సర్వీస్, షార్జా, కువైట్, మస్కట్‌ల నుంచి వారానికి ఐదు సర్వీస్‌లు ఇక్కడికి నడుస్తున్నాయి. ఇటీవల అంతర్జాతీయ విమాన సర్వీస్‌లపై కేంద్రం నిషేధం ఎత్తేయడంతో ఇక్కడి నుంచి పూర్తిస్థాయిలో విదేశాలకు సర్వీస్‌లు నడిపేందుకు సన్నహాలు ప్రారంభమయ్యాయి. షార్జా-విజయవాడ మధ్య పూర్తిస్థాయి విమాన సర్వీస్‌లు అందుబాటులోకి రానుండడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సర్వీస్ వల్ల యూఏఈలోని షార్జాతో పాటు దుబాయ్, అబుదాబి, అజ్మన్, ఫుజీరా, రస్ ఆల్ ఖైమా నుంచి ఇక్కడికి సులభంగా రాకపోకలు సాగించొచ్చు. అంతేగాకుండా గల్ఫ్‌లోని పలు దేశాలకు వెళ్లేందుకు షార్జా నుంచి సులభమైన కనెక్టివిటీ సదుపాయం కూడా ఉంది. భవిష్యత్‌లో ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా దుబాయ్, కువైట్‌ల నుంచి ఇక్కడికి పూర్తిస్థాయిలో సర్వీస్‌లు నడిపేందుకు ఎయిర్‌లైన్స్ సంస్థలు ప్రయత్నాలు చేస్తున్నాయి.

పుష్‌అప్స్‌తో గిన్నిస్..



జిమ్‌లో వ్యాయామాలు చేసే అలవాటు ఉన్న వారు అలవోకగా పుష్‌అప్స్ చేయడం కామనే.. కానీ ఇప్పటివరకు జిమ్‌కే వెళ్లని ఓ బక్క పలచని యువకుడు మాత్రం పుష్‌అప్స్‌లో గిన్నిస్ రికార్డు కొల్లగొట్టాడు. పంజాబ్‌లోని గుర్‌దాస్‌పూర్ జిల్లాకు చెందిన కువర్ అమృత్‌బీర్‌సింగ్ అనే 20 ఏళ్ల యువకుడు కేవలం నిమిషం వ్యవధిలో ఏకంగా 45 పుష్‌అప్స్ (వేళ్లతో చప్పట్లు కొడుతూ) చేసి ఈ ఘనత సాధించాడు. ఇందుకోసం అతను కొంతకాలంగా పెద్ద కసరత్తే చేశాడు. ఉదయాన్నే 4 గంటలకు నిద్రలేచే అలవాటున్న అమృత్‌బీర్‌సింగ్ ఉదయం, సాయంత్రం వేళల్లో రెండేసి గంటలపాటు పుష్‌అప్స్ చేయడాన్ని ప్రాక్టీస్ చేశాడు. గిన్నిస్ ప్రతినిధుల సమక్షంలో ఈ ఫీట్‌ను చేసి చూపించగా తాజాగా ఈ రికార్డును ధ్రువీకరిస్తూ గిన్నిస్ నిర్వాహకులు సర్టిఫికెట్ పంపారు. ఫిట్‌నెస్ కోసం తాను ఎటువంటి ప్రొటీన్ సప్లిమెంట్లు వాడలేదని... కేవలం ఇంటి భోజనాన్నే తీసుకున్నానని చెప్పాడు. డైట్‌లో భాగంగా నిత్యం పాలు, పెరుగు, నెయ్యి, వెన్న తీసుకుంటానన్నాడు. క్రీడాకారుడైన తన తండ్రి నుంచి స్ఫూర్తి పొందే ఈ రికార్డు సాధించానన్నాడు.


వాలీబాల్ సాధనలో క్రీడాకారులు

క్రీడా వికాసం


కోడిరామ్మూర్తి స్టేడియం నిర్మాణ పనులు

- జిల్లాలో తుది దశలో క్రీడావికాస కేంద్రాలు
- త్వరలో కోడి రామ్మూర్తి స్టేడియం పనుల పునఃప్రారంభం
- క్రీడా రంగానికి ప్రభుత్వం చేయూత
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడా ప్రగతిలో సిక్కోలు దూసుకుపోతోంది. జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో చేపడుతున్న క్రీడావికాస కేంద్రాల నిర్మాణాలు తుది దశలో ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం పనులు త్వరలో పునఃప్రారంభం కానున్నాయి. వైఎస్సార్ క్రీడా పురస్కారాల పేరిట క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందుతున్నాయి. మరోవైపు గ్రామ/వార్డు సచివాయాల పరిధిలో విలేజ్ స్పోర్ట్స్ క్లబ్‌లు ఏర్పాటవుతున్నాయి. గతంతో పోల్చితే ప్రస్తుతం క్రీడా రంగానికి మంచి రోజులు వచ్చాయన్న అభిప్రాయం అన్ని వర్గాల్లోనూ వ్యక్తమవుతోంది.

క్రీడావికాస సేడియాల నిర్మాణం..

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో పది నియోజకవర్గాల్లో క్రీడావికాస కేంద్రాల నిర్మాణానికి 2013 నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అంకురార్పణ చేసింది. ఒక్కో స్టేడియానికి రూ.2.10 కోట్ల చొప్పున కేటాయింపు చేసింది. అనంతరం ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. ఐదేళ్లలో కేవలం జిల్లాలో ఆమదాలవలస, పాతపట్నం, సీతంపేట, టెక్కలిలో మాత్రమే పనులను పూర్తిచేసింది. మిగిలిన నియోజకవర్గ కేంద్రాల్లో చేపడుతున్న పనులు పూర్తిగా నిలిచిపోయాయి. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వాటి నిర్మాణ పనులను వేగవంతం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలో పనులు పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

కేఆర్ స్టేడియం నిర్మాణం

జిల్లాకే తలమానికంగా గుర్తింపు పొందిన కోడిరామ్మూర్తి స్టేడియం ఆధునికీకరణ పనుల నిర్మాణ విషయంలోను గత టీడీపీ ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. 2016 జూన్ 4వ తేదీన చంద్రబాబు స్వయంగా శిలాఫలకానికి శంకుస్థాపన చేసినప్పటికీ.. పనులను మాత్రం మొదలుపెట్టిన పాపాన పోలేదు. ఎన్నికలకు 8 నెలల ముందు పనులు మొదలయాయి. నాటి పాలకులు పట్టించుకోపోవడం, కాంట్రాక్లర్లకు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం, స్టేడియం డిజైన్‌లో మార్పులు చోటుచేసుకోవడంతో పనులు నిలిచిపోయాయి. విషయాన్ని గుర్తించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్రీడాకారులకు బాసటగా నిలిచారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు విజ్ఞప్తితో అదే మైదానంలో ఈ ఏడాది జూన్ 27వ తేదీన జరిగిన అమ్మఒడి మూడో విడత పంపిణీ కార్యక్రమంలో కోడిరామ్మూర్తి స్టేడియం పునఃనిర్మాణానికి అవసరమైన రూ.10 కోట్ల నిధులను కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. దీంతో క్రీడాకారులు, క్రీడాసంఘాల ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.


సిక్కోలు వేదికగా రాష్ట్ర సాఫ్ట్‌బాల్ పోటీల్లో క్రీడాకారుల జోరు

క్రీడాకారులకు ప్రోత్సాహకాలు..

గతంలో జాతీయ స్థాయిలో పేరు సాధిస్తే తప్ప క్రీడాకారులకు గుర్తింపు ఉండేది కాదు. ప్రోత్సహమూ అంతంత మాత్రంగానే ఉండేది. అయితే ఆ పరిస్థితిలో మార్పు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి ప్రాధాన్యత ఇస్తోంది.

నిధులు సమకూర్చడం, మంచి ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఆర్థికంగా ప్రోత్సహించడం, స్పోర్ట్స్ కోటాను పక్కాగా అమలు చేయడం వంటి సంస్కరణలు తీసుకువచ్చింది. ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాల్లో స్పోర్ట్స్ కోటాలో అమలు చేయడంతో జిల్లాలో 130 మంది వరకు క్రీడాకారులు సచివాలయ ఉద్యోగాలకు ఎంపిక కావడం విశేషం. అంతర్జాతీయ, జాతీయ పోటీల్లో నైపుణ్యం ప్రదర్శిస్తున్న వారికి వైఎస్సార్ క్రీడా పురస్కారాలు ప్రదానం చేస్తోంది. వీటన్నింటికి తోడు క్షేత్రస్థాయిలో క్రీడలను మరింతగా విస్తరించాలని భావించి విలేజ్ స్పోర్ట్స్ క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

నేడు జాతీయ క్రీడోత్సవ ర్యాలీ..

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం నగరంలోని 6.30 గంటలకు ర్యాలీని నిర్వహించనున్నారు. పొట్టి శ్రీరాములు జంక్షన్ నుంచి కళింగ రోడ్, వైఎస్సార్ సర్కిల్, పాలకొండ రోడ్ మీదుగా కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణం వరకు ఈ ర్యాలీ కొనసాగనుంది. ఈ సందర్భంగా భారత హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ప్రజాప్రతినిదులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు.

అరసవల్లిలో భాద్రపద సందడి


సూర్య నమస్కార పూజలు నిర్వర్తిస్తున్న పండితులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. భాద్రపద మాసం శుక్ల పక్ష ఆదివారం సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి సైతం భక్తులు తరలివచ్చి ఆరోగ్య ప్రదాతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వందలాది మంది భక్తులు తలనీలాలను సమర్పించుకుని స్వామి దర్శనాలకు బారులు తీరారు.

ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ఆధ్వర్యంలో భక్తులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ఇక అంతరాలయంలో ఆదిత్యునికి ప్రత్యేక అలంకరణ చేసి సర్వదర్శనాలకు ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ చర్యలు చేపట్టారు. వివిధ దర్శన మార్గాల్లో భక్తులు ఆదిత్యున్ని దర్శించుకున్నారు. ఈ మేరకు దర్శనాల టిక్కెట్ల ద్వారా రూ.1,60,600, విరాళాల ద్వారా రూ.86,830 అలాగే ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 2.10 లక్షలు వరకు ఒక్క రోజులో ఆలయానికి ఆదాయం సమకూరినట్లుగా ఈఓ తెలియజేశారు.

ముగిసిన కృష్ణాష్టమి సంబరాలు

శ్రీకృష్ణాష్టమి సంబరాలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. అరసవల్లి శ్రీసూర్యదేవాలయంలో శ్రావణ బహుళ అష్టమి నుంచి భాద్రపద శుక్ల తదియ వరకు జరిగిన ఈ సంబరాలు ఆదివారంతో ముగియడంతో ఉత్సవమూర్తులకు ఘనంగా అర్చన, పూజలను అర్చకులు నిర్వహించారు.

‘కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి’

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఏపీ ఎన్‌జీఓ సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమనాయుడు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్టు ఉద్యోగుల సర్వ సభ్య సమావేశం ఆదివారం శ్రీకాకుళంలోని యూటీఎఫ్ యూనియన్ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎన్‌జీఓ సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చెయ్యాలని కోరారు.

అలాగే కాంట్రాక్టు ఉద్యోగులకు ఎంటీఎస్ కాకుండా జీఓ 217 మరియు జీఓ 459 ప్రకారం వంద శాతం జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్టు సంఘ నాయకులు డి.సాయి ప్రసాద్, మురళి, విజయ్ మరియు జిల్లాలోని వైద్య ఆరోగ్య కాంట్రాక్టు కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చౌదరి పురుషోత్తమనాయుడు

గణేష్ ఉత్సవాల టారిఫ్‌లో ఎలాంటి మార్పులు లేవు

- 2014లో అమల్లోకి వచ్చిన టారిఫ్‌లే కొనసాగుతున్నాయి
- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు వెల్లడి



సాక్షి, విశాఖపట్నం : వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే వినాయక మండపాలకు తాత్కాలిక విద్యుత్ టారిఫ్‌ను పెంచలేదని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు స్పష్టం చేశారు. టారిఫ్ పెంచుతున్నట్లు వస్తున్న వదంతులను ఆయన ఖండించారు. దీనికి సంబంధించి 2014 నుంచి అదే టారిఫ్ ఇప్పటికీ కొనసాగుతోందని స్పష్టం చేశారు. వినాయక చవితి సందర్భంగా గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసే కమిటీలు/భక్తులు విద్యుత్ శాఖ నిబంధనల మేరకు తాత్కాలిక కనెక్షన్లు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వినాయక మండపాలకు 2014 నుంచి అమలులో ఉన్న టారిఫ్ ప్రకారం 1000 వాట్స్‌కు రూ.2,400లు, 1,500 వాట్స్‌కు రూ.3,150లు, 2000 వాట్స్‌కు రూ.3,900లు, 2500 వాట్స్‌కు రూ.4,650లు, 3000 వాట్స్‌కు రూ.5,400లు, 3,500 వాట్స్‌కు రూ.6,150లు, 4000 వాట్స్‌కు రూ.6,900లు, 5000 వాట్స్ కు రూ.8,400లు చెల్లించి తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖ నిబంధనల మేరకు ఈ కనెక్షన్ల ద్వారా పది రోజుల పాటు విద్యుత్ వినియోగించుకోవచ్చని తెలిపారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, కార్యక్రమ నిర్వాహకులు పైన పేర్కొన్న విధంగా విద్యుత్ ఛార్జీలు చెల్లించి సంస్థకు సహకరించాలని సీఎండీ సంతోషరావు కోరారు.

టోల్‌ప్లాజా వద్ద ప్రత్యేక పోలీస్ చెక్‌పోస్టు


కారులో ప్రయాణికులను ప్రశ్నిస్తున్న పోలీసులు

ఎచ్చెర్ల క్యాంపస్: అల్లినగరం టోల్‌ప్లాజా వద్ద పోలీసులు శనివారం రాత్రి ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా వాహనాల రాకపోకలపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఎచ్చెర్ల ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు.

గొర్రెల మందపై దూసుకెళ్లిన కారు

కాశీబుగ్గ: పలాస మండలం శాసనాం గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పన్నెండు మూగజీవాలు మరణించాయి. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఉదయపురంలోని పిన్నింటి తవిటయ్యకు చెందిన 4 మేకలు, 8 గొర్రెలు మారుతీ స్విఫ్ట్ కారు ఢీకొని మృతి చెందాయి. కవిటి మండలం శిలగాం గ్రామానికి చెందిన చెన్నూరు రవి కారు ఈ మందను ఢీకొంది. మూగజీవాల మృతదేహాలు వందమీటర్ల మేర చెల్లాచెదురుగా పడిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. సంఘటన తెలుసుకుని కాశీబుగ్గ సీఐ శంకరరావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్రాఫిక్‌ను క్లియర్ చేసి జరిగిన సంఘటనపై కేసు నమోదు చేశారు. ఇదే సమయంలో వజ్రపుకొత్తూరు మండలం నుంచి పలాస వస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బాధితుడిని ఓదార్చి ఆదుకుంటామన్నారు.


రోడ్డుపై చెల్లా చెదురుగా మూగజీవాలు

‘బూస్టర్ డోసు వేసుకోండి’

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో కోవిడ్ బూస్టర్ డోస్ వ్యాక్సినేషన్ వేగవంతం చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. దీనిపై ఆయన ఆదివారం ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, వైద్య సిబ్బందితో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో కోవిడ్ వ్యాక్సినేషన్ బూస్టర్ డోసు ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని, వేగవంతం చేయాలని సూచించారు.

‘సెప్టెంబర్ 10లోగా ఈ-క్రాప్ పూర్తి కావాలి’

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో సెప్టెంబర్ 10 లోగా ఈ-క్రాప్ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. ఆయన తన చాంబర్‌లో ఆదివారం జేసీ విజయసునీతతో కలిసి ఆర్డీఓలు, జిల్లా వ్యవసాయ అధికారి, ఉద్యానవన శాఖాధికారి, తహసీల్దార్లు, మండల, గ్రామస్థాయి వ్యవసాయ, ఉద్యానవన అధికారులు, వీఆర్‌ఓలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సెప్టెంబర్ 10న గడువు ముగియనుందని తెలిపారు. కొత్తూరు, నరసన్నపేట, శ్రీకాకుళంలో ప్రగతి తక్కువగా ఉందన్నారు.



విద్యాభ్యాసం, విస్తృత పుస్తక పఠనాల వల్ల పొందే జ్ఞానం ఒకటైతే, మనిషిలో ఉండే సహజమైన గ్రహింపు శక్తి, అవగాహన శక్తి వలన వచ్చే జ్ఞానం మరొకటి. దీనికే ఇంగితం లేదా ఇంగితజ్ఞానం అని పేరు. చదువుకున్న వారిలోనే ఇది ఉండనక్కరలేదు. ఇది ప్రతి మనిషిలో ఉండే ఒక అంతర్లీనమైన ఒక జీవలక్షణం. జీవితంలో మనకు కలిగే అనేక అనుభవాలతో ఈ ఇంగితం మరింతగా పదునెక్కుతుంది. అందుకే ఇది ఎంతో విశిష్టమైంది. చదువుతో నిమిత్తం లేకుండా ప్రతి మనిషి జీవనానికి, జీవితానికి అత్యంత ఆవశ్యకమైనది. ఈ ఇంగితం మనలను అప్రమత్తులను చేసి వ్యవహార దక్షతను పొంచి జీవితం సజావుగా సాగేటట్టు చేస్తుంది.

ఇంగితమూ జ్ఞానమే!

మంచి మాట

విద్యాధికులలో ఉండే జ్ఞానమనే బంగరు పళ్లెరానికి ఇది ఒక గోడ చేర్పు లాంటిది. అనేక శాస్త్రాలను మథించి దాని జ్ఞానామృతాన్ని గ్రోలిన పండితులైనా, తమ జీవితాన్ని నూతన ఆవిష్కరణల కోసమై ధారపోసే శాస్త్రవేత్తలైనా తమ ఇంగితం ఉపయోగించవలసిన అవసరం ఉంటుంది. అలా కానివేళ, వారి జ్ఞానం వారికే కాక మానవాళికే ముప్పు తెస్తుంది. చరిత్ర పుటలు తిరగవేసినా, మన సమకాలీన చరిత్రను పరిశీలించినా ఈ విషయం తేటతెల్లమవుతుంది.

ఒక గురువు తనవద్ద శ్రద్ధతో విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకున్న నలుగురు శిష్యులకు చనిపోయిన వారిని బతికించగల అద్భుత శక్తినిచ్చాడు. అయితే, దానిని అత్యవసరమైనప్పుడు మాత్రమే ఉపయోగించ మని హెచ్చరించి పంపాడు. వారిలో ముగ్గురు మార్గమధ్యంలో ఒక పులి కళేబరాన్ని చూసి వారి అద్భుత శక్తిని ప్రయోగించాలని ఉవ్విళ్ళూరటం, నాలుగవవాడు వారి మూర్ఖత్వానికి వగచి, హితవు పలికి భంగపడి వీరికి దూరంగా వెళ్లి తన ప్రాణాలు దక్కించుకున్న కథ మనకు తెలుసు. ప్రాణాలు కోల్పోయిన ఆ నలుగురు జ్ఞానసంపన్నులే. కాని వారిలో కొరవడిన ఇంగితం ప్రాణం నిలబెట్టుకున్న వాడిలో మెండుగా ఉంది. అలాగే పరస్త్రీని తాకకూడదన్న ధర్మాన్ని మనసులో స్థిరరచుకున్న ఒక శిష్యుడు ప్రవాహంలో కొట్టుకుపోతున్న ఒక స్త్రీని రక్షించడానికి ముందుకు రాలేదు. అక్కడ ఆపదలో ఉన్నది ఒక జీవి మాత్రమేనని భావించిన రెండోవాడు ఆమెను కాపాడటానికి కారణం ఇంగితమే. ఇంగితమంటే వివేకమే. ఒకరకమైన యుక్తాయుక్త విచక్షణ. సందర్భోచిత జ్ఞానం. మన చదువుల సారానికి, జీవితానుభవాన్ని విచక్షణాశక్తిని కలిపి చూడగలగటమే ఇంగితం. మన ప్రవర్తనలో, వ్యవహార శైలిలో దానిని చూపగలిగేవారి జీవితం అపార్థాలు, తగాదాలు లేకుండా సాగుతుంది.

వందలాది పక్షులకు ఆశ్రయమిచ్చే ఓపెద్ద చెట్టుకింద కూర్చుని ధ్యానముద్రలో ఉన్నాడో పండితుడు. అపుడో పక్షి విడచిన విసర్జనం అతని తల మీద పడింది. విపరీతమైన కోపమొచ్చిన ఆయన దాని వంక తీక్షణంగా చూసాడు. అంతే! ఆ పక్షి కాలి బూడిదై పోయింది. ఆయనకు సంతోషమూ, గర్వమూ కలిగాయి. అన్ని పక్షులున్న చెట్టు కింద కూర్చుంటే ఆ అనుభవం ఎదురవ్వటం నీరు పల్లానికి వెళుతుందన్న నంత సహజం. ఇంత చిన్న విషయం ఆయనకు తట్టకపోవటానికి కారణం తన ఇంగితజ్ఞానాన్ని ఉపయోగించ లేకపోవటమే. ఇక్కడ ఇంగితమంటే వివేకమని అర్థం. చాల సహజమైన ఈ ఇంగితజ్ఞానాన్ని ఉపయోగించకపోతే పండితులు, జ్ఞానసంపన్నులు వారి శాస్త్ర సంబంధమైన జ్ఞానాన్ని, సాధన ద్వారా పొందిన జ్ఞానాన్ని ఎలా మట్టిపాలు చేసుకుంటారో చెపుతుందీ ఉదాహరణ.

నిస్సందేహంగా జ్ఞానమే ఆధిక్యమైనది, గొప్పది, విలువైనది. ఈ జ్ఞానాన్ని ప్రదర్శించేటప్పుడు ఒక నియంత్రణాశక్తిగా ఈ ఇంగితం పనిచేయాలి. రివాల్వరు ఉపయోగించగలగటం జ్ఞానం. అయితే, దానిని ఆ సందర్భంలో వాడవలసిన అవసరం ఉందా లేదా అనే సంగతిని మనకు బోధపరచే గొప్ప వజ్జ ఈ ఇంగితం.

ఇంగితమంటే తార్కికత, విచక్షణ, భావోద్వేగాలపై ఒక పట్టు. ఇంగితమంటే మన శక్తియుక్తుల్ని అవసరమైన చోట, తప్పనిసరైన క్షణాన మాత్రమే ఉపయోగించేటట్టు మనల్ని సమాయత్తం చేసే ఒక నిబద్ధత, ఒక అదుపు. అలా కానివేళలలో అది పిచుక మీద బ్రహ్మాస్త్రమే అవుతుంది.

ఒక పండితుడు గణితంలో అపారమైన జ్ఞానాన్ని సంపాదించాడు. విశేషమైన ప్రజ్ఞతో గణితానికి చెందిన ఏ లెక్కనైనా, సమస్యనైనా పరిష్కరించసాగాడు. తన గ్రామంలోనూ, చుట్టుపక్కల గ్రామాలలోనూ అంతటి మేధావి లేడని ఖ్యాతి పొందాడు. పేరు, డబ్బు వచ్చింది. ప్రజలు, ఇంత గణితశాస్త్ర పండితులు ఆయన ప్రజ్ఞాపాటవాలకు ఆశ్చర్యానుభూతికి లోనై ఆయనకు నీరాజనాలిచ్చి సత్కారాలు, సన్మానాలు చేసారు. గణితంలో తనకన్నా ప్రజ్ఞావంతుడు లేడనే అహంకారం ప్రవేశించింది అతనిలో. గర్వం తారస్థాయికి చేరుకొని 'నాతో పోటీపడగలవారెవరైనా ఉన్నారా మీ గ్రామంలో?' అని సవాలు విసరి, తలపడినవారిని ఓడించి, దూషించి అవమానించసాగాడు. ఒకసారి ఒక సాయంసంధ్య వేళలో ఒక గ్రామంలోకి ప్రవేశిస్తున్న సమయాన ఒక పశువుల కాపరి కలిసాడు. ఆ చదువురానివాడితోనూ తన గొప్పతనాన్ని గురించి అతిగా చెపుతూ వెళుతున్నాడు. ఒకచోట ఆ కాపరి తటాలున కిందకు వంగి ఒక గుప్పెడు ఇసుకను తీసుకుని 'అయ్యా, కొంచెం ఇదెంతో లెక్కించి చెప్పగలరా?' అని ఆ గణితశాస్త్ర పండితుణ్ణి అడిగాడు. ఆ ప్రశ్నకాపండితుడి నోటివెంట ఒక క్షణం మాట రాలేదు. ఆలోచన స్తంభించి పోయింది. చివరకు ఆ ఇసుకను లెక్కించలేమన్నాడు.

దానికా పశువులు కాపరి 'సామీ! దీనిని గుప్పెడని కదా అంటారు. ఐదు వేళ్ళు దగ్గరకు చేర్చి తీసుకుంటే చారెడు, రెండు అరచేతులతో తీసుకుంటే దోసెడు, బొటనవేలికి, చూపుడువేలికి మధ్య తీసుకుంటే చిటికెడని కదా అంటారు' అన్నాడు. అంతే ఆ పండితుడికి తన తప్పు తెలిసింది. మామూలు పద్ధతిలోనే ఆ ఇసుకను లెక్కించే యత్నం చేయటం వల్ల సమాధానం చెప్పలేకపోయానని. సహజసిద్ధమైన ఇంగితజ్ఞానాన్ని తను చూపలేకపోయానని అర్థం చేసుకుని తన అహంకారానికి సిగ్గుపడి అతడికి నమస్కరించి ఇంటిముఖం పట్టాడు. నిజానికి ఆ నిరక్షరాస్యుడు పండితుడికి ఏ విషయంలో పోటీనే కాదు.

కాని అతడు పండితుణ్ణి ప్రశ్నించటానికి కారణం అతడి ఇంగితమే. దీనినే మరో కోణం నుండి చూస్తే ఆ పండితుడి గర్వానికి, అనుచిత ప్రవర్తనకు ఆ పశువుల కాపరి ప్రశ్న నిరోధకం. అంతేకాదు. సహజ సిద్ధమైన ఇంగితానికి.. జీవితపరిశీలన, అన్వయం, సందర్భోచిత ఆకళింపు జత కూడితే అది విశేషమైన ప్రజ్ఞ. ఏ పుస్తకాలలో చెప్పని ఏ గురువు నేర్పని విద్య ఇది. ఇంగితమనే పుస్తకంలో జీవితానుభవాలే పుటలు, అధ్యాపకులు.

మనలో సహజంగా ఉండే ఏ అద్భుత శక్తి, మన జీవిత మార్గదర్శి. విద్య వల్ల మరింతగా పదునెక్కాలి. అపుడే మరింతగా ప్రకాశిస్తుంది. ఇంగితమంటే లోకజ్ఞానం. ఇది మన నిత్య వ్యవహారాల నిర్వహణలో సహాయపడుతూ ఉంటుంది. అలాగే కొన్ని ముఖ్య సందర్భాలలో కీలకమైన నిర్ణయాలు తీసుకునే టప్పుడు ఈ ఇంగితం మనకు ఎంతో వెన్నుదన్నుగా ఉంటుంది. ఇంగితం మన 'వివేచనా నేత్రం'

ఇన్ని ఉదాహరణలవల్ల మనం గ్రహించవలసింది ఏమిటి? ఇంగితమంటే ఒకసహజమైన తెలివిడి, లోతైన పరిశీలన, బుద్ధికి, మనస్సుకి గోచరమయ్యే ఒక అద్భుత అవగాహన. చదువుకున్న వారిలో ఉండేవి, ఉండవలసిన లక్షణాలు ఇవే కదూ!

శాస్త్రపరమైన జ్ఞానం అక్షరాస్యులదైతే, నిరక్షరాస్యులది పరిశీలనా గతమైనది. ఇంగితం జ్ఞానమే. అది సహజాతమైనది అన్నారు పెద్దలు.

–బొడ్డపాటి చంద్రశేఖర్,
ఆంగ్లోపన్యాసకులు



గురువాణి

అది మన ఒక్కరిదే కాదు కదా!

సంస్కృత భారతం శాంతి పర్వంలో భీష్మాచార్యులు మనుషులు, ముఖ్యంగా గృహస్థాశ్రమంలో ఉన్నవారు తమ జీవితాల్లో ఆచరించాల్సిన కొన్ని ధర్మ సూక్ష్మాలను అద్భుతంగా వివరించారు. మొదటగా ధర్మాచరణ గురించి చెబుతూ రాగద్వేషాలకు అతీతంగా ఉన్నప్పుడే ధర్మాచరణ సాధ్యం అన్నారు. అంటే రాగము, ద్వేషము .. ధర్మాచరణకు శత్రువులు. ఎప్పుడయితే వీడు నావాడు, వీళ్ళు మన వాళ్ళు కదా, వీళ్ల పట్ల కఠినంగా ఉంటే ఎలా ... అన్న భావన కలిగిందో ధర్మాచరణ దెబ్బతింటుంది. నావారు బాగుండాలి. సుఖంగా ఉండాలి. పరాయి వారు మాత్రం నాశనమయి పోవాలి అన్న ఆలోచన ఎక్కువమందిలో ఉండడం సమాజ దుర్గతికి గుర్తు. నీ వారికి ప్రీతి కలిగించడం కాదు, అందరికీ ప్రీతి కలిగించే విధంగా ప్రవర్తించిన నాడు సమాజం శాంతియుతంగా ఉంటుంది. అలా ఉండాలంటే శాస్త్రం చెప్పినట్లు, ధర్మం చెప్పినట్లు తు.చ తప్పకుండా నడుచుకోవాలి.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అలాగే స్నేహాన్ని ఎప్పుడూ మధ్యలో వదిలి వేయవద్దు. స్నేహం చేసేముందే ఒకటికి వందసార్లు ఆలోచించుకో. స్నేహం అంటేనే కలిసి ఉండుట అని. బయట చెట్టాపట్టాలేసుకుని తిరగడం కాదు. మనసులు కలిసిపోవాలి. దానికేమిటి గుర్తు? నువ్వు సంతోషపడుతుంటే నీ స్నేహితుడు చూసి పొంగిపోవాలి. అలాగే నీవు బాధల్లో నలిగిపోతుంటే... నువ్వు పిలవకుండానే నీకోసం నీ స్నేహితుడు పరుగెత్తుకొచ్చేయాలి. అలాగే నీ బలం నీ స్నేహితుడి బలం కావాలి. నీ స్నేహితుడి బలహీనతలను నువు తుడిచెయ్యగలగాలి. రెండేళ్ళక్రితం వాడు నా స్నేహితుడు...ఇప్పుడు కాదు... అన్న మాటలు రాకూడదు. స్నేహం చేయడం గొప్పకాదు, దానిని నిలబెట్టుకోవడం గొప్ప. స్నేహప్రస్థానం అలా మధురంగా కొనసాగాలి.

ధన సంపాదన చాలా ముఖ్యం... అయితే ఎలా సంపాదిస్తున్నావన్నది దానికంటే ముఖ్యం. నా సంపాదనే నాకు ముఖ్యం, ఆ క్రమంలో ఎవరు ఏమయిపోయినా నాకనవసరం... అన్న ధోరణి మంచిది కాదు. నీ సంపాదన పదిమంది ఏడుపుకు కారణం కారాదు. పదిమందితో కలిసి బాగుపడే ఆలోచనలు చేయాలి. నీ సంపాదన ధార్మికంగా, ఇతరులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించని విధంగా ఉండాలి. కానీ ఒక్కొక్కసారి విస్తృత ప్రయోజనాలకోసం దీనికి మినహాయింపు ఉంటుంది. న్యాయమూర్తి దోషికి శిక్షవేసేటప్పుడు దోషి కుటుంబాన్ని కాక, యావత్ సమాజ శ్రేయస్సు ఆలోచించి శిక్ష విధిస్తాడు. అలాగే సరిహద్దుల వద్ద ఉండే సైనికుడు శత్రువు విషయంలో మరే ఆలోచన లేకుండా తన దేశ భద్రతే ధ్యేయంగా కఠినంగా వ్యవహరిస్తాడు.


అలాగే నీకేవయినా కోర్కెలు కలగవచ్చు. వాటిని తీర్చుకోవడంలో నన్ను కాదనే వాళ్ళెవరు.. అని విర్రవీగకూడదు. అది నిన్ను సంతోషపెడుతుందేమో కానీ, నలుగురిని బాధలకు గురిచేయవచ్చు. తుమ్మెద పువ్వు మీద వాలి తేనె తాగినా, అది పువ్వుకు ఎటువంటి హాని చేయదు. అది హృదయ సౌకుమార్యం. కాళోజీ నారాయణ రావు గారు ఇతరులు కష్టాలు వింటూనే కన్నీరు కార్చేటంతటి సున్నిత మనస్కులు. ఒకరోజు గాలీవాన ఉధృతంగా ఉండగా వాకిలి తలుపు తెరిచాడు. బయట ఒక గ్రామీణ స్త్రీ తడిసి వణుకుతూ చూరు కింద నిలబడి ఉంది. ఎందుకో ఆయన ఆమెను లోపలికి రమ్మనమని పిలవలేని అశక్తతలో తలుపు వేసుకుని లోపలికి వెళ్లిపోయాడు. కొద్దిసేపటికి వారి అమ్మగారు తలుపుతీసి చూసి నివ్వెరపోయి వెంటనే ఆ స్త్రీని లోపలికి తీసుకెళ్ళి పొడిబట్టలిచ్చి సాయపడ్డారు. ''గుర్తొచ్చినప్పుడల్లా నా జీవితంలో నేను తీవ్రంగా సిగ్గుపడే సంఘటన అది'' అని చెప్పుకొని బాధపడేవారు. అదీ హృదయ సౌకుమార్యం. సమాజం మన ఒక్కరిది కాదు. పరులది కూడా అన్న భావన మనల్ని మహాత్ముల్ని చేయకపోయినా ధర్మాత్ముల్ని చేస్తుంది.

సువార్త

రెండింతల అభివృద్ధి సాధ్యమే...

ఆ దినమందు అతడు వారిని దీవించి ఎఫ్రాయిము వలెను, మనష్షే వలెను దేవుడు నిన్ను చేయును గాకని ఇశ్రాయేలీయులు నీ పేరు చెప్పి దీవించెదరనెను (ఆది 48:20). కష్టాలను, చీదరింపులను, భయంకరమైన శ్రమలను దాటుకుంటూ వచ్చిన యోసేపును దేవుడు అపరిమితంగా దీవించడం ప్రారంభించాడు. సొంత అన్నల ద్వారా అతి తీవ్రంగా ద్వేషించబడి తానెరుగని ప్రజలకు అమ్మివేయబడ్డాడు. ఎన్నో ప్రతికూల పరిస్థితులను దాటి యోసేపు ఉన్నతమైన స్థితికి ఎదిగాడు. నా అనేవారు లేని ఐగుప్తులో సర్వశక్తుడైన దేవుడు యోసేపును బహుగా హెచ్చించి అందమైన ఆసెనతును భార్యగా ఇచ్చాడు. అతడు దేవుని చిత్తప్రకారం ఒక కుటుంబీకుడయ్యాడు.

దైవానుగ్రహం వలన యోసేపుకు ఇద్దరు కుమారులు కలిగారు. మొదటివాని పేరు మనష్షే, రెండవవాని పేరు ఎఫ్రాయిము. వారికి పేరు పెట్టే విధానంలో యోసేపు యొక్క నిర్మల హృదయాన్ని అర్థం చేసుకోవచ్చు. మనష్షే అనగా మరచిపోవుట, ఎఫ్రాయిము అనగా రెండింతల అభివృద్ధి. పరిశుద్ధాత్మ దేవుడు సర్వలోకానికి యోసేపు ద్వారా నేర్పించాలనుకుంటున్న పాఠం అద్భుతమైనది.



మనిషి జీవితంలో మరిచిపోవాల్సిన వాటిని మరిచిపోకపోతే రెండంతల అభివృద్ధిని పొందడం సాధ్యమయ్యే పనికాదు. కొంతమంది గత జీవితంలో తమకు కలిగిన నష్టాలు, నిందలు, అవమానాలను పదే పదే గుర్తు చేసుకొంటూ అనారోగ్యాలు కొనితెచ్చుకుంటారు. ప్రతీకారేచ్ఛను, ద్వేషాన్ని గుండెల్లో నింపుకొని తమను పాడుచేసుకుంటారు. ఇతరులు తమకు చేసిన అన్యాయాన్ని అనునిత్యం తలచుకొని కుమిలిపోతుంటారు.

చరిత్రలో సుస్థిరులుగా నిలిచినవారందరూ వారికి కలిగిన కీడును మరచి ముందుకు సాగిపోయినవారే. కలువరి సిలువలో యేసుక్రీస్తు ప్రభువు చేసిన మహోన్నత కార్యం అది కాదా? తనను హింసిస్తున్న వారిపై క్షమాపణ కిరణాలను కురిపించిన కరుణామయుడు యేసుక్రీస్తు. వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించు అని క్రీస్తు ప్రభువు చేసిన ప్రార్థన ప్రతి ఒక్కరికి విశిష్టమైన మాదిరిని ఇచ్చింది. శాపాలను వల్లించాల్సిన పెదవులు క్షమాపణను కురిపించాయి. అదే దేవుని మనస్సు.

విశ్వచరిత్రలో అసలైన విజేత 'హృదయంలో ఉన్న కీడును జయించినవాడే'. కల్మషం లేని మనస్సాక్షిని కలిగియుండుట గొప్ప భాగ్యం. మనష్షే పుట్టిన తర్వాత ఎఫ్రాయీము పుడతాడు. అది యాదృచ్ఛికం కాదు. అది సర్వశక్తుని దివ్య ప్రణాళిక. అభివృద్ధి కోసం వెంపర్లాడుతున్న నీవు ఈ మాటలు చదివాక ఒక్కరినైనా క్షమించగలిగితే నీ అభివృద్ధిని అడ్డుకొనే శక్తి భూమ్మీద ఎవ్వరికీ లేదు. దేవుడు ఆధ్యాత్మికంగా, మానసికంగా, శారీరకంగా నిన్ను అభివృద్ధిలోనికి తీసుకొని వస్తాడు. మొదట నీ స్థితి కొద్దిగా నుండినను తుదకు నీవు మహాభివృద్ధి పొందుతావన్నది లేఖన సత్యం. కీడును మరచి ముందుకు సాగుతావా? మనస్సు నిండా గతంలో జరిగిన నష్టాలకు చోటిచ్చి నీ అభివృద్ధిని నీవే అడ్డుకుంటావా? ఆలోచించు!

– డా. జాన్ వెస్లీ, క్రైస్ట్ వర్షిప్ సెంటర్

ఆధ్యాత్మికథ

భజన ఎందుకు?

ఆశ్రమంలో సత్సంగం జరుగుతోందని తెలుసుకున్న ఓ పాతికేళ్ళ యువకుడు అక్కడికి వెళ్ళాడు. ఆశ్రమ గురువు ఆధ్వర్యంలో 'శిష్యుల సందేహాలు–నివృత్తి' కార్యక్రమం జరుగుతోంది. ఎంతో ఆసక్తిగా పాల్గొన్నాడు ఆ యువకుడు.

వెంటనే భజన ప్రారంభమయ్యింది.

భజన చేయడం నచ్చని ఆ యువకుడు చిన్నగా అక్కడినుంచి వెళ్ళిపోవడం గురువు గమనించాడు. ఎందుకు వెళ్ళిపోతున్నావని ప్రశ్నించాడు. భజన చేయడం తనకు ఇష్టం లేదని, అసలు భజన ఎందుకు చేయాలని శిష్యుడు ఎదురు ప్రశ్న వేశాడు.

అందుకు గురువు నవ్వుతూ ''మనసు చంచలమైనది. **దాన్ని స్థిరంగా ఉంచడం చాలా కష్టమైన విషయం. అది వర్తమానంలో ఉండటానికి ఇష్టపడదు. ఎప్పుడూ గతంలోనో, భవిష్యత్తులోనో ఊగిసలాడుతూ ఉంటుంది. అందుకని భజన లాంటి కార్యక్రమాల్లో పాల్గొంటే చిన్నగా అయినా నిలకడ అవుతుంది. దైవం పట్ల మనసు మళ్ళుతుంది''** అని బదులిచ్చాడు.

'అదెలా జరుగుతుంది?' అన్నట్లుగా ప్రశ్న ముఖం పెట్టాడు.

ఆశ్రమంలోని పెద్ద మర్రిచెట్టు కింద ఓ ఏనుగు గొలుసులతో కట్టబడి ఉంది. గురువు చిన్నగా శిష్యుడిని తీసుకుని ఏనుగు దగ్గరికి వెళ్ళాడు.

అది తన తొండాన్ని నిలకడగా ఉంచక అటూ ఇటూ ఊగిస్తోంది. దాన్నే చూస్తూ నిలబడ్డాడు ఆ యువకుడు. అతడి చేతికి ఓ కర్రనిచ్చి ఏనుగుకి అందించమన్నాడు. గురువు చెప్పినట్లు చేశాడు ఆ యువకుడు. కర్రను పట్టుకున్న ఏనుగు తన తొండాన్ని ఊగించడం కొద్దికొద్దిగా తగ్గించింది. మరి కొద్దిసేపటికి అది తొండాన్ని ఊపడం బాగా తగ్గించింది.

ఆశ్చర్యంగా చూస్తున్న యువకుడితో గురువు చిరునవ్వు నవ్వి ''మామూలు సమయాల్లో ఏనుగు తన తొండాన్ని ఊగించకుండా ఉండలేదు. అదే తొండానికి కర్ర ఇచ్చేసరికి ఊగించడం తగ్గించింది. మనిషి విషయంలో కూడా అంతే. ఎక్కడెక్కడో తిరుగుతున్న మనసును కట్టడి చేయడం అంత సులభమైన పని కాదు. అందుకోసం భజన అనేది భక్తికి ఒక సాధనంగా ఉపయోగపడుతుంది'' అని చెబుతూ అతడి కోసం చూశాడు.

ఆ యువకుడు అక్కడ లేడు. అప్పటికే అతడు భజన బృందంలో లీనమై ఉండటం చూసి మనసులోనే నవ్వుకున్నాడు.




– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

ఇస్లాం వెలుగు

శాంతీ సామరస్యం వెల్లివిరియాలి

ఈనాటి మానవుడు విద్య, విజ్ఞానాలు, పదవి, అధికారం, హోదాల పరంగా ఎంత ప్రగతి సాధించినా, నైతిక, సామాజిక, ఆధ్యాత్మికతల పరంగా తిరోగమనంలోనే పయనిస్తున్నాడు. నేడు సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావం, సద్భావన, మానవీయ విలువలు అడుగంటి పోతున్నాయి. అశాంతి, అలజడులు, అనుమానం, అభద్రతాభావం, అమానవీయం తాండవ మాడుతున్నాయి. కులం పేరుతో, మతం పేరుతో ఉన్మాదం పెరుగుతోంది. సంకుచిత మనస్తత్వం, కులతత్వం, మతోన్మాదం, మూకోన్మాదం దేశంలో పెచ్చరిల్లుతోంది. మంచి, మానవత్వం, శాంతీ, ప్రేమ, సదాచారం, సద్భావన మంటకలిసి పోతున్నాయి. నిజానికి మంచి, మానవత్వానికి మించిన ధర్మం మరొకటిలేదు. మానవత్వాన్ని మంటగలుపుతూ, ధర్మాన్ని రక్షిస్తున్నామనుకోవడం కంటే మూర్ఖత్వం మరొకటి ఉండదు. దేవుని పేరుతో దానవత్వం మానవతకు వ్యతిరేకం. భువిపై మానవ ఉనికి మానవత్వాన్ని కాపాడడానికి, సమాజంలో సామరస్యాన్ని, సద్భావనను పెంపొందించడానికేనని ధర్మం చెబుతోంది. మానవీయ విలువల కోసం పాటుబడే వారికి ప్రతిఫలం ప్రసాదించే దైవం శాంతీ, సామరస్యాలకు తూట్లు పొడుస్తూ మానవత్వాన్ని ఖూనీ చేసేవారిని ఊరికే వదలడు.

ఎప్పుడైతే మానవుడు సాటిమనిషి గురించి ఆలోచించడం, అతని యోగక్షేమాలు పట్టించుకోవడం, సత్సంబంధాలు నెరపడం, సద్భావనతో, సామరస్యంతో మసలుకోవడం మానేశాడో అప్పుడే సమాజం పెడద్రోవ పట్టింది. మానవ హృదయంలో అతి పవిత్రంగా ఉండవలసిన మానవత్వానికి తుప్పు పట్టింది. హృదిలో స్వార్థం పురుడు పోసుకొని ఉన్మాద లక్షణాలు ప్రస్ఫుటమయ్యాయి. తత్ఫలితంగా మానవ సమాజంలో అనేక అవలక్షణాలు చోటుచేసుకున్నాయి. శాంతి భద్రతలు కరువైపొయ్యాయి. న్యాయం ప్రియమైపోయింది. కులతత్వం పెచ్చరిల్లింది. మతోన్మాదం పడగవిప్పింది. తీవ్రవాదం, ఉగ్రవాదం జూలువిదిల్చాయి. మతం, మానవతావాదం మంటగలిశాయి. శాంతి, సామరస్యం, సదాచారం, సహజీవనం, సద్భావన, ప్రేమ, మానవీయతలకు విఘాతం కలిగింది. నిజానికి మత విశ్వాసం మానవులు శాంతియుతంగా, సామరస్యంతో, సోదరభావంతో, సద్భావనతో సహజీవనం చేయడానికి దోహదపడాలి. మనుషుల మధ్య విద్వేషాలు సృష్టించడానికి అది సాధనం కాకూడదు. భిన్నత్వంలో ఏకత్వం గల మన దేశంలో సర్వమానవ సహిష్ణుతాభావం, పరస్పర సదవగాహన, సద్భావన జన సామాన్యంలో అంతర్వాహినిలా ప్రవహించాలి. శాంతి, ప్రేమ, సహనం, సంయమనం, సహజీవనం లాంటి సుగుణాలు జనించాలి. కులమతాలు వేరైనా మానవత రీత్యా మనదంతా పరస్పరం రక్త సంబంధమన్న పచ్చినిజాన్ని గుర్తించాలి. ఒకరినొకరు, ఒకరి మతాన్నొకరు గౌరవించుకుంటే మనుషులమధ్య, మనసుల మధ్య దూరాలు, వైరాలు తగ్గి మతసామరస్యం వెల్లివిరుస్తుంది. శాంతి, ప్రేమ, సామరస్యం, సద్భావన, మానవీయత పరిఢవిల్లుతాయి. విశ్వమానవ సౌభ్రాతృత్వం ఆవిష్కృతమవుతుంది. సంఘ శ్రేయోభిలాషులు, ఆధ్యాత్మిక పెద్దలు, సామాజిక కార్యకర్తలు, మంచిని, శాంతిని, మానవతను కాంక్షించే ప్రతి ఒక్కరూ ఏకతాటిపై నిలిచి, కలిసి కృషి చేస్తే, సమాజంలో శాంతీ సామరస్యాలను, సోదర భావాన్ని, సద్భావనను పెంపొందించుకోవడం, మానవతను కాపాడుకోవడం, అసంభవం ఏమీకాదు. ఇది ఈనాటి అవసరం.



– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్



వెర్‌స్టాపెన్ ఖాతాలో తొమ్మిదో విజయం

ఫార్ములావన్-2022 సీజన్‌లో తన ఆధిపత్యాన్ని చాటుకుంటూ రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ వెర్‌స్టాపెన్ తొమ్మిదో విజయం నమోదు చేశాడు. ఆదివారం జరిగిన బెల్జియం గ్రాండ్‌ప్రిలో 14వ స్థానం నుంచి రేసును మొదలుపెట్టిన వెర్‌స్టాపెన్ నిర్ణీత 44 ల్యాప్‌లను అందరికంటే వేగంగా గంటా 25 నిమిషాల 52.894 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. పెరెజ్ (రెడ్‌బుల్) రెండో స్థానంలో, కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) మూడో స్థానంలో నిలిచారు. ఈ సీజన్‌లో 14 రేసులు ముగిశాక వెర్‌స్టాపెన్ 284 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు.

టైటిల్ నిలబెట్టుకున్న యామగుచి

ప్రపంచ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో టైటిల్ నిలబెట్టుకున్న ఐదో ప్లేయర్‌గా అకానె యామగుచి (జపాన్) గుర్తింపు పొందింది. ఫైనల్లో యామగుచి 21-12, 10-21, 21-14తో చెన్ యు ఫె (చైనా)పై నెగ్గింది. గతంలో హాన్ ఐపింగ్ (చైనా; 1985, 1987), యె జావోయింగ్ (చైనా; 1995, 1997), జీ జింగ్‌ఫాంగ్ (చైనా; 2005, 2006), కరోలినా మారిన్ (స్పెయిన్; 2014, 2015) మాత్రమే వరుసగా రెండుసార్లు విజేతగా నిలిచారు.



సెరెనాపైనే దృష్టి

నేటి నుంచి యూఎస్ ఓపెన్ టోర్నీ



న్యూయార్క్: రిటైర్మెంట్‌కు కౌంట్‌డౌన్ మొదలైందని ఇటీవల ప్రకటించిన అమెరికా టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్ ప్రధాన ఆకర్షణగా నేడు యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీకి తెర లేవనుంది. 40 ఏళ్ల సెరెనా ఇప్పటివరకు కెరీర్‌లో 23 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ సాధించింది. మరో గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిస్తే అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన ప్లేయర్‌గా మార్గరెట్ కోర్ట్ (ఆస్ట్రేలియా-24 టైటిల్స్) పేరిట ఉన్న రికార్డును సమం చేస్తుంది. 2017లో చివరిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ సాధించిన సెరెనా ఆ తర్వాత మరో నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో ఫైనల్ చేరినా రన్నరప్‌తో సరిపెట్టుకుంది. 21వసారి యూఎస్ ఓపెన్‌లో ఆడుతున్న సెరెనా ఆరుసార్లు విజేతగా, నాలుగుసార్లు రన్నరప్‌గా నిలిచింది. నాలుగుసార్లు సెమీఫైనల్, మూడుసార్లు క్వార్టర్ ఫైనల్ చేరింది. 2008 నుంచి యూఎస్ ఓపెన్‌లో సెరెనా కనీసం సెమీఫైనల్ దశ వరకు చేరుకుంటోంది. భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం జరిగే మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 80వ ర్యాంకర్ డాంకా కొవినిచ్ (మాంటెనిగ్రో)తో ఆడుతుంది. ప్రపంచ నంబర్‌వన్ స్వియాటెక్ (పోలాండ్), రెండుసార్లు విజేత నయోమి ఒసాకా (జపాన్), డిఫెండింగ్ చాంపియన్ ఎమ్మా రాడుకాను (బ్రిటన్), సిమోనా హలెప్ (రొమేనియా) టైటిల్ ఫేవరెట్స్‌గా ఉన్నారు. పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ మెద్వెదెవ్ (రష్యా), రాఫెల్ నాదల్ (స్పెయిన్), సిట్సిపాస్ (గ్రీస్), నిక్ కిరియోస్ (ఆస్ట్రేలియా), అల్కారజ్ (స్పెయిన్) టైటిల్ రేసులో ఉన్నారు. పురుషుల, మహిళల సింగిల్స్ విభాగం విజేతలకు 26 లక్షల డాలర్ల చొప్పున (రూ. 20 కోట్ల 79 లక్షలు) ప్రైజ్‌మనీ లభిస్తుంది.

భారత కాలమానం ప్రకారం నేటి రాత్రి గం. 8:30 నుంచి తొలి రౌండ్ మ్యాచ్‌లు మొదలవుతాయి. మ్యాచ్‌లను సోనీ సిక్స్, సోనీ టెన్-2, సోనీ టెన్-3 చానెల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

జయం మనదే

- పాకిస్తాన్‌పై భారత్ విజయం
- హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండ్ 'షో'
- బంతితో మెరిసిన భువనేశ్వర్
- రాణించిన కోహ్లి, రవీంద్ర జడేజా
- ఆసియా కప్ టి20 టోర్నీ



హార్దిక్ పాండ్యా

రిజ్వాన్

1 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లో ప్రత్యర్థి జట్టులోని మొత్తం 10 వికెట్లు భారత పేసర్లకే దక్కడం ఇదే తొలిసారి.

1 అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్స్‌లో రోహిత్ శర్మ (133 మ్యాచ్‌ల్లో 3,499 పరుగులు) అగ్రస్థానానికి చేరుకున్నాడు. న్యూజిలాండ్ క్రికెటర్ గప్టిల్ (121 మ్యాచ్‌ల్లో 3,497 పరుగులు) రెండో స్థానానికి పడిపోయాడు.

1 పాక్‌తో మ్యాచ్‌లో ఆడటంద్వారా కోహ్లి మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20) కనీసం 100 మ్యాచ్‌లు ఆడిన తొలి భారతీయ క్రికెటర్‌గా గుర్తింపు పొందాడు. ఇప్పటివరకు కోహ్లి 102 టెస్టులు, 262 వన్డేలు, 100 టి20 మ్యాచ్‌లు ఆడాడు.

దుబాయ్: ఇదీ దాయాదుల దమ్ముంటే. ఈ మ్యాచ్ కున్న కిక్కే వేరు. బరిలో భారత్, పాక్ తలపడితే అది లీగా... నాకౌటా... అనేది ఉండదు! ఎక్కడ ఆడినా... ఎప్పుడు ఎదురుపడినా అది 'ఫైనల్'ను మించిన సమరమే! అలాంటి మ్యాచ్ ఆదివారం ఆసియా కప్ టి20 టోర్నీలో చిరకాల ప్రత్యర్థుల మధ్య ఉత్కంఠగా జరిగింది. చివరకు భారత్ 5 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. మొదట పాకిస్తాన్ 19.5 ఓవర్లలో 147 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓపెనర్ రిజ్వాన్ (42 బంతుల్లో 43; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. సీమర్లు భువనేశ్వర్ (4/26), హార్దిక్ పాండ్యా (3/25) పాక్‌ను కట్టడి చేశారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన భారత్ 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 148 పరుగులు చేసి గెలిచింది. కెరీర్‌లో 100వ టి20 మ్యాచ్ ఆడిన కోహ్లి (34 బంతుల్లో 35; 3 ఫోర్లు, 1 సిక్స్) విలువైన పరుగులు జతచేస్తే... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హార్దిక్ పాండ్యా (17 బంతుల్లో 33 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), జడేజా (29 బంతుల్లో 35; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో కలిసి గెలిపించే ఇన్నింగ్స్ ఆడాడు. భారత జట్టులో అనుభవజ్ఞుడైన దినేశ్ కార్తీక్‌ను తీసుకోవడంతో పంత్‌ను పక్కన బెట్టారు. పేసర్లలో అవేశ్‌ఖాన్, అర్ష్‌దీప్‌లకు అవకాశమిచ్చారు. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను బుధవారం హాంకాంగ్‌తో ఆడుతుంది. నేడు టోర్నీలో విశ్రాంతి దినం. మంగళవారం జరిగే గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో అఫ్గానిస్తాన్ తలపడుతుంది.

పాండ్యా బౌన్సర్లు


కెప్టెన్ బాబర్ అజమ్ (10)ను భువీ ఎక్కువసేపు నిలువనీయలేదు. మరో ఓపెనర్ రిజ్వాన్ కుదురుగా ఆడుతున్నప్పటికీ ఫఖర్ జమాన్ (10)ను అవేశ్‌ఖాన్ అవుట్ చేశాడు. పవర్‌ప్లేలో పాక్ స్కోరు 43/2. రిజ్వాన్, ఇఫ్తికార్ అహ్మద్ (22 బంతుల్లో 28; 2 ఫోర్లు, 1 సిక్స్) జోడీ క్రీజులో పాతుకుపోతున్న దశలో హార్దిక్ పాండ్యా బౌన్సర్లు పాక్‌ను చావుదెబ్బ తీశాయి. స్వల్ప వ్యవధిలో ఇఫ్తికార్, ఖుష్‌దిల్ (2), రిజ్వాన్‌లను హార్దిక్ పెవిలియన్ చేర్చాడు. తర్వాత భువీ పేస్‌కు మిడిలార్డర్ తలవంచింది. ఓ దశలో 128 పరుగులకే 9 వికెట్లు కోల్పోగా, ఆఖర్లో షానవాజ్ దహని (6 బంతుల్లో 16; 2 సిక్స్‌లు), రవూఫ్ (7 బంతుల్లో 13 నాటౌట్; 2 ఫోర్లు) ఫోర్లు కొట్టడంతో పాక్ పోరాడే స్కోరు చేసింది. భారత్ మరీ మందకొడిగా బౌలింగ్ చేయడంతో చివర్లో పెనాల్టీగా సర్కిల్ వెలుపల ఒక ఫీల్డర్‌ను తగ్గించారు. సాధారణంగా 5 మంది చేసే ఫీల్డింగ్ నలుగురికి కుదించారు. ఆ ఫీల్డర్‌ను సర్కిల్ లోపలకు తీసుకొచ్చారు.

రాహుల్ డకౌట్

కెప్టెన్ రోహిత్‌తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్ (0) తనకెదురైన తొలి బంతికే నసీమ్ షా బౌలింగ్‌లో బౌల్డయ్యాడు. కోహ్లి కూడా డకౌట్ కావాల్సినోడే! కానీ స్లిప్‌లో ఫఖర్ జమన్ క్యాచ్ నేలపాలు చేయడంతో బతికిపోయాడు. తర్వాత కోహ్లి తన బ్యాట్‌కు పనిచెప్పాడు. క్లాస్ షాట్లతో అలరించాడు. జట్టు స్కోరు 50 పరుగులకు చేరాక మొదట రోహిత్ (18 బంతుల్లో 12; 1 సిక్స్), కాసేపటికే కోహ్లి భారీ షాట్లకు యత్నించి వికెట్లను సమర్పించుకున్నారు. 53 పరుగులకే టాపార్డర్ వికెట్లు పెవిలియన్‌కు చేరాయి. ఈ దశలో జడేజా, సూర్యకుమార్ కాసేపు ఓర్పుగా ఆడారు. చేయాల్సిన రన్‌రేట్ పెరగడంతో అడపాదడపా షాట్లు బాదారు. ఈ క్రమంలోనే సూర్యకుమార్ (18 బంతుల్లో 18; 1 ఫోర్) వెనుదిరిగాడు. హిట్టర్ హార్దిక్ పాండ్యా రాగా... 15 ఓవర్లు ముగిసేసరికి భారత్ స్కోరు 97/4. విజయ సమీకరణం 30 బంతుల్లో 51 పరుగులు! అంటే ఓవర్‌కు పది పైచిలుకు పరుగులు చేయాలి. 16, 17వ ఓవర్లలో ఒక్క బౌండరీ రాలేదు. 18 బంతుల్లో 32 పరుగులు చేయాల్సిన దశలో నసీమ్ షా వేసిన 18వ ఓవర్లో జడేజా ఫోర్, సిక్సర్ బాదాడు. తర్వాత రవూఫ్ ఓవర్‌ను పాండ్యా 3 బౌండరీలతో ఆడుకున్నాడు. 6 బంతుల్లో 7 పరుగులు. సులువే కానీ... తొలి బంతికి నవాజ్ బౌలింగ్‌లో జడేజా బౌల్డ్! తర్వాత రెండు బంతుల్లో వచ్చింది ఒకటే పరుగు. మిగిలిన 3 బంతుల్లో గెలవాలంటే 6 పరుగులు చేయాలి. ఉత్కంఠకు తెరదించుతూ హార్దిక్ లాంగాన్‌లో కొట్టిన సిక్సర్‌తో ఆట రెండు బంతుల ముందే ముగిసింది.



నవాజ్



భువనేశ్వర్

ద్రవిడ్ వచ్చేశాడు...

జట్టు బయల్దేరే ముందు అనూహ్యంగా కోవిడ్ బారిన పడిన టీమిండియా హెడ్ కోచ్ ద్రవిడ్ కోలుకున్నాడు. అంతేనా... అప్పుడే ఆసియా కప్ ఆతిథ్య దేశం యూఏఈ చేరుకున్నాడు కూడా! ఆ వెంటే జట్టుతో కలిసిన ద్రవిడ్ ఉత్సాహంగా తన కోచింగ్ పనేదో చక్కబెట్టే పనిలోపడ్డాడు. 'ద్రవిడ్‌కు చేసిన కరోనా పరీక్షలో నెగెటివ్ రిపోర్ట్ వచ్చింది. దీంతో వెంటనే దుబాయ్ వెళ్లాడు.

స్కోరు వివరాలు

పాకిస్తాన్ ఇన్నింగ్స్: రిజ్వాన్ (సి) అవేశ్ ఖాన్ (బి) పాండ్యా 43; బాబర్ ఆజమ్ (సి) అర్ష్‌దీప్ (బి) భువనేశ్వర్ 10; ఫఖర్ జమాన్ (సి) కార్తీక్ (బి) అవేశ్ ఖాన్ 10; ఇఫ్తికార్ (సి) కార్తీక్ (బి) పాండ్యా 28; ఖుష్‌దిల్ షా (సి) జడేజా (బి) పాండ్యా 2; షాదాబ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) భువనేశ్వర్ 10; ఆసిఫ్ అలీ (సి) సూర్యకుమార్ (బి) భువనేశ్వర్ 9; నవాజ్ (సి) కార్తీక్ (బి) అర్ష్‌దీప్ 1; రవూఫ్ (నాటౌట్) 13; నసీమ్ షా (ఎల్బీడబ్ల్యూ) (బి) భువనేశ్వర్ 0; షానవాజ్ (బి) అర్ష్‌దీప్ 16; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (19.5 ఓవర్లలో ఆలౌట్) 147.** **వికెట్ల పతనం:** 1-15, 2-42, 3-87, 4-96, 5-97, 6-112, 7-114, 8-128, 9-128, 10-147. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-26-4, అర్ష్‌దీప్ సింగ్ 3.5-0-33-2, హార్దిక్ పాండ్యా 4-0-25-3, అవేశ్ ఖాన్ 2-0-19-1, చహల్ 4-0-32-0, జడేజా 2-0-11-0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) ఇఫ్తికార్ (బి) నవాజ్ 12; రాహుల్ (బి) నసీమ్ షా 0; కోహ్లి (సి) ఇఫ్తికార్ (బి) నవాజ్ 35; జడేజా (బి) నవాజ్ 35; సూర్యకుమార్ (బి) నసీమ్ షా 18; పాండ్యా (నాటౌట్) 33; దినేశ్ కార్తీక్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (19.4 ఓవర్లలో 5 వికెట్లకు) 148.** **వికెట్ల పతనం:** 1-1, 2-50, 3-53, 4-89, 5-141. **బౌలింగ్:** నసీమ్ షా 4-0-27-2, షానవాజ్ 4-0-29-0, రవూఫ్ 4-0-35-0, షాదాబ్ 4-0-19-0, నవాజ్ 3.4-0-33-3.

స్టేడియంలో 'లైగర్'



ఇటీవలే పాన్ ఇండియా సినిమాతో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన టాలీవుడ్ క్రేజీ స్టార్ విజయ్ దేవరకొండ స్టేడియంలో మెరిశారు. పాకిస్తాన్ దిగ్గజం వసీమ్ అక్రమ్, భారత మాజీ సీమర్ ఇర్ఫాన్ పఠాన్‌లతో కలిసి మ్యాచ్‌కు ముందు టీవీ వ్యాఖ్యాతతో తన క్రికెట్ సరదా పంచుకున్నారు. ఓ విధంగా బ్యాటింగ్ మెరుపులకు ముందే సినీ తారా మెరుపు సందడి మొదలైంది.

సినిమా

తాతామనవళ్ల కథ?



● ప్రభాస్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమా పాతబడ్డ 'రాజా డీలక్స్' అనే థియేటర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే తాతామనవళ్ల కథ అని ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. ఈ చిత్రం షూటింగ్ కోసం ఆల్రెడీ హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో థియేటర్ సెట్‌ను రెడీ చేస్తున్నారట చిత్రయూనిట్. అలాగే వీలైనంత త్వరగా రెండు షెడ్యూల్స్‌లోనే షూటింగ్‌ని పూర్తి చేయాలనే ఆలోచనలో ఉన్నారట మారుతి. హారర్ కామెడీ జానర్‌లో రూపొందనున్న ఈ సినిమా షూటింగ్‌లో ప్రభాస్ త్వరలోనే జాయిన్ కానున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. కాగా ప్రభాస్ ప్రస్తుతం 'సలార్', 'ప్రాజెక్ట్ కె' సినిమాల షూటింగ్స్‌లో పాల్గొంటున్నారు. అలాగే 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' అనే చిత్రానికి కూడా ప్రభాస్ పచ్చజెండా ఊపిన సంగతి తెలిసిందే. కాగా ఓం రౌత్ దర్శకత్వంలో ప్రభాస్ నటించిన 'ఆదిపురుష్' సినిమా సంక్రాంతికి విడుదల కానుంది.



● మృణాళిని, మీనాక్షి, ఎన్వీ ప్రసాద్, విక్రమ్, శ్రీనిధీ శెట్టి

తెలుగువారితో గొప్ప అనుబంధం ఉంది

- విక్రమ్

''నా 'శివపుత్రుడు, అపరిచితుడు' చిత్రాలను తెలుగు ప్రేక్షకులు బ్రహ్మాండంగా ఆదరించారు. నేను నటనకు ఆస్కారం ఉండే పాత్రలు చేసిన ప్రతిసారీ గొప్పగా ఆదరిస్తున్నారు. అలా తెలుగువారితో నాకు గొప్ప అనుబంధం ఉంది. 'కోబ్రా' చిత్రంలోనూ అద్భుతమైన నటన ఉంటుంది'' అని హీరో విక్రమ్ అన్నారు. ఆర్.అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వంలో విక్రమ్, శ్రీనిధీ శెట్టి జంటగా నటించిన చిత్రం 'కోబ్రా'. ఎస్ఎస్ లలిత్ కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న విడుదలవుతోంది. ఈ చిత్రాన్ని తెలుగులో ఎన్వీ ప్రసాద్ రిలీజ్ చేస్తున్నారు. కాగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'కోబ్రా' ప్రెస్‌మీట్‌లో విక్రమ్ మాట్లాడుతూ-''మా నాన్న హెడ్‌మాస్టర్. ఆయన నటుడు కావాలని చెన్నై వచ్చారు. నేను మూడేళ్లకే ఓ సినిమాలో పాపగా యాక్ట్ చేశా. నాకు నటన అంటే పిచ్చి. 'కోబ్రా' కథ వినగానే వెంటనే సినిమా చేసేయాలనిపించింది. కోవిడ్ వల్ల సినిమా బాగా ఆలస్యం అయింది. రష్యాలో మైనస్ 40 డిగ్రీల చలిలో ఎంతో కష్టపడి షూటింగ్ చేశాం. ఈ చిత్రంలో దాదాపు పది పాత్రలు చేశాను. ఒక్కో పాత్ర మేకప్‌కి సుమారు ఐదు గంటలు పట్టేది. 'కోబ్రా' సైకాలాజికల్ థ్రిల్లర్, సైన్స్ ఫిక్షన్, ఎమోషనల్ డ్రామా. ఈ సినిమా చేయడం చాలెంజింగ్‌గా అనిపించింది. నాకు తెలిసింది నటనే. ప్రేక్షకులకు ఎప్పుడూ కొత్త అనుభూతిని పంచాలని భిన్నంగా చేయడానికే ప్రయత్నిస్తా. ఇప్పటికీ తమిళ్‌లో టాప్ హీరోల్లో నేనూ ఒకణ్ణి. హిట్స్, ఫ్లాప్స్‌తో సంబంధం లేకుండా ప్రేక్షకుకులు నన్ను ప్రేమిస్తుండటం గర్వంగా ఉంది. యూనివర్సల్ సబ్జెక్ట్‌తో రూపొందిన 'కోబ్రా' ని తిరుపతి ప్రసాద్ గారు విడుదల చేయడం చాలా ఆనందంగా ఉంది'' అన్నారు. ఎన్వీఆర్ ప్రసాద్ మాట్లాడుతూ- ''కమల్ హాసన్‌గారి తర్వాత నట విశ్వరూపం చూపించే నటుడు విక్రమ్. ఆయన సినిమాలు అంటే తెలుగు ప్రేక్షకులకు ఎంతో ఇష్టం. 'కోబ్రా' చిత్రాన్ని కూడా బాగా ఆదరించాలి'' అన్నారు. ''నా మొదటి తమిళ చిత్రం 'కోబ్రా'. తొలి సినిమాకే విక్రమ్‌గారితో నటించే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నా'' అన్నారు శ్రీనిధీ శెట్టి. ''కోబ్రా' లో ఇంటెన్స్, ఎమోషనల్ రోల్‌లో కనిపిస్తాను'' అన్నారు నటి మృణాళినీ రవి. ''కోబ్రా' సినిమా నాకు చాలా స్పెషల్'' అన్నారు నటి మీనాక్షి.

'ఇటీవల నా ఆరోగ్యంపై రకరకాల పుకార్లు వచ్చాయి. మరికొందరు నా ఫొటోకి పూల దండ వేసిన ఫ్రేమ్స్ పెట్టి నేను లేనంటూ ప్రచారం చేశారు. ఆ వార్తలు చూసిన తర్వాత బాధపడి ఐదు రోజులు ఐసీయూలో ఉన్నాను' అన్నారు విక్రమ్.

పోలీసు వేట



● సుధీర్ బాబు

సుధీర్‌బాబు హీరోగా, శ్రీకాంత్, భరత్('ప్రేమిస్తే' ఫేమ్) ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'హంట్'. 'గన్స్ డోన్ట్ లై' అనేది క్యాప్షన్. మహేశ్ దర్శకత్వంలో భవ్య క్రియేషన్స్ పతాకంపై వి.ఆనంద్ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రానికి 'హంట్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా వి.ఆనంద ప్రసాద్ మాట్లాడుతూ- ''యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. సుధీర్‌బాబు, శ్రీకాంత్, భరత్ పోలీసు పాత్రలు పోషించారు. కనిపించని శత్రువు కోసం హీరో జరిపే వేట ఈ చిత్రం ప్రధాన కథాంశం. సుధీర్‌బాబు గత చిత్రాలతో పోలిస్తే ఈ మూవీలో క్యారెక్టర్ విభిన్నంగా ఉంటుంది. శ్రీకాంత్ పాత్ర ఎగ్జైటింగ్‌గా ఉంటుంది. భరత్ తెలుగులో చేసిన తొలి స్ట్రయిట్ ఫిల్మ్ ఇదే. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలోనే మిగతా వివరాలు వెల్లడిస్తాం'' అన్నారు. మైమ్ గోపీ, కబీర్ దుహాన్ సింగ్, మౌనికా రెడ్డి, గోపరాజు రమణ కీలక పాత్రలు చేసిన ఈ సినిమాకు సంగీతం: జీబ్రాన్, కెమెరా: అరుల్ విన్సెంట్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అన్నే రవి.



● సాయి సునీల్, అనిల్ రావిపూడి, వేమూరి ఆనంద్

యువరాణి లవ్‌స్టోరి

విరాట్ కార్తీక్, యామిన్ రాజ్, ప్రియాంక రెవరి ప్రధాన పాత్రల్లో సాయి సునీల్ నిమ్మల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ప్రేమదేశపు యువరాణి'. ఏజీఏ క్రియేషన్స్, ఎస్2హెచ్2 ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఆనంద్ వేమూరి, హరిప్రసాద్ సీహెచ్ నిర్మించారు. ఈ సినిమా మోషన్ పోస్టర్‌ని డైరెక్టర్ అనిల్ రావిపూడి విడుదల చేసి, మాట్లాడుతూ- ''ప్రేమలో సరికొత్త యాంగిల్‌ని ఈ చిత్రంలో టచ్ చేసినట్లు అనిపిస్తోంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలి'' అన్నారు. ''సాయి సునీల్ చెప్పిన కథ నచ్చడంతో నా సన్నిహితుడు హరిప్రసాద్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించాను. మంచి ప్రేమకథా చిత్రమిది. త్వరలోనే సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు వేమూరి ఆనంద్. ''ప్రేక్షకులకు కావాల్సిన అన్ని అంశాలు మా చిత్రంలో ఉంటాయి'' అన్నారు సాయి సునీల్ నిమ్మల. ''ప్రేమదేశపు యువరాణి' వంటి మంచి సినిమాలో అవకాశం ఇచ్చిన దర్శక-నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు విరాట్ కార్తీక్, యామిన్ రాజ్. ఈ చిత్రానికి కెమెరా: శివకుమార్ దేవరకొండ, సంగీతం: అజయ్ పట్నాయక్.

నాట్ ఫర్ సేల్!



● వనితారెడ్డి, శివారెడ్డి

శివారెడ్డి, అమిత్ తివారి, వనితారెడ్డి, మనీషాశ్రీ, చైతన్య ప్రియ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రెంట్'. 'నాట్ ఫర్ సేల్' అన్నది ఉపశీర్షిక. రఘువర్ధన్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. రాజ్‌కుమార్ ఎంటర్‌టైన్మెంట్స్, రామ్‌నాథ్ ముదిరాజ్ మూవీస్ పతాకాలపై చందక రాజ్‌కుమార్, సీహెచ్ రామ్ నాథ్ నిర్మిస్తున్న ఈ సినిమా రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా చందక రాజ్‌కుమార్ మాట్లాడుతూ-''హారర్ అండ్ రొమాంటిక్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న చిత్రం 'రెంట్'. సినిమా ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. గోవా, దేవఘడ్ ప్రాంతాల్లో జరిగే మూడో షెడ్యూల్‌తో షూటింగ్ పార్ట్ పూర్తవుతుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: డీఎస్ ఆర్, కెమెరా: హజరత్ (వలి).

జవాన్‌కు బై బై



● దీపికా పదుకొనె

వెండితెర 'జవాన్'కు రీసెంట్‌గా బై బై చెప్పారు హీరోయిన్ దీపికా పదుకొనె. షారుక్ ఖాన్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'జవాన్'. విజయ్ సేతుపతి, ప్రియమణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల చెన్నైలో ప్రారంభించిన ఈ చిత్రం కొత్త షెడ్యూల్‌లో షారుక్, దీపికా, విజయ్ సేతుపతిలకు సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరించింది యూనిట్. ప్రస్తుతం 'జవాన్' షూటింగ్ జరుగుతున్నప్పటికీ దీపిక పాత్ర చిత్రీకరణ పూర్తయింది. దీంతో యూనిట్‌కి బై బై చెప్పారామె. ఈ సినిమాలో షారుక్ ద్విపాత్రాభినయం చేశారనీ, అందులో ఒక షారుక్‌కి భార్య పాత్రలో దీపికా నటించారని టాక్. అయితే ఈ సినిమాలో ఆమె పాత్ర ఎక్కువగా ఉండదట. ఓ అతిథి పాత్ర అని బాలీవుడ్ టాక్. కాగా 'జవాన్' కాకుండా ప్రభాస్ 'ప్రాజెక్ట్ కె', షారుక్ ఖాన్ 'పఠాన్', రణ్‌వీర్ సింగ్ 'సర్కస్', హృతిక్ రోషన్ 'ఫైటర్' చిత్రాలతో బిజీగా ఉన్నారు దీపికా పదుకొనె.

క్రైమ్ మిస్టరీ



● సారా ఆచార్, నివాస్ శిష్టు

నివాస్ శిష్టు, సారా ఆచార్ జంటగా శివ శ్రీ మీగడ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రహస్య'. ఎస్.గౌతమి నిర్మించిన ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో ఎస్ఐఏ ఆఫీసర్ విశ్వతేజ పాత్రలో కనిపిస్తారు నివాస్. ''అంతుచిక్కని ఓ క్రైమ్ మిస్టరీని పోలీసులు ఎలా ఛేదించారు? ఈ క్రమంలో వారికి ఎలాంటి పరిణామాలు ఎదురయ్యాయి? అనే అంశాలు ఆసక్తిగా ఉంటాయి. ప్రేక్షకులు థ్రిల్ అవుతారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

నటుడు విద్యాసాగర్ ఇకలేరు



తెలుగు చిత్ర పరిశ్రమలో విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ నటుడు, రచయిత విద్యాసాగర్ రాజు(73) కన్నుమూశారు. గత కొన్నేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్న ఆయన ఆదివారం తుదిశ్వాస విడిచారు. స్టేజి ఆర్టిస్టుగా ఎన్నో నాటకాలు వేసిన విద్యాసాగర్ 1984లో వచ్చిన 'ఈ చదువులు మాకొద్దు'(వేజెళ్ల సత్యనారాయణ దర్శకుడు) సినిమా ద్వారా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. ఆ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయన 'రాజేంద్రుడు-గజేంద్రుడు, ఆఖరి క్షణం, మాయలోడు, క్షణ క్షణం, స్వాతి ముత్యం, అహ నా పెళ్లంట' వంటి చిత్రాల్లో నటించారు. హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, విలన్‌గా, కమెడియన్‌గా దాదాపు 100 సినిమాలు చేసిన ఆయన ప్రేక్షకుల్లో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారు. కాగా తన కెరీర్‌లో ఎక్కువ సినిమాలు దర్శకుడు జంధ్యాలతోనే చేశారు విద్యాసాగర్. అయితే పక్షవాతం వల్ల కేవలం చక్రాల కుర్చీకే పరిమితమయ్యారాయన. అయినప్పటికీ వీల్ చైర్‌లో కూర్చుని పలు సినిమాల్లో నటించడం విశేషం. విద్యాసాగర్ భార్య రత్నాసాగర్ కూడా నటిగా సుపరిచితురాలే. ఆయన మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	59	58,834
నిఫ్టీ ▲	36	17,559

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)			
నాస్‌డాక్	12,142	▽	498
డోజోన్స్	32,283	▽	1008
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,427	▽	52
డాక్స్	12,971	▽	300
షాంఘై	3,236	▽	10
నికాయ్	28,641	▲	162

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

నమ్మి డబ్బు చెల్లిస్తున్నారా..?

- తెలియని వ్యక్తులతో లావాదేవీలు వద్దు
- తెలియని సంస్థలతోనూ ఇదే పాటించాలి
- యూపీఐకి బదులు నెఫ్ట్, ఐఎంపీఎస్ మేలు
- ట్రూకాలర్ సాయం తీసుకోవచ్చు
- సామాజిక మాధ్యమాల తోడ్పాటు కూడా తీసుకోవాలి...
- పూర్తి నిర్ధారణ తర్వాతే చెల్లింపు

ఒకప్పుడు తెలిసిన వారికే డబ్బులు పంపాల్సిన అవసరం వచ్చేది. కానీ, నేడు చెల్లింపులన్నీ డిజిటల్ అయ్యాయి. ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నాం. కూరగాయల దగ్గర్నుంచి ప్రతిదీ ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తున్నాం. సినిమా, రైలు, బస్సు, ఫ్లయిట్ టికెట్ల బుకింగ్, హోటళ్లలో బుకింగ్‌లు.. ఈ జాబితా చాలా పెద్దదే. కానీ, ఆన్‌లైన్ చెల్లింపుల్లో (యూపీఐ, ఇతరత్రా) ఎంత సౌకర్యం ఉందో, అంతకంటే ఎక్కువే రిస్క్ ఉంటుంది. డిజిటల్ పేమెంట్స్ చేసే సమయంలో ఎవరికి వారు స్వీయ పరిశీలన, జాగ్రత్తలు తీసుకుంటే ఆ సౌకర్యాన్ని ఎంజాయ్ చేయవచ్చు. లేదంటే నష్టపోవాల్సి వస్తుంది. డిజిటల్ ప్రపంచంలో ఒకసారి మోసపోతే కనుక దొంగ దొరికి, పోయిన మొత్తం వెనక్కి రావడం చాలా కష్టం. ఈ నేపథ్యంలో డిజిటల్ చెల్లింపులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన అంశాలను వివరించేదే ఈ కథనం.

గడిచిన ఐదారేళ్లుగా దేశంలో ఆన్‌లైన్ స్కామ్‌లు పెరిగిపోయాయి. దీనికి కారణం 2016 డీమోనిటైజేషన్, యూపీఐ ఆగమనం తర్వాత ప్రజలు డిజిటల్ చెల్లింపులను అనుసరించడం మొదలు పెట్టడం. ఈ ధోరణి ఏటేటా మరింత విస్తరిస్తోంది. ఇటీవలే బెంగళూరుకు చెందిన నారాయణన్ వేసవి సందర్భంగా కుటుంబంతో కలసి సరదాగా వెళ్దామని ఆన్‌లైన్‌లో శోధించాడు. అతడికి ఓ వెబ్‌సైట్ కనిపించింది. అందులో ఆకర్షణీయమైన ఫొటోలు, టూర్ ప్యాకేజీల వివరాలతో పాటు, ఆపరేటర్ నంబర్ అన్నీ ఉన్నాయి. దీంతో అతడికి ఆ వివరాలు నచ్చాయి. రిజిస్టర్డ్ ఆపరేటరేనా? అన్న సందేహం అతడికి కలగలేదు. టూర్ ప్యాకేజీ కోసం అతడు యూపీఐ ద్వారా రూ.56,000 పంపించాడు. ఆ తర్వాత తెలిసింది తాను చేసింది తప్పని, మోసపోయానని. సాధారణంగా నారాయణన్ జాగ్రత్తపరుడు. ఏది చూసినా ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తాడు. ఆన్‌లైన్‌ను పెద్దగా నమ్మడు కూడా. అటువంటిది ఆన్‌లైన్‌లో తెలియని ఓ కొత్త వెబ్‌సైట్‌ను నమ్మి డబ్బులు ఎలా పంపించాడో? అతడికి కూడా అర్థం కాలేదు. ఆలస్యం చేస్తే ప్యాకేజీ టికెట్లు ఉండవన్న ఆదుర్దా అతడితో అలా చేయించి ఉండొచ్చు. లేదంటే సదరు మోసపూరిత వెబ్‌సైట్‌లో ఆకర్షణీయమైన వివరాలతో, ఆకట్టుకునే ప్యాకేజీలు కనిపించి ఉండొచ్చు. ఇది కేవలం ఒక ఉదాహరణే. అన్ని మోసాలు ఇదే మాదిరిగా ఉంటాయని కాదు. టెక్, డిజిటల్ యుగంలో మోసం నేరగాళ్లకు మరింత సులభంగా మారింది. టెన్త్ పాస్ కాని వాడూ టెక్కీగా మారి మోసావతారం ఎత్తుతున్నాడు. అందుకే వినియోగదారు మరింత స్మార్ట్‌గా వ్యవహరించాలి. డబ్బు పంపే ముందు నిశిత పరిశీలన చేసుకోవాలి.



యూపీఐ వద్దు..

యూపీఐ చెల్లింపులకు బదులు నెఫ్ట్/ఐఎంపీఎస్ నగదు బదిలీ మార్గాలను అనుసరించడం కొంచెం సురక్షితమైనది. యూపీఐ సాధనం సురక్షితమైనదే. కానీ, సరైన వ్యక్తికి పంపినప్పుడే. నగదు స్వీకరించే వ్యక్తి పూర్తి వివరాలు ఇందులో తెలియవు. అదే నెఫ్ట్/ఐఎంపీఎస్‌లో డబ్బు పంపాలంటే పూర్తి వివరాలు కావాల్సిందే. అందుకే అవతలి వ్యక్తి మాటలు నమ్మదగినవిగా అనిపించకపోతే, సందేహం వస్తే ఖాతా వివరాలు ఇవ్వాలని కోరాలి.

కంగారు పడొద్దు...



పెద్ద మొత్తంలో డబ్బులు పంపుతుంటే వేగం ప్రదర్శించొద్దు. సమయం తీసుకోండి. తొందరపడితే ప్రాథమిక అంశాలను కూడా విస్మరిస్తుంటాం. తొందరపడి మోసపోయినట్టుగా ఉంటుంది. అది నిజమా, మోసమా అని గుర్తించేందుకు వ్యవధి ఇవ్వాలి. అవతలి వ్యక్తితో ఒకటికి నాలుగు సార్లు మాట్లాడాలి. కొన్ని రోజులు ఆగి చూడాలి. అప్పుడు అవతలి వ్యక్తి స్పందన ఆధారంగా నిజా, నిజాలను గుర్తించే వెసులుబాటు ఉంటుంది.

ముందే మొత్తం వద్దు..

ఇక నగదు పంపించేందుకు సిద్ధమైతే కనుక మొత్తం ఒకేసారి చెల్లించేయవద్దు. సాధారణంగా నమ్మకం ఏర్పడినప్పుడు ఎక్కువ మంది ఒకే విడత డిస్కౌంట్ కోరి చెల్లించేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. వాయిదాలుగా చెల్లించడం అందరికీ నచ్చదు. ఆన్‌లైన్ మోసాలను నివారించాలంటే.. ఒకేసారి మొత్తం పంపకుండా ఉండడమే మంచి మార్గం. దీనివల్ల మోసం అయితే కొద్ది మొత్తంతోనే ఆగిపోతుంది.



అదే పనిగా కాల్స్..



మోసగాళ్లు అయితే కాల్స్, మెస్సేజీల ద్వారా సులభంగా గుర్తించొచ్చు. ఒకటికి నాలుగు సార్లు కాల్ చేయడం, ఎస్ఎంఎస్‌లు పంపిస్తుంటే ముందుగా అనుమానించాలి. వారితో మాట్లాడినప్పుడు ఈ ఆఫర్/అవకాశం మళ్లీ ఉండదని/రాదని చెప్పడం.. వారి మాటల్లో ఏకరూపత లేకపోతే స్కామ్‌గానే సందేహించాలి. అలాగే, వాట్సాప్ చేస్తున్నా కానీ ఇదే అనుమానించాలి. కొందరు నేరస్థులు ఏ మాత్రం అనుమానం కలగనీయని రీతిలో సంప్రదింపులు చేస్తుంటారు. అటువంటప్పుడు క్యాష్ ఆన్ డెలివరీ కోరాలి. హోటల్ బుకింగ్ అయితే నేరుగా వచ్చినప్పుడు పేమెంట్ చేస్తానని చెప్పాలి. మొదటగా తెలియని వ్యక్తులు కాల్ చేసి ఫలానా ఆఫర్ అనో, ప్యాకేజీ అనో, లాటరీ వచ్చిందనో చెప్పే మాటలకు మెతకగా స్పందించడం, ఆసక్తి చూపడం, అయోమయంగా అనిపించేలా వ్యవహరించకండి. అవతలి వ్యక్తి మరింత ముందుకు వెళ్లేందుకు అవకాశం ఇచ్చినట్టు అవుతుంది. తెలియని నంబర్, మెయిల్ ఐడీ నుంచి ఏదైనా ఆఫర్లు, సందేశాలు వస్తే, లింక్‌లు వస్తే వాటిని తెరవడం, అందులోని నంబర్లను సంప్రదించడం చేయవద్దు. పేరున్న సంస్థలు అయితే నేరుగా వాటి సైట్‌కు వెళ్లి చెక్ చేసుకోవాలి. అంతేకానీ, మొబైల్‌కు తెలియని మూలాల నుంచి ఎస్ఎంఎస్, వాట్సాప్, మెయిల్ ద్వారా వచ్చే వెబ్‌లింక్‌లను ఓపెన్ చేయకుండా ఉండాలి. ఉదాహరణకు ఒక వ్యక్తి కాల్ చేసి, తమది ఫలానా ఎన్‌జీవో, చిన్న పిల్లల ఆరోగ్య అవసరాల కోసం విరాళాలు సమీకరిస్తున్నట్టు చెప్పొచ్చు. ఇలాంటివి అసలు నమ్మనే వద్దు. ఎవరికైనా సాయం చేయాలంటే ప్రత్యక్షంగా చేయడమే మంచిది. అవసరం లేని ఇలాంటి వాటిని ఎంటర్‌టైన్ చేయడం... రిస్క్‌ను ఆహ్వానించడమే.

గూగుల్ సెర్చ్..

డబ్బులు పంపే ముందు అవతలి వ్యక్తి ఫోన్ నంబర్, ఈమెయిల్‌ను ఆన్‌లైన్‌లో ఓసారి సెర్చ్ చేయాలి. అదే నంబర్, అదే ఈ మెయిల్ పేరిట అప్పటికే ఎవరైనా మోసపోయి ఉంటే, ఆ వివరాలు లభిస్తాయి. ఒక్కోసారి కాంటాక్ట్ నంబర్‌ను టైప్ చేసి సెర్చ్ ఓకే చేస్తే.. అదే నంబర్ పలు వ్యాపారాలకు సంబంధించి చూపించొచ్చు. గూగుల్‌లో ఒకటికి మించిన కంపెనీలకు ఆ నెంబర్ చూపిస్తే కచ్చితంగా మోసపూరితమైనదే.

ట్రూకాలర్

అయితే, అన్ని ఫోన్ నంబర్ల వివరాలు గూగుల్‌లో కనిపించాలని లేదు కదా? మోసగాళ్లు ఒక్కో పెద్ద మోసానికి ఒక్కో ఫోన్ నంబర్ వాడుతున్న రోజులు ఇవి. కనుక గూగుల్‌లో వివరాలు లభించకపోతే అప్పుడు ఫోన్‌లో ట్రూకాలర్ యాప్ వేసుకుని అందులో సెర్చ్ చేయడమే మార్గం. సదరు నెంబర్‌తో ఎవరైనా మోసపోయి ఉంటే.. ఫ్రాడ్, స్కామ్, స్పామ్‌గా చూపిస్తుంది. కచ్చితంగా దాన్ని ఒక సంకేతంగానే చూడాలి. పూర్తి పేరుతో వస్తే అప్పుడు తదుపరి పరిశీలనకు వెళ్లాలి.



ఇతరుల సాయం..

గుర్తు తెలియని వ్యక్తులు, సంస్థల మోసాలను ముందే గుర్తించేందుకు సొంత పరిశీలనకు తోడు, తెలిసిన వారు, సామాజిక మాధ్యమాల సాయం తీసుకోవాలి. చాలా మంది ఏం చేస్తారంటే..? ఇతరులను అడిగితే తాము చిన్నబోతామని మొహమాటంగా భావిస్తుంటారు. కానీ, ఎవరూ సర్వజ్ఞులు కారు. అందుకని ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వేదికలపై ఆయా సంస్థలు, వ్యక్తుల గురించి, వారిచ్చే ఆఫర్ల గురించి విచారించుకోవడం మెరుగైన మార్గం అవుతుంది. ఎందుకంటే ఇవన్నీ చాలా పెద్ద వేదికలు. దేశవ్యాప్తంగా యూజర్లు ఉన్నందున చాలా మందికి చేరిపోతుంది.



కనుక మోసాలను సులభంగా పసిగట్టే వీలుంటుంది. మీకు సందేహం అనిపించిన వారికి సంబంధించి అన్ని వివరాలను పోస్ట్ రూపంలో పెట్టి, మీ సందేహాలను ప్రశ్నలుగా సంధిస్తే చాలు. మీకు కావాల్సిన సమాచారం అందుతుంది.

జీఎస్‌టీ వివరాలు అడగాలి..

ఏదైనా సంస్థకు చెల్లింపులు చేస్తున్నట్టు అయితే.. జీఎస్‌టీ నంబర్ తీసుకోవాలి. అలాగే, క్యాన్సిల్డ్ చెక్ ఇవ్వాలని కోరాలి. కార్పొరేట్ ఖాతా నుంచి చెల్లింపులు చేస్తానని లేదా తన బిజినెస్ అకౌంట్ నుంచి చెల్లింపులు చేస్తానని చెప్పాలి. కనుక జీఎస్‌టీ, చెక్కు వివరాలు ఇవ్వాలని కోరాలి. నిజమైన సంస్థే అయితే ఈ వివరాలు ఇవ్వడానికి వెనుకాడదు. వారు చెక్కు ఇచ్చినట్టయితే.. అసలైన పేరు, ఖాతా నంబర్, బ్రాంచ్ వివరాలు లభిస్తాయి. వీటి ద్వారా కచ్చితత్వంపై ఓ నిర్ధారణకు రావచ్చు. చాలా మంది మోసగాళ్లు సొంత ఖాతాలను నిర్వహించరు. వేరే ఖాతాల సాయంతోనే ఇలాంటి పనులు చేస్తుంటారు. కనుక తేలిగ్గా దొరికిపోతారు.



తెలియని పోర్టళ్లు..

తెలియని సంస్థల సేవలకు దూరంగా ఉండడమే భద్రతా పరంగా మంచి విధానం అవుతుంది. ఉదాహరణకు మూవీ టికెట్లు బుక్ చేసుకోవాలని అనుకుంటే బుక్‌మైషో, పేటీఎం ఇలాంటివి అందరికీ తెలుసు. ఇవి నిజమైన వ్యాపార వేదికలు. కానీ, ఎప్పుడూ వినని వెబ్‌సైట్ లేదా యాప్‌లో ఒకటి కొంటే ఒకటి ఉచితానికి ఆశపడొద్దు. ఉచితమేమో కానీ, మన కార్డు వివరాలు, ఇతర కీలక సమాచారం పక్కదారి పట్టొచ్చు. లేదంటే కార్డు నుంచి బ్యాలన్స్‌ను కొట్టేయవచ్చు.

వేరే వారికి స్టీరింగ్

టీమ్ వ్యూవర్, ఎనీడెస్క్ నుంచి వచ్చే రిక్వెస్ట్‌లను యాక్సెప్ట్ చేయవద్దు. చేశారంటే మీ స్క్రీన్‌ను వారితో షేర్ చేసినట్టు అవుతుంది. అప్పుడు మీ తరఫున అవతలి వ్యక్తి లావాదేవీలు నిర్వహిస్తాడు. ఫోన్, కంప్యూటర్‌లోని సమాచారం మొత్తాన్ని కొట్టేస్తారు. ఇటీవలే గచ్చిబౌలిలో పనిచేసే 28 ఏళ్ల ప్రైవేటు ఉద్యోగికి ఒక కాల్ వచ్చింది. బ్యాంకు కస్టమర్ కేర్ నుంచి అని అవతలి వ్యక్తి చెప్పాడు. క్రెడిట్ కార్డుకు ఇచ్చిన చిరునామా వివరాల్లో తప్పులున్నాయని, వాటిని సరిచేసుకోవాలని తెలిపాడు. ఇందు కోసం ఎనీడెస్క్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించాడు. ఈ విషయాలపై పెద్దగా అవగాహన లేకపోవడంతో ఫోన్ చేసింది బ్యాంకు ఉద్యోగేనని నమ్మి, ఆ వ్యక్తి చెప్పినట్టే చేశాడు. అదే సమయంలో క్రెడిట్ కార్డు నుంచి రూ.52,000 డెబిట్ అయినట్టు సందేశం వచ్చింది. ఇంకేముంది కాల్ కట్. బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

ఆత్మ పరిశీలన

ముందు చెప్పుకున్నట్టు కొంత సమయం తీసుకుని, మనలో మనమే ఓ సారి అన్ని అంశాలను బేరీజు వేసుకుని, కచ్చితత్వాన్ని రూఢీ చేసుకోవాలి. ఎక్కడైనా ఏదైనా తేడా ఉందని అనిపిస్తే.. ఇక ఆ డీల్‌కు అంతటితో ముగింపు పలకాలి.



ముందు జాగ్రత్తలు

- ఓటీపీ, పిన్ వంటివి అస్సలు షేర్ చేయవద్దు.
- ఆర్‌బీఐ నుంచి, బ్యాంకు నుంచి, ఐఆర్‌డీఏఐ నుంచి, ఆదాయపన్ను శాఖ నుంచి కాల్ చేస్తున్నామంటూ వివరాలు అడిగితే అస్సలు చెప్పొద్దు. ఎందుకంటే ఆన్‌లైన్‌లో వివరాలు తీసుకోవాల్సిన అవసరం వారికి ఉండదు.
- వర్క్ ఫ్రమ్ హోమ్ పేరుతో వచ్చే లింక్‌లను క్లిక్ చేయకూడదు. ముందు మీకు అడ్వాన్స్ పంపిస్తామని.. వాట్సాప్‌కు పంపించే లింక్‌పై క్లిక్ చేసి వివరాలు నమోదు చేయాలని కోరితే, దాన్ని బ్లాక్ చేసేయండి.
- మోసం జరిగినట్టు గుర్తిస్తే వెంటనే సైబర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలి. బ్యాంకుకు సమాచారం ఇవ్వాలి.

- ఐఆర్‌డీఏఐ అనుమతిస్తే

హెల్త్ ఇన్సూరెన్స్‌లోకి ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్!

ముంబై: హెల్త్ ఇన్సూరెన్స్ వ్యాపారం తిరిగి ప్రారంభించేందుకు ఆసక్తితో ఉన్నట్టు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రకటించింది. ఇదేమీ కొత్త వ్యాపారం కాదని.. 2016 వరకు ఎన్నో ఏళ్లపాటు ఈ విభాగంలో సేవలు అందించినట్టు సంస్థ ఎండీ, సీఈవో ఎన్ఎస్ కన్నన్ పేర్కొన్నారు. జీవిత బీమా కంపెనీలు అచ్చమైన హెల్త్ ప్లాన్లను విక్రయించకుండా బీమా రంగ నియంత్రణ సంస్థ (ఐఆర్‌డీఏఐ) 2016లో నిషేధం విధించింది. అయితే, 2030 నాటికి అందరికీ ఆరోగ్య బీమాను చేరువ చేయాలన్న లక్ష్యంలో భాగంగా మరిన్ని సంస్థలను ఈ విభాగంలోకి అనుమతించనున్నట్టు ఐఆర్‌డీఏఐ చైర్మన్ దేశాశిష్ పాండా ఇటీవలే సంకేతం ఇచ్చారు. ఈ నేపథ్యంలో కన్నన్ తాజా ప్రకటన చేశారు.

పెన్షన్ ఫండ్ వ్యాపారంలోకి మ్యాక్స్‌లైఫ్

న్యూఢిల్లీ: పింఛను నిధి నిర్వహణ (పెన్షన్ ఫండ్) వ్యాపారంలోకి మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రవేశించింది. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ, డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) నుంచి వ్యాపారం ప్రారంభించేందుకు కావాల్సిన సర్టిఫికెట్ (సీవోబీ) మ్యాక్స్‌లైఫ్ అనుబంధ సంస్థ 'మ్యాక్స్ లైఫ్ పెన్షన్ ఫండ్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్'కు లభించింది. ''నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) పరిధిలో ఫండ్ మేనేజర్‌గా మ్యాక్స్ లైఫ్ పెన్షన్ ఫండ్ మేనేజ్‌మెంట్ పనిచేయనుంది. రూ.50 కోట్ల ఆరంభ మూలధనంతో అక్టోబర్ నుంచి సేవలు ప్రారంభించనుంది'' అని మ్యాక్స్‌లైఫ్ ఎండీ, సీఈవో త్రిపాఠి తెలిపారు.

సాక్షి స్టాక్స్

అమరరాజా బ్యాటరీస్	చోళ సెక్యూరిటీస్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 517 టార్గెట్: రూ. 700


ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) తొలి త్రైమాసికంలో అమరరాజా బ్యాటరీస్ ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో మొత్తం ఆదాయం 39 శాతం జంప్‌చేసి రూ. 2,620 కోట్లను తాకింది. విభిన్న విభాగాల్లో నమోదైన పటిష్ట వృద్ధి ఇందుకు దోహదపడింది. ప్రధానంగా ఆటోమోటివ్ రంగంలో ద్వితీయస్థాయి(ఆఫ్టర్ మార్కెట్) అమ్మకాలు జోరు చూపాయి. వీటికి జతగా 2వీలర్, 4వీలర్ కంపెనీల(ఓఈఎం) నుంచి భారీ డిమాండ్ కనిపించినట్లు కంపెనీ పేర్కొంది. కొన్నేళ్లుగా కంపెనీ లెడ్‌యాసిడ్ బ్యాటరీల మార్కెట్లో సొంతానికి ఫ్రాంచైజీలను విస్తరిస్తూ వచ్చింది. తద్వారా ఆఫ్టర్ మార్కెట్‌లో అమ్మకాలను పెంచుకుంటూ వచ్చింది. కంపెనీ ఇటీవల కస్టమర్ క్వాలిఫికేషన్ ద్వారా సెల్ తయారీపై సైతం దృష్టి సారించింది. ఇందుకు అనుగుణంగా లిథియాన్ సెల్ టెక్నాలజీపై రూ. 500–550 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే కొంతకాలంగా పరిశ్రమ సంబంధ సమస్యలకుతోడు.. కంపెనీ స్థాయిలో ఎదురైన కొన్ని సవాళ్ల ప్రభావంతో కంపెనీ ఆర్థిక పనితీరు మందగించింది. ఆటోమోటివ్ మార్కెట్లో తిరిగి డిమాండ్ ఊపందుకోవడంతో ఇకపై మెరుగైన ఫలితాలను సాధించే అవకాశముంది. కంపెనీ ప్రధాన విభాగం లెడ్‌యాసిడ్ బ్యాటరీల బిజినెస్‌పై దృష్టిపెడుతూనే నూతన ఇంధన రంగంలో ప్రవేశించే సన్నాహాలు చేస్తోంది.



ఎంఫసిస్ లిమిటెడ్	ఎమ్‌కే గ్లోబల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 2,166 టార్గెట్: రూ. 2,800

ఎందుకంటే: డిమాండ్ వాతావరణం, ఆదాయ వృద్ధి, మార్జిన్లపై సాఫ్ట్‌వేర్ రంగ కంపెనీ ఎంఫసిస్ యాజమాన్యం ఆశావహంగా స్పందిస్తోంది. కాంట్రాక్టులు గెలుపొందడం, భవిష్యత్‌లో కుదుర్చుకోనున్న డీల్స్, క్లయింట్లతో చర్చలు సానుకూలంగా ఉన్నట్లు కంపెనీ సీఎఫ్‌వో మనీష్ దుగార్ ఇటీవల పేర్కొన్నారు. అయితే మార్టిగేజ్ బలహీనతలు, క్వాంటమ్ కంప్యూటింగ్, బ్లాక్‌చైన్ తదితర హొరిజన్–3పై వ్యయాల వాయిదా, కొంతమంది క్లయింట్ల తాత్కాలిక వెనకడుగు వంటి అంశాలు సమీప కాలంలో సవాళ్లు సృష్టించే అవకాశముంది. అయినప్పటికీ భారీ డీల్స్ గెలుపొందడంలో ప్రత్యేక దృష్టి, విభిన్న సర్వీసులు అందించడంలో నిలకడైన విస్తరణ, క్లయింట్లను ఆకట్టుకోవడం, కొత్త క్లయింట్లను సంపాదించడం, డీల్ పరిమాణం, దీర్ఘకాలిక డీల్స్‌కు ప్రాధాన్యత వంటి అంశాలు కంపెనీ వృద్ధికి దోహదం చేయనున్నాయి. వెరసి ఈ ఆర్థిక సంవత్సరం(2022–23) తొలి త్రైమాసిక ఫలితాలను క్యూ2(జూలై–సెప్టెంబర్) పనితీరు అధిగమించే వీలుంది. ఈ ఏడాదికి నిర్వహణా లాభ మార్జిన్లను 15.25–17 శాతం స్థాయిలో సాధించనున్నట్లు కంపెనీ ఇప్పటికే అంచనాలు(గైడెన్స్) ప్రకటించింది. క్యూ1లో ఇవి 15.3 శాతంగా నమోదయ్యాయి. ఇకపై నిలకడతో మరింత మెరుగుపడనున్నట్లు కంపెనీ భావిస్తోంది. యుటిలైజేషన్ పుంజుకోవడం, పెరిగిన ఆఫ్‌షోర్ సేవలు, కాంట్రాక్టుల ధరల బలిమి, తగ్గిన ఉద్యోగ వ్యయాలు లబ్ధిని చేకూర్చనున్నాయి.



గమనిక: షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే..

ఏజిస్ అష్యూర్డ్ ఇన్‌కమ్ ప్లాన్

హైదరాబాద్: ఏజిస్ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్ 'అష్యూర్డ్ ఇన్‌కమ్ ప్లాన్'ను ప్రారంభించింది. ఇది నాన్ పార్టిసిపేటింగ్ సేవింగ్ ప్లాన్. పాలసీదారుపై ఆధారపడిన కుటుంబ సభ్యులు సౌకర్యవంతంగా తమ ఆర్థిక అవసరాలను అధిగమించేలా ఈ ప్లాన్‌ను రూపొందించినట్టు సంస్థ ప్రకటించింది. షార్ట్ టర్మ్ ఇన్‌మక్, లాంగ్ టర్మ్ ఇన్‌కమ్, లైఫ్ లాంగ్ ఇన్‌కమ్ అనే మూడు ఆప్షన్లు ఉన్నాయి. వీటిలో పాలసీదారులు తమకు అనుకూలమైనది ఎంపిక చేసుకోవచ్చు. జీవితంలో వివిధ దశల్లో తమ ఆర్థిక అవసరాలను ఈ పాలసీ తీరుస్తుందని కంపెనీ పేర్కొంది.



వారసత్వంగా వచ్చిన ఫండ్స్‌పై పన్ను..?




ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నాకు వారసత్వంగా వచ్చిన ఫండ్స్ ప్రస్తుత విలువ రూ.10 లక్షలు. కానీ, వాటిని కొనుగోలు చేసిన సమయంలో చేసిన పెట్టుబడి రూ.5 లక్షలే. నేను విక్రయించే సమయంలో రూ.15 లక్షలు ఉంటే అప్పుడు మూలధన లాభాల పన్నును ఎలా లెక్కిస్తారు? వాస్తవంగా కొనుగోలు చేసిన ధర నుంచి చూసి పన్ను చెల్లించాలా..? లేక నాకు బదిలీ అయిన నాటి విలువనే పరిగణనలోకి తీసుకుంటారా?

– తరుణ్

మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడిదారు మరణిస్తే ఆ యూనిట్లను నామినీ లేదా చట్టబద్ధమైన వారసులకు బదిలీ చేస్తారు. ఇలా ఒక సారి బదిలీ చేసిన తర్వాత పన్ను అంశంపై సందేహం ఏర్పడడం సహజమే. అదృష్టవశాత్తూ మనదేశంలో వారసత్వ పన్ను లేదు. మీ తల్లిదండ్రులు లేదా మరొకరి నుంచి మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లు మీకు బదిలీ అయితే పన్ను చెల్లించక్కర్లేదు. కాకపోతే ఆ యూనిట్లను విక్రయించినప్పుడు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లను విక్రయించినప్పుడు ఉండే బాధ్యతలే మీకు వర్తిస్తాయి. మూలధన లాభాల పన్ను విషయానికొస్తే ఆ పెట్టుబడిని ఎంత కాలం కొనసాగించారు (అసలు కొనుగోలు నాటి నుంచి) అనే దాని ఆధారంగా నిర్ణయానికి రావాలి. ఇక్కడ అసలు మొదట కొనుగోలు చేసిన తేదీనే పన్ను కోసం పరిగణనలోకి తీసుకుంటారు. మీకు బదిలీ అయిన తేదీ లెక్కలోకి రాదు. ఉదాహరణకు రవి తండ్రి రూ.5 లక్షలను ఓ పథకంలో 2019లో ఇన్వెస్ట్ చేశాడని అనుకుందాం. అప్పుడు అతని తండ్రి యూనిట్ దారు అయితే, రవి నామినీ అవుతారు. దురదృష్టవశాత్తూ రవి తండ్రి గతేడాది మరణించారు. ఆయన పేరిట ఉన్న యూనిట్లు రవికి బదిలీ అయ్యాయి. బదిలీ అయ్యే నాటికి ఫండ్స్ పెట్టుబడుల విలువ రూ.7 లక్షలుగా ఉంది. ఇప్పుడు వాటి విలువ రూ.7.80 లక్షలు ఉంది. రవి ఆ పెట్టుబడులను విక్రయించాలని అనుకుంటున్నాడు. ఇక్కడ పెట్టుబడులను 2019 నుంచి కొనసాగించినట్టు చూస్తారు. ఈక్విటీ పథకంలో పెట్టుబడులు కనుక హోల్డింగ్ పీరియడ్ ఏడాదికిపైనే ఉంది. లాభం దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను కిందకు వస్తుంది. మొదటి రూ.లక్ష లాభాన్ని మినహాయించి మిగిలిన లాభంపై 10 శాతాన్ని పన్ను చెల్లించాల్సి ఉంటుంది. విక్రయించే నాటి విలువ రూ.7.80 లక్షల్లో పెట్టుబడి రూ.5 లక్షలు మినహాయిస్తే అప్పుడు లాభం రూ.2.80 లక్షలు అవుతుంది. రూ.లక్ష లాభం మినహాయిస్తే, మిగిలిన రూ.1.80 లక్షల లాభంపై 10 శాతం పన్ను చొప్పున రూ.18,000 చెల్లించాలి.



ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్‌వోఎఫ్) వల్ల లాభాలేంటి?

– రవీంద్రనాథ్ గణేశ్

ఫండ్ ఆఫ్ ఫండ్ అంటే సమీకరించిన పెట్టుబడులను తీసుకెళ్లి మరో మ్యూచువల్ ఫండ్ పథకంలో ఇన్వెస్ట్ చేసేది. వాటి పెట్టుబడుల విధానానికి అనుగుణంగా డెట్ లేదా ఈక్విటీల్లో ఒకటి లేదా ఒకటికి మించిన పథకాల్లో ఇన్వెస్ట్ చేయవచ్చు. సాధారణంగా ఎఫ్‌వోఎఫ్‌లను ఆయా ఫండ్స్ హౌస్‌లు వాటికి సంబంధించిన ఈటీఎఫ్‌ల్లో ఇన్వెస్ట్ చేసేందుకు ప్రారంభిస్తుంటాయి. ఎఫ్‌వోఎఫ్‌లు ఇతర మ్యూచువల్ ఫండ్స్ పథకాల మాదిరే పనిచేస్తాయి. వీటిల్లోనూ సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో పెట్టుబడి పెట్టుకోవచ్చు. విదేశీ సూచీలు, విదేశీ మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసే ఎఫ్‌వోఎఫ్‌లు కూడా ఉన్నాయి. ఇతర పథకాల మాదిరే ఎఫ్‌వోఎఫ్‌ల్లోనూ ఎక్స్‌పెన్స్ రేషియో ఉంటుంది. ఎఫ్‌వోఎఫ్‌లు వేరే పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తాయి కనుక రెండంచెల్లో ఎక్స్‌పెన్స్ రేషియో భారాన్ని మోయాల్సి ఉంటుందని గుర్తుంచుకోవాలి. ఉదాహరణకు ఎఫ్‌వోఎఫ్‌లో 1 శాతం ఎక్స్‌పెన్స్ రేషియో ఉందనుకుంటే, అది ఇన్వెస్ట్ చేసే పథకం ఎక్స్‌పెన్స్ రేషియో 0.50 శాతం ఉంటే మొత్తం 1.5 శాతం ఎక్స్‌పెన్స్ రేషియో భరించాలని అర్థం చేసుకోవాలి. ఎఫ్‌వోఎఫ్ ఇన్వెస్ట్ చేసే పథకంలో నేరుగా ఇన్వెస్టర్లు పెట్టుబడులకు అవకాశం లేనప్పుడు వీటిని పరిశీలించొచ్చు. ఎఫ్‌వోఎఫ్‌లు నాన్ ఈక్విటీ పథకంగా పరిగణిస్తారు. కనుక డెట్ పథకాలకు మాదిరే మూలధన లాభాలపై పన్ను అమలవుతుంది. ఒకవేళ ఎఫ్‌వోఎఫ్ దేశీయ ఈక్విటీ పథకాల్లోనే 90 శాతానికిపైగా పెట్టుబడి పెడితే ఈక్విటీకి మాదిరే మూలధన లాభాల పన్ను వర్తిస్తుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-8-2022	
విశాఖ	425–00
చిత్తూరు	443–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	405–00
విజయవాడ	405–00
రిటైల్ ధర (డజను)	60.00
28-8-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	385–00
వరంగల్	387–00
రిటైల్ ధర	4.45

భావి ఇంధనం గ్రీన్ హైడ్రోజన్

భారత్‌తోపాటు పలు దేశాల్లో ముమ్మరంగా పరిశోధనలు

- ఒకసారి హైడ్రోజన్ నింపితే సుదీర్ఘ ప్రయాణం.. వేగంగా, సులభంగా రీ ఫ్యూయలింగ్
- దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరం లేదు.. భారత్‌లో రోడ్డెక్కిన తొలి హైడ్రోజన్ బస్సు
- కార్ల ఉత్పత్తి కూడా ప్రారంభం

(సాక్షి ప్రతినిధి, అమరావతి)

విద్యుత్ వాహనాల్లో వాడే లిథియం అయాన్ బ్యాటరీ తయారీలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా గ్రీన్ హైడ్రోజన్‌ను ముందుకు తెస్తున్నారు శాస్త్రవేత్తలు. దీనిని భవిష్యత్ ఇంధనంగా కూడా చెబుతున్నారు. విద్యుత్ వాహనాల్లో గ్రీన్ హైడ్రోజన్‌ను ఇంధనంగా ఉపయోగించుకొని నడిచే ఫ్యూయల్ సెల్ ఆధారిత వాహనాల మీదా పలు దేశాలతోపాటు మన దేశంలోనూ ముమ్మరంగా పరిశోధనలు జరుగుతున్నాయి. గ్రీన్ హైడ్రోజన్ మీద నడిచే వాహనాలనూ (ఫ్యూయల్ సెల్ ఎలక్ట్రానిక్ వెహికల్స్) (ఎఫ్‌సీఈవీ) దేశంలో తయారు చేశారు. కాలుష్య రహితంగా రవాణా రంగం రూపు మార్చడానికి గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. అదే సమయంలో కొన్ని సవాళ్లనూ మన ముందు ఉంచింది.

కాలుష్యానికి చోటే లేదు
ముడి పదార్థాల సమస్య లేదు

ఇంధన
వ్యయమూ తక్కువే



ఇదీ సాంకేతికత

హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య ఎలక్ట్రో కెమికల్ రియాక్షన్ వల్ల విద్యుత్ పుడుతుంది. ఈ శక్తిని వాడుకుని ఇంజన్ నడుస్తుంది. లిథియం అయాన్ బ్యాటరీ తయారీలో వాడే ముడిపదార్థాల లభ్యత మన దేశంలో తక్కువగా ఉండటం మనకు సమస్య. కానీ హైడ్రోజన్ ఉత్పత్తి చేయడంలో ఉపయోగించే ముడి పదార్థాల సమస్య మనకు లేదు.

రానురాను తక్కువ ధరకే ఇంధనం

దేశంలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి గట్టి ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనికి పన్ను రాయితీలతో పాటు ఇతర రాయితీలను కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోంది. పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తి ధరలు తగ్గుతున్నందున, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి ధరలు కూడా క్రమేణా తగ్గుతాయని నీతి ఆయోగ్ 'హార్నెసింగ్ గ్రీన్ హైడ్రోజన్' నివేదికలో వెల్లడించింది. ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం గ్రీన్ హైడ్రోజన్ ఒక కిలో ఉత్పత్తి చేయడానికి 2030లో 1.6 డాలర్లు, 2050కి 0.7 డాలర్లు అవుతుందని నీతి ఆయోగ్ అంచనా వేసింది.

హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ ఎలక్ట్రిక్ వెహికల్స్‌తో ప్రయోజనాలు ఇవీ..

- ఒకసారి హైడ్రోజన్ నింపితే సుదీర్ఘ ప్రయాణం చేయొచ్చు. లిథియం అయాన్ బ్యాటరీ వాహనాలతో పోలిస్తే దీని రేంజ్ బాగా ఎక్కువ
- రీ ఫ్యూయలింగ్ సులభం. వేగంగా పూర్తి చేయొచ్చు. చార్జింగ్ అవసరం లేదు. బ్యాటరీ చార్జ్ అయ్యే వరకు వేచి చూసే అవసరం ఉండదు.
- కాలుష్యం వెలువడదు
- దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరం లేదు. అందువల్ల హైడ్రోజన్‌ను ప్రభుత్వాలు చౌకగా అందించే అవకాశం ఉంది. చౌకగా లభ్యమయితే వ్యయమూ బాగా తగ్గుతుంది.

సవాళ్లూ ఉన్నాయి..

- హైడ్రోజన్‌కు మండే స్వభావం ఎక్కువ. నిల్వ చేసిన ట్యాంకు లోహాన్ని పెళుసుగా మార్చే గుణం ఉంటుంది. ఫలితంగా లీకేజీకి అవకాశాలు ఉంటాయి.
- హైడ్రోజన్ ఉత్పత్తి అత్యంత జటిలమైన ప్రక్రియ. ఉత్పత్తి వ్యయాన్ని ఇప్పుడే అంచనా వేయలేం. గ్రీన్ హైడ్రోజన్ కాకపోతే ఉత్పత్తి సమయంలో కాలుష్యం వెలువడుతుంది. సంప్రదాయ శిలాజ ఇంధనాలను ఉత్పత్తికి వాడితే వ్యయం తక్కువగా ఉంటుందని ఆశించలేం.
- ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ప్రకారం.. హైడ్రోజన్ నిల్వ, రవాణా కష్టమైన అంశాలు. అందువల్ల రవాణా కూడా ఖరీదే.
- దేశంలో డిమాండ్‌కు అనుగుణంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి చాలా సమయం పడుతుంది. వాహనాల తయారీతో పాటు గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి టెక్నాలజీ మీద ఏక కాలంలో పనిచేయాలి.

హైడ్రోజన్ పలు రకాలు

ఉత్పత్తి విధానాన్ని బట్టి హైడ్రోజన్‌ను 6 రకాలుగా విభజించారు

1. గ్రీన్ హైడ్రోజన్
ఎలక్ట్రోలసిస్ ద్వారా నీటిని వినియోగించి హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తారు. ఈ విధానంలో పవన, సౌర విద్యుత్ లాంటి పునరుత్పాదక వనరులు వాడతారు. ఈ విధానంలో కాలుష్యానికి చోటు లేదు.

2. వైట్ హైడ్రోజన్ (సహజ హైడ్రోజన్)
శిలాజ ఇంధనాలు, సహజ వాయువు లభించినట్లుగానే హైడ్రోజన్ కూడా భూమిలో లభిస్తుంది. సహజ వాయువు ఉత్పత్తి మాదిరే డ్రిల్లింగ్ పద్ధతిలో హైడ్రోజన్‌ను వెలికితీయవచ్చు. అయితే వాణిజ్య పరంగా ఇది ఖరీదైన వ్యవహారం. పరిశోధనలకు మాత్రమే ఈ విధానాన్ని శాస్త్రవేత్తలు వాడుతున్నారు.

3. బ్లూ హైడ్రోజన్
బయోగ్యాస్‌ను బయోమీథేన్‌గా మార్చి హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తారు. ఈ విధానంలో కార్బన్ డై ఆక్సైడ్ అత్యంత కనిష్ట స్థాయిలో వెలువడుతుంది. ఇంటర్నేషనల్ ఎనర్జీ అసోసియేషన్ (ఐఈఏ) అంచనా ప్రకారం.. క్లీన్ ఎనర్జీరంగంలో 2050 నాటికి హైడ్రోజన్ ఉత్పత్తికి ఇదొక్కటే విధానం అనుసరిస్తారు.

4. పింక్ హైడ్రోజన్
ఎలక్ట్రోలసిస్ ద్వారా నీటిని వినియోగించి దీనిని ఉత్పత్తి చేస్తారు. విద్యుత్‌ను న్యూక్లియర్ ఎనర్జీ నుంచి తీసుకుంటారు.

5. యెల్లో హైడ్రోజన్
ఎలక్ట్రోలసిస్ ద్వారా నీటిని వినియోగించి దీనిని ఉత్పత్తి చేస్తారు. సంప్రదాయ విధానంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను దీనికి వాడతారు.

6. బ్లాక్, బ్రౌన్ హైడ్రోజన్
హైడ్రోజన్ ఉత్పత్తికి బొగ్గు వాడితే బ్లాక్, లిగ్నైట్ వాడితే బ్రౌన్ హైడ్రోజన్ అంటారు. ఇది కాలుష్య కారకమైన విధానం.

హైడ్రోజన్ కారు తయారయింది



టయోటా, ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆటోమోటీవ్ టెక్నాలజీ (ఐసీఏటీ) పైలెట్ ప్రాజెక్టు కింద హైడ్రోజన్ ఇంధన వాహనాన్ని తయారు చేశాయి. 'టయోటా మిరాయ్' పేరిట రూపొందించిన ఈ కారును కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల విడుదల చేశారు. ఇన్‌టేక్ గ్రిల్ ద్వారా గాలిలోని ఆక్సిజన్ తీసుకొని, ఇంధన ట్యాంకులోని హైడ్రోజన్‌తో సంయోగం చెంది.. ఇంజన్ నడవడానికి కావాల్సిన శక్తిని విడుదల చేస్తుంది. పొగ గొట్టం నుంచి పొగ కాకుండా, నీరే వస్తుంది.

పుణేలో రోడ్డెక్కిన తొలి హైడ్రోజన్ బస్సు



కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్), పుణేలోని మల్టీ నేషనల్ సాఫ్ట్‌వేర్ సంస్థ కేపీఐటీ కలిసి హైడ్రోజన్‌తో నడిచే బస్సును తయారు చేసి గత వారం రోడ్డెక్కించాయి. దేశంలో ఇదే తొలి హైడ్రోజన్ బస్సు. సాధారణ డీజిల్ బస్సు ఏడాది పాటు తిరిగితే కనీసం 100 టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ విడుదల చేస్తుందని సీఎస్ఐఆర్ తెలిపింది. డీజిల్ బస్సులు దేశంలో లక్షల సంఖ్యలో ఉన్నాయని వాటి నుంచి వెలువడే కాలుష్యం అత్యధికమని పేర్కొంది.

క్లుప్తంగా

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తులు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): తిరుపతిలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రీషియన్ (ఎస్ఐహెచ్ఎం) కళాశాలలో 2022–23 కి ఆఖరి విడత అడ్మిషన్లలో భాగంగా పలు హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ గిరిబాబు, అడ్మిషన్స్ కో–ఆర్డినేటర్ శివరామకృష్ణ ఆదివారం తెలిపారు. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న హోటళ్లలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. కోర్సు ఫీజు చెల్లింపునకు బ్యాంకులు రుణం కూడా మంజూరు చేస్తాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఎస్ఐహెచ్ఎంటీపీటీ.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో సెప్టెంబర్ 3 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 97004 40604, 97007 34601, 97013 43846కు సంప్రదించాలని కోరారు.

నేటితో అభ్యంతరాల స్వీకరణ గడువు ముగింపు

సాక్షి, అమరావతి: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి వచ్చిన దరఖాస్తులకు సోమవారంతో అభ్యంతరాల స్వీకరణ గడువు ముగియనుంది. మొత్తం 622 పోస్టుల భర్తీని వైద్య శాఖ చేపడుతోంది. ఇందులో 375 పోస్టులు ప్రత్యక్షంగా, 247 పోస్టులను లాటరల్ ఎంట్రీ రూపంలో భర్తీ చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రత్యక్షంగా భర్తీ చేపడుతున్న పోస్టులకు వచ్చిన దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. పరిశీలన అనంతరం దరఖాస్తుదారుల జాబితాను https://dme.ap.nic.in/ వెబ్‌సైట్‌లో ప్రదర్శించి అభ్యంతరాలను స్వీకరిస్తున్నారు. అభ్యంతరాల స్వీకరణ గడువు సోమవారం సాయంత్రం 5 గంటలకు ముగియనుంది. అభ్యంతరాలను dmeaprecruitment@gmail. com కు అభ్యర్థులు మెయిల్ చేయాల్సి ఉంటుంది. అభ్యంతరాలకు సంబంధించిన ధ్రువపత్రాలను సైతం మెయిల్‌లో పంపాల్సి ఉంటుంది.

విద్యా రంగంలో టీటీడీ సేవలు భేష్

- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్



కేంద్ర మంత్రికి జ్ఞాపిక అందిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: విద్యా రంగంలో టీటీడీ అందిస్తోన్న సేవల్ని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ కొనియాడారు. ఆదివారం ఢిల్లీలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన శ్రీవేంకటేశ్వర కాలేజ్ డైమండ్ జూబ్లీ వేడుకలకు కేంద్ర మంత్రి హాజరయ్యారు. కళాశాలకు నాక్‌లో ఏ+ గ్రేడ్ వచ్చినందుకు యాజమాన్యం, అధ్యాపక సిబ్బందిని అభినందించారు. అన్ని రంగాల్లోనూ కళాశాల అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం డైమండ్ జూబ్లీ సావనీర్‌ను కేంద్రమంత్రి ఆవిష్కరించారు. యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ జగదీష్ కుమార్ మాట్లాడుతూ..జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా కళాశాలలో పలు భారతీయ భాషల్లో విద్యా బోధన జరగడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఢిల్లీ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ యోగేష్ సింగ్, కళాశాల ప్రిన్సిపాల్ షీలా రెడ్డి పాల్గొన్నారు. డైమండ్ జూబ్లీ సందర్భంగా కళాశాలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, సెమినార్లు నిర్వహించారు. కళాశాల పూర్వ విద్యార్థులైన ఎయిమ్స్ డైరెక్టర్, ప్రముఖ కథక్ నృత్యకారిణులు కమలిని, నళినిలతో పాటు పలువురిని సత్కరించారు.

6వేల సచివాలయాల భవన నిర్మాణాలు పూర్తి

లక్కవరపుకోట: రాష్ట్రంలో ఇప్పటి వరకు ఆరు వేల సచివాలయాలకు భవనాలను నిర్మించి వినియోగంలోకి తీసుకొచ్చామని పంచాయతీ రాజ్ శాఖ రాష్ట్ర ఇంజినీర్ ఇన్ చీఫ్ సుబ్బారెడ్డి తెలిపారు. విజయనగరం జిల్లా లక్కవరపు కోట మండలంలోని గొల్జాంలో నిర్మిస్తున్న గ్రామ సచివాలయ భవనాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మరో రెండు వేల భవనాల పనులు చివరి దశకు చేరాయని తెలిపారు.

మిలియన్ మార్చ్‌కు అనుమతి లేదు

గుంటూరు కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

సాక్షి, అమరావతి: సీపీఎస్ ఉద్యోగులు ఈ నెల 1న తలపెట్టిన మిలియన్ మార్చ్‌కు ఎలాంటి అనుమతి లేదని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదివారం స్పష్టం చేశారు. ఉద్యోగులందరూ ఒకటో తేదీన కచ్చితంగా విధులకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు. శాంతి భద్రతల సమస్య తలెత్తి, హింసాత్మక ఘటనలు జరిగే అవకాశమున్నందున ఉద్యోగులను ఈ కార్యక్రమానికి అనుమతించడం లేదని చెప్పారు. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలోని ఉద్యోగులంతా విధులకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. ఎవరికీ సెలవు మంజూరు చేయొద్దని ఆదేశించారు.

సెప్టెంబర్ చివరిలో ఫిర్యాదుల పరిష్కార శిబిరాలు

- ఏపీ ఎస్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సీతారామమూర్తి



గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఏపీఎస్‌హెచ్‌ఆర్సీ) ఆధ్వర్యంలో సెప్టెంబర్ చివరి వారంలో గుంటూరు, విజయవాడల్లో ఫిర్యాదుల పరిష్కార శిబిరాలను నిర్వహించనున్నట్లు కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎం.సీతారామమూర్తి చెప్పారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) ఏపీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులోని జేసీ లా కళాశాలలో నిర్వహించిన న్యాయ విద్యార్థుల రాష్ట్ర కన్వెన్షన్‌లో ఆయన పాల్గొన్నారు. మానవ హక్కుల ఉల్లంఘన కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు కమిషన్ కృషి చేస్తోందన్నారు. మానవ హక్కుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు సగటున 30 కేసుల వరకు ఎస్‌హెచ్‌ఆర్సీ విచారిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజ్యాంగంలో పొందుపర్చిన మౌలిక సూత్రాలు, చట్టాలు, పౌరులకు కల్పించిన హక్కులపై క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని న్యాయ విద్యార్థులు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఏఐఎల్‌యూ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు సుంకర రాజేంద్ర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● తెలంగాణ

రాజకీయ పంథాలో రైతు ఉద్యమం

- తెలంగాణ సీఎం కేసీఆర్




సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ ఉద్యమం తరహాలో రైతుల ఉద్యమానికి పార్లమెంటరీ పంథాను సమన్వయం చేసి, జమిలి పోరాటాలు సాగించాలి. అప్పుడే దేశ వ్యవసాయ, రైతాంగ సమస్యలకు పరిష్కారం సాధ్యం.' అని తెలంగాణ సీఎం కె.చంద్రశేఖరరావు చెప్పారు. రైతుల ఆత్మగౌరవం కోసం అందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. జాతీయ స్థాయి రైతు సంఘాల నేతలతో రెండో రోజు ఆదివారం కూడా ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ సమావేశమయ్యారు. దేశ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. రైతు నేతలు రాజకీయాలనే పవిత్ర యజ్ఞంలో భాగస్వాములై, దేశ రైతాంగ సమస్యల పరిష్కారానికి పాటుపడాలని కేసీఆర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. 'ఎక్కడ ఆందోళన అవసరమో అక్కడ ఆందోళన చేద్దాం, ఎక్కడ రాజకీయాలు అవసరమవుతాయో అక్కడ రాజకీయాలు చేద్దాం. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు. మన శక్తిని మనం గుర్తించడంలో వెనుకబడి ఉన్నాం. రాజకీయాల్లో ఉండటం అపవిత్రం అనుకోవడం సరికాదు. జమిలిగా పోరాడుదాం. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను, అంశాలను మీ ప్రాంతాల్లోని సంఘాల నేతలు, రైతులతో చర్చించండి. వారి నుంచి సలహాలు, సూచనలు తీసుకోండి. మళ్లీ సమావేశమై జాతీయ స్థాయిలో ఐక్య సంఘటనను నిర్మిద్దాం. దేశ వ్యాప్తంగా గ్రామగ్రామానికి చేరుకునేలా రైతుల ఐక్యత చాటుదాం. దేశం నలుమూలల నుంచి రైతుల డిమాండ్లను విందాం. శాస్త్రవేత్తలు, ఆర్థికవేత్తలు, మేధావులు, జర్నలిస్టులను పిలిచి లోతైన చర్చలు, విశ్లేషణలు చేద్దాం. ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేసుకుందాం. రాష్ట్ర, జిల్లా, తాలూకా, గ్రామ స్థాయిలో ఫెడరల్ స్ఫూర్తితో సంఘాల నిర్మాణం చేద్దాం. రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిద్దాం. రైతుల సమస్యల పరిష్కార భావజాలాన్ని దేశంలోని అన్ని గ్రామాల్లో వ్యాప్తి చేద్దాం.' అని కేసీఆర్ అన్నారు. ఢిల్లీ, హైదరాబాద్ సహా ఉత్తర, దక్షిణ భారత దేశాలను అనుసంధానం చేసేందుకు రైతు కార్యాలయాలను ఏర్పాటు చేసుకుందామని రైతు సంఘాల నేతలకు ఆయన సూచించారు. దేశ రైతును ఆత్మగౌరవంతో తలెత్తుకొని తిరిగే 'అవ్వల్ దర్జా కిసాన్'గా తయారు చేద్దామని పిలుపునిచ్చారు.

నూనె, ఉప్పు లేదు .. పాలు, పండ్లు లేవు

ఆరు గంటల నిద్ర .. 118 ఏళ్లుగా యోగా

- ఇవే నా దీర్ఘాయువు వెనుక రహస్యాలు
- చాలామంది తినడానికి జీవిస్తారు.. నేను జీవించడానికే తింటాను
- కర్ర లేకుండా నడుస్తా.. ఆసనాలు ప్రదర్శిస్తా
- సాక్షితో 126 ఏళ్ల యోగా గురు, పద్మశ్రీ స్వామి శివానంద



సాక్షి, హైదరాబాద్: ఎనిమిదేళ్ల వయస్సు నుంచే యోగాభ్యాసం.. వైవిధ్య భరితమైన భారతీయ సాంస్కృతిక జీవితానికి సమున్నతమైన ప్రతిరూపం. ప్రపంచంలోనే పెద్ద వయస్కులుగా భావించే నూటా ఇరవై ఆరు సంవత్సరాల పద్మశ్రీ స్వామి శివానంద .. రుషులు, మహర్షులకు మాత్రమే సాధ్యమైన పరిపూర్ణతను తన నిరాడంబర జీవన విధానం ద్వారా సుసాధ్యం చేశారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ బాల్య స్నేహితుడైన స్వామి శివానంద.. 118 ఏళ్లుగా యోగ, ప్రాణాయామం చేస్తూ, ఆహార నియమాలు పాటిస్తూ.. ఇప్పటికీ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉన్న ఆయన జీవన విధానం యావత్ ప్రపంచానికే స్ఫూర్తిదాయకం. మూడు శతాబ్దాలను చూసిన ఈ యోగా గురు ఆదివారం నగరంలోని హైటెక్స్ వేదికగా నిర్వహించిన యోగానమామి అనే యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి శివానంద సాక్షితో ప్రత్యేకంగా తన జీవితానుభవాలను పంచుకున్నారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

ఇవే నా దీర్ఘాయువు రహస్యం

డబ్బు లేని జీవితం, దానాలు, కోరికలు లేవు, నూనె, ఉప్పు, పాలు, పండ్లు ఇవేమీ నా జీవితంలో లేవు. ఉదయాన్నే 3 గంటలకు నిద్ర లేవడం, రాత్రి 9 గంటలకే పడుకోవడం, 118 సంవత్సరాలుగా యోగా.. ఇదే నా దీర్ఘాయువు రహస్యం. ఒకప్పటి బెంగాల్ ప్రెసిడెన్సీ, ఇప్పటి బంగ్లాదేశ్‌లో 1896 ఆగస్టు 8న జన్మించాను. నేను పుట్టిన ఆరు సంవత్సరాలకే భిక్షాటన చేసుకుంటూ జీవనం కొనసాగించే నా తల్లిదండ్రులు, సోదరి మరణించారు. తదనంతరం నా గురువు ఓంకారానంద గోసామి దగ్గరే నా జీవితం కొనసాగింది. అలా ఎనిమిదేళ్ల వయస్సు నుంచే యోగా చేయడం ప్రారంభించాను. పురాతన, సాధారణ జీవన విధానాన్ని పాటించే నేను రెండు పూటల ఆహారం మాత్రమే తింటాను. అల్పాహారం చాలా అరుదుగా తింటాను, అందులోనూ ఉడికించిన బంగాళదుంపలు తింటాను. మధ్యాహ్నం రెండు చపాతీలు, ఉడకబెట్టిన బంగాళదుంపలు–కూరగాయలు, రాత్రి 8 గంటల సమయంలో బార్లీ, గంజి ఆహారంగా తీసుకుంటాను. ఏది తిన్నా అతి తక్కువ పరిమాణంలో తింటాను.

నేతాజీ నా బాల్య స్నేహితుడే..

ఎక్కువ సంవత్సరాలు జీవించాలంటే సర్వాంగాసనం, మత్స్యాసనం వేయాలి. ఇవి జీవితాన్ని పునరుజ్జీవింపజేస్తాయి. గత 35 ఏళ్లుగా ఆరు ఖండాల్లో ప్రయాణించాను. ఒకానొక సమయంలో మిడిల్ ఈస్ట్‌లోని ఇమ్మిగ్రేషన్ అధికారులు పాస్‌పోర్ట్‌లో నా పుట్టిన తేదీని చూసి ఆశ్చర్యపోయారు. సుభాష్ చంద్రబోస్ నా బాల్య స్నేహితుడే. ఆయన, నేను దాదాపు ఒకే సంవత్సర కాలంలో జన్మించాం. పద్మశ్రీ పురస్కారం అందుకున్న సందర్భంగా ప్రధాని మోదీని కలిశాను.

జీవించడానికి తింటాను..

చాలామంది తినడానికి జీవిస్తారు కానీ నేను జీవించడానికి తింటాను. దినచర్యలో భాగంగా తెల్లవారుజామున 3 గంటలకు లేచి అభ్యంగన స్నానం చేసి గంటసేపు అలా నడుస్తాను. అనంతరం యోగా, పూజలు, ప్రార్థనల్లో నిమగ్నమవుతాను. పగలు రెండు గంటలు నిద్రించని విశ్రాంతి తీసుకుంటాను. బ్రహ్మచర్య జీవితాన్ని గడుపుతున్న నాకు కుటుంబ సభ్యుల్లేరు. బ్రహ్మచారిగా వారణాసిలో నివసిస్తున్నా. అతి తక్కువగా మాట్లాడతాను. అనవసర సంభాషణలు, మానసిక ఆరోగ్యానికి మంచివి కాదని నా అభిప్రాయం. ఇప్పటికీ ఎలాంటి వ్యాధులు నా దరి చేరలేదు. మందులు వాడాల్సిన అవసరం రాలేదు. ఈ వయస్సులో కూడా కర్రలేకుండా నడుస్తాను, పశ్చిమోత్తనాసనం, సర్వాంగాసనం, పవన ముక్తాసనాలను ప్రదర్శిస్తాను. అత్యంత ఎక్కువ వయసున్న వ్యక్తిగా వరల్డ్‌వైడ్ బుక్ రికార్డ్‌లో స్థానం పొందాను.

రుచికరమైన ఆహారం, ఫాస్ట్ ఫుడ్‌కి పూర్తిగా దూరంగా ఉంటాను.

యోగాకు ఆదరణ పెరిగింది

వందేళ్ల ప్రయాణంలో యోగా విధానంలో పలు మార్పులను గమనించాను. అప్పుడైనా ఇప్పుడైనా యోగా అనేది ఒక్కటే. గత కొన్ని సంవత్సరాలుగా యోగాకు ఆదరణ పెరిగింది. యోగా విధానాల్లో సందిగ్ధాలు ఉన్నప్పటికీ యోగాభ్యాసం, శ్వాస, ధ్యానం దాని ముఖ్యాంశాలు. యోగా గురు రామ్‌దేవ్ బాబా ఆచరిస్తున్న జీవన విధానం కూడా నాకు ఇష్టం. తను ఎంతో కృషి చేస్తున్నారు.

నా దృష్టిలో మనిషే దైవం

నా చిన్నతనంలో ఆకలి కడుపును నింపుకోడానికి భిక్షాటన చేసేవాళ్లం. అందులోని బాధ, అవస్థలు నాకు తెలుసు. ఈ దేశంలో ఇప్పటికీ కొందరు పేదలు పాలు, పండ్లు లేని జీవితాన్ని గడుపుతున్నారు. అందుకే నేను కూడా పాలు, పండ్లు తినడం మానేశాను. నా దృష్టిలో మనిషే దైవం. మనుషులకు సేవ చేస్తే దైవానికి చేసినట్టే. అలాంటి మనుషులైన కుష్టు వ్యాధిగ్రస్తులను సమాజం వెలేసింది. వారికి సాంత్వన అందించాలనే ఉద్దేశంతో గత 50 ఏళ్లుగా వారికి సేవలు అందిస్తున్నా. పూరీలోని 600 వందల మంది కుష్టు రోగులకు అన్ని అవసరాలు తీరుస్తూ అండగా ఉంటున్నా. నాకు సంబంధించి ఎలాంటి పుస్తకాలు, మరే ఇతర మాధ్యమాలు లేవు. నా జీవితమే ఒక సందేశం. హైదరాబాద్ రావడం ఇదే మొదటిసారి. హైదరాబాదీలు ఎంతో ఆత్మీయతను కలిగి ఉంటారు.

ఫస్ట్ పేపర్లో ఫిజిక్స్, సెకండ్ పేపర్లో మ్యాథ్స్ కఠినం

- జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ప్రశ్నల తీరు.. పేపర్ 1లో లెంగ్తీ, రెండో పేపర్లో డిఫికల్టీ
- ఫిజిక్స్, కెమిస్ట్రీలో మోడరేట్ ప్రశ్నలు
- 3న ప్రాథమిక కీ విడుదల
- 4వ తేదీ సాయంత్రం వరకు అభ్యంతరాల స్వీకరణ
- 11న తుది కీ, ఫలితాల ప్రకటన



సాక్షి, అమరావతి: ఐఐటీలలో ప్రవేశానికి సంబంధించిన జేఈఈ అడ్వాన్స్‌డ్–2022 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఐఐటీ ముంబయి ఈ పరీక్షను ఉదయం, మధ్యాహ్నం రెండు పేపర్లుగా నిర్వహించింది. ఈ పరీక్షల్లో ప్రశ్నల తీరుపై విద్యార్థులలో ఎక్కువ మంది మ్యాథ్స్ ప్రశ్నలు సుదీర్ఘంగా (లెంగ్తీ), డిఫికల్టీ (కష్టం)గా ఉన్నట్లు అభిప్రాయపడ్డారు. కొన్ని చోట్ల పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కంప్యూటర్లలో స్క్రీన్‌ను కిందికి, పైకి జరపడంలో సమస్యలు ఎదుర్కొన్నామని, దీనివల్ల తమకు సమయం వృధా అయి నష్టం వాటిల్లిందని కొందరు పేర్కొన్నారు. జేఈఈ మెయిన్స్‌లో 178 ర్యాంకు సాధించిన తెలుగు విద్యార్థి సాయి సూదన్ మాట్లాడుతూ.. ఫస్ట్ పేపర్ కొంత ఫర్వాలేదని, సెకండ్ పేపర్ కష్టంగా ఉందని తెలిపారు. మ్యాథ్స్ ప్రశ్నలు ఫస్ట్ పేపర్లో లెంగ్తీగా ఉన్నాయని, సెకండ్ పేపర్లో డిఫికల్టీగా ఉన్నాయని వివరించారు. మెరిట్ స్టూడెంట్లు మొదటి పేపర్లో 160 మార్కులు, సెకండ్ పేపర్లో 140 మార్కుల వరకు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వగలిగే పరిస్థితి ఉందన్నారు. మొత్తంగా 360 మార్కులకు గాను టాప్ మార్కులుగా 320 వరకు వచ్చే అవకాశముందన్నారు. 'ఉదయం పేపర్ యావరేజ్‌గా ఉంది. కానీ కంప్యూటర్లో సాంకేతిక సమస్య మమ్మల్ని ఇబ్బంది పెట్టింది. మధ్యాహ్నం పేపర్లో ఫిజిక్స్, కెమిస్ట్రీ బాగున్నా.. మ్యాథ్స్ కఠినంగా ఉండటంతో టైమ్ ఎక్కువ తీసుకుంది' అని జేఈఈ మెయిన్స్‌లో 189వ ర్యాంకు సాధించిన మణికంఠ పేర్కొన్నారు. మరో విద్యార్థి సౌరభ్ మాట్లాడుతూ ఆర్గానిక్ కెమిస్ట్రీ కష్టంగా ఉందని, 11వ తరగతి కంటే 12వ తరగతి కెమిస్ట్రీ నుంచి ఎక్కువ ప్రశ్నలు వచ్చాయని చెప్పారు. గణితంలో ప్రశ్నల నిడివి ఎక్కువగా ఉందన్నారు. కొన్ని ప్రశ్నలు తికమక పెట్టే రీతిలో ఉన్నాయని వివరించారు. ఫిజిక్స్, కెమిస్ట్రీలో మోడరేట్ ప్రశ్నలు వచ్చాయని పలువురు విద్యార్థులు తెలిపారు.

గతంలో కన్నా ఎక్కువ మంది హాజరు

- 2022లో 6,48,555 మంది బాలురు, 2,57,031 మంది బాలికలు మెయిన్స్ పరీక్ష రాశారు. వీరి నుంచి 2.5 లక్షల మందిని జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హులుగా ఎంపిక చేయగా, వీరిలో 1.6 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. తుదకు 98,500 మంది పరీక్ష రాశారు. 2021లో 58.1 శాతం కాగా, ఈసారి 61.5 శాతానికి పైగా హాజరయ్యారు.
- అభ్యర్థులు తమ ఆన్సర్ షీట్ల ప్రతులను సెప్టెంబర్ 1 ఉదయం 10 గంటల నుండి 3వ తేదీ ఉదయం 10 గంటల వరకు అధికారిక వెబ్‌సైట్ 'జేఈఈ.ఏడీవీ.ఏసీ.ఐఎన్' నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చు.
- 3వ తేదీన ప్రాథమిక కీ విడుదల చేస్తారు. 4వ తేదీ సాయంత్రం వరకు కీపై అభ్యంతరాలు స్వీకరిస్తారు.
- అభ్యంతరాలను పరిశీలించాక సెప్టెంబర్ 11న తుది సమాధాన కీ, తుది ఫలితాలను ప్రకటిస్తారు.
- ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఏఏటీ)–2022 కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సెప్టెంబర్ 11 ఉదయం 10 గంటల నుండి సెప్టెంబర్ 12 సాయంత్రం 5 గంటల వరకు చేసుకోవచ్చు. జేఈఈ సీట్ల కేటాయింపునకు సంబంధించి జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) కౌన్సెలింగ్ ప్రక్రియ సెప్టెంబర్ 12 నుంచి ప్రారంభమవుతుంది. ఏఏటీ ఫలితాలు సెప్టెంబర్ 17న విడుదల చేస్తారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.